www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 1-5-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 15 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి తె. 4.02 తదుపరి నవమి; నక్షత్రం: శ్రవణం తె. 3.11 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ.7.59-9.31; దుర్ముహూర్తం: ఉ.11.46-12.37; అమృతఘడియలు: సా.5.12-6.44; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 5.52, సూర్యాస్తమయం: 6.31 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

Happiness Blooms!

Welcome to Bhashyam Blooms.
The Fastest Growing CBSE Newtork of Schools in South India



Bhashyam schools, spread across Telangana, Andhra Pradesh and Karnataka, offer pioneering educational CBSE programmes that have earned us several regional, national and international accolades.

Our commitment to constantly evolving and keeping up with emerging skills and trends worldwide has led us to forge tie-ups with leading global organizations to bring the best practices to our schools.

The outstanding success of Bhashyamities in CBSE, SSC, and top ranks in JEE and NEET has made us South India's leading and most preferred educational group.

In three decades, we have created milestones through our path-breaking and innovative programmes. Join us in our successful journey towards excellence in education. Together, let's shape a brighter future for our students!



TELANGANA :
MANIKONDA : Mbl.: 88866 77111, 88866 55444, MAHESWARAM : Mbl.: 88866 68985/86
NAGOLE : Tel.: 040-29704920, Mbl.: 88866 69920/30, KAPRA : Mbl.: 88866 33746/56/96
PRAGATHI NAGAR : Mbl.: 91213 26111/222/333, PATANCHERU : Mbl.: 91213 26444/555
HAYATH NAGAR : Mbl.: 73374 46363 / 6464, PEERZADIGUDA : Mbl.: 73374 48282 / 8383
ALWAL : Mbl.: 93917 75428 / 29, SAMANAGAR : Mbl.: 63039 12101/02/03
BRAHMANAPALLY : Mbl.: 88861 24646/4747, **BROOKS** : Mbl.: 98487 79020, 88855 50044

ANDHRA PRADESH :
GUNTUR : TEL.: 0863-2246015, 2256939, Mbl.: 98485 36968
VIJAYAWADA : Mbl.: 95422 54444, 96185 08686
RAJAHMUNDRY : Mbl.: 88869 22422, 88869 33433
KAKINADA : Mbl.: 88850 34224
VIZIANAGARAM : Mbl.: 88862 86677, 88862 96677
KARNATAKA : BENGALURU : Mbl.: 99880 90948



BHASHYAM BLOOMS® school

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

పదిలో నిర్మల్ జిల్లా ఫస్ట్.. వికారాబాద్ లాస్ట్



91.3 శాతం మంది విద్యార్థులు పాస్

బాలురు 89.42%, బాలికలు 93.23%

ఉత్తీర్ణతలో ప్రభుత్వ, జడ్పీ స్కూళ్లు లాస్ట్

జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

టెన్త్ ఫలితాలు విడుదల చేస్తున్న అధికారులు

3

బుధవారం | 1-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 15 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ*





మెదక్ జిల్లా జహీరాబాద్ సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ; భారీ సంఖ్యలో హాజరైన బీజేపీ కార్యకర్తలు, అభిమానులు

తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్!

వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు రహస్యంగా చెల్లించుకుంటున్నారు

ఆ సొమ్మంతా ఢిల్లీకి వెళ్తోంది

ట్రిపుల్ ఆర్‌తో దేశం తలెత్తుకుంటే.. డబుల్ ఆర్‌తో తల దించుకుంటోంది

నా ప్రాణం ఉన్నంతవరకూ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను ముస్లింలకు దక్కనివ్వ

రాజ్యాంగాన్ని మార్చే శక్తి ఎవరికీ లేదు

ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకే ఫేక్ వీడియో

అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటే

మెదక్ జిల్లా అల్లాదుర్గంలో ప్రధాని మోదీ

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డబుల్ ఆర్ (ఆర్ఆర్) ట్యాక్స్ విధించిందంటూ సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీలపై ప్రధాని మోదీ పరోక్ష విమర్శలు గుప్పించారు. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు ఈ ట్యాక్సును రహస్యంగా ఇచ్చుకోవాల్సి వస్తోందని, తెలంగాణ వ్యాప్తంగా దీనిపై చర్చ జరుగుతోందన్నారు. డబుల్ ఆర్ ట్యాక్సు ఢిల్లీకి వెళ్తుందని, అక్కడ ఎవరికి చేరుతుందో అందరికీ తెలుసన్నారు. ఈ సందర్భంగా, ఆస్కార్ అవార్డు అందుకున్న ట్రిపుల్ ఆర్ సినిమాను మోదీ ప్రస్తావించారు. 'ట్రిపుల్ ఆర్ సినిమాతో మన దేశ ఖ్యాతిని తెలుగు సినీ పరిశ్రమ ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పింది. కానీ, డబుల్ ఆర్ ట్యాక్స్‌తో దేశం సిగ్గుతో తలదించుకుంటోంది' అని

మిగతా 11వ పేజీలో...

ప్రతిపక్షాల ప్రేమ దుకాణంలో నకిలీ వీడియోల అమ్మకం

ఆ దుకాణాన్ని ఇక మూసేయాల్సిందే

ఈ ఎన్నికలు దేశ గౌరవానికి సంబంధించినవి

ఎప్పుడంటే అప్పుడు కూలిపోయే ప్రభుత్వాలతో ఉపయోగం లేదు 9

కూటమి వస్తే ప్రధాని పీఠంపై ఏడాదికి ఒకరు

సమస్యలు-కాంగ్రెస్ కవల పిల్లలు

మహారాష్ట్ర ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ

కేసీఆర్‌కు నో ఎంట్రీ

ఆయన్ను ఇండియా కూటమిలో కలవనివ్వం

ఆ ఇంటిపై వాలిన కాకి కాంగ్రెస్ గోడపై వాలితే కాల్చి పడేస్తాం

పన్నెండు సీట్లు వస్తే బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందా?

కేసీఆర్.. ఇక నీ జీవితంలో పదవిని కళ్లతో చూడలేవ్

ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు ఇచ్చింది గాడిద గుడ్డే

గుజరాత్ పెత్తనానికి.. తెలంగాణ పౌరుషానికి మధ్య పోరు

బీజేపీ గెలిస్తే రిజర్వేషన్లు రద్దు

కేసీఆర్ తిట్టే తిట్లే మోదీ తిట్టారు

జమ్మికుంట, రేగొండ, బాలాపూర్, ఎన్టీఆర్ నగర్‌ల్లో రేవంత్



జమ్మికుంట జన జాతర సభలో 'గాడిద గుడ్డు'ను ప్రదర్శిస్తున్న సీఎం

కరీంనగర్, భూపాలపల్లి, హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేసీఆర్‌ను ఇండియా కూటమిలోకి రానివ్వబోమని.. ఆయన ఇంటి మీద వాలిన కాకి కాంగ్రెస్ గోడ మీద వాలినా కాల్చివేస్తామని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కేసీఆర్ బీజేపీతో చీకటి ఒప్పందం కుదుర్చుకుని కాంగ్రెస్‌ను ఓడించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. అందుకే ఆయన ఖమ్మం సభలో.. కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో 40 సీట్లు రావని, బీజేపీకి 200 సీట్లలోపే వస్తాయని, రాష్ట్రంలో తమకు 12 సీట్లు ఇస్తే సంకీర్ణంలో చేరి నామాను కేంద్రమంత్రి చేస్తామని అన్నారని దుయ్యబట్టారు. "బీఆర్ఎస్‌కు 12 సీట్లు వస్తే కేంద్రంలో అధికారంలోకి వస్తుందా?" అని రేవంత్ ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మంగళవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో, భూపాలపల్లి జిల్లా రేగొండలో జరిగిన జనజాతర సభల్లో, హైదరాబాద్‌లోని బాలాపూర్, ఎన్టీఆర్‌నగర్‌లో నిర్వహించిన రోడ్‌షోల సందర్భంగా ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ పౌరుషాన్ని గుజరాత్‌కు చేరే విధంగా చాటాలని పిలుపునిచ్చారు. బీజేపీ వాళ్లు సూరత్‌కు పారిపోయే విధంగా తీర్పు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పదేళ్ల పాలనలో తెలంగాణకు మోదీ ఇచ్చింది ఏం లేదని, ఇక్కడి (కరీంనగర్) ఎంపీ బండి సంజయ్ తెచ్చింది ఏం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 60 ఏళ్ల తెలంగాణ ఆకాంక్షను, 1200 మంది తెలంగాణ బిడ్డల బలిదానాలను అవమానపరిచే విధంగా మోదీ పార్లమెంట్‌లో మాట్లాడితే ఎంపీగా ఉన్న బండి సంజయ్ ఏం మాట్లాడకుండా

మిగతా 12వ పేజీలో...



పోలీసులు సీజ్ చేసిన సామగ్రి

అబూజ్‌మడ్‌లో పేలిన తూటా..

10 మంది మావోయిస్టుల మృతి

మృతుల్లో ముగ్గురు మహిళలు.. కీలక నేతలు 9

ఏకే-47 తుపాకీ, ఇన్సాస్, పేలుడు పదార్థాలు సీజ్

50 రోజుల్లో ఏడో ఎన్‌కౌంటర్

4 నెలల్లో 91 మంది మృతి

ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన 250 మంది నక్సల్స్.. 125 మంది అరెస్ట్

'డర్టీ' పిక్చర్ గుట్టు రట్టయింది..

ప్రజ్వల్ డ్రైవర్ వల్లే!

15 ఏళ్లు డ్రైవర్‌గా పనిచేసిన కార్తీక్

తన భూమిని రేవణ్ణ లాక్కోవడంతో ఉద్యోగం మానేశానని వెల్లడి

దేవరాజెకు వీడియోలు ఇచ్చింది అతడే

కాంగ్రెస్‌కు ఇచ్చిందీ కార్తీకేనన్న దేవరాజె

ప్రజ్వల్‌పై సస్పెన్షన్ వేటు వేసిన జేడీఎస్

తప్పు చేసినవారికి శిక్ష తప్పదు: షా

సమగ్ర నివేదిక ఇవ్వాలని కర్ణాటక డీజీపీకి మహిళా కమిషన్ ఆదేశాలు

24 గంటల్లో విచారణకు రావాలంటూ రేవణ్ణ, ప్రజ్వల్‌కు సిట్ నోటీసు 9

నైరుతిలో వర్షాలే వర్షాలు!



లానినాతో బలపడనున్న రుతుపవనాలు

దక్షిణాసియా వాతావరణ ఫోరం, ఐఎండీ అంచనాలు 3

ఈడీ, ఐటీని దించండి

'ఆర్ఆర్ ట్యాక్స్' నిజమైతే రేవంత్ రెడ్డిపై దర్యాప్తు చేయించండి

మోదీ సర్కార్‌కు కేసీఆర్ డిమాండ్

స్వతంత్ర వ్యవస్థలన్నీ కేంద్రం అధీనంలోకి

గోదావరి నీటిని కర్ణాటక, తమిళనాడుకు తరలించేందుకు మోదీ కుట్ర చేస్తున్నారు

అడ్డగోలు హామీలతో ఓట్లు కొల్లగొట్టి.. రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్

ఉచిత బస్సు ప్రయాణం పేరుతో ఆటోవాలాల బతుకులు ఛిద్రం చేశారు

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటేస్తే గోదాట్లో వేసినట్లే: బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్

కొత్తగూడెంలో రోడ్ షో, కార్నర్ మీటింగ్



12

కాంగ్రెస్ ఫేక్ ప్రచారం



బీజేపీ వస్తే రిజర్వేషన్లు తీసేస్తారంటూ తప్పుడు విమర్శలు

మత ప్రాతిపదికన ఇచ్చే రిజర్వేషన్లకే మేం వ్యతిరేకం

రాజ్యాంగాన్ని మారుస్తారనేది కూడా తప్పుడు ప్రచారమే: షా

తాను మాట్లాడిన అసలు వీడియో.. ఫేక్ వీడియో ప్రదర్శన

ఫేక్ ప్రచారంలో బీజేపీ దిట్ట... ఖర్గే ఎదురుదాడి 9

అమిత్‌షా ఫేక్ వీడియో కేసు.. 11

ఢిల్లీకి వెళ్లొద్దని రేవంత్ నిర్ణయం

అదేబాటలో కాంగ్రెస్ సోషల్ మీడియా టీమ్

ఎఫ్ఐఆర్ అధ్యయనానికి గడువు కావాలి

ఢిల్లీ పోలీసులకు టీపీసీసీ లీగల్ టీమ్ లేఖ

ఫేక్ వీడియో కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే పీఏ, ఆప్ నేత అరెస్టు

రేవంత్‌కు సమన్లు.. తెలంగాణ ప్రజలను అవమానించడమే: జైరాం

11

ఓయూ సెలవులపై.. బీఆర్ఎస్

ఫేక్ నోటీసు సృష్టి?

పోలీసులకు చీఫ్ వార్డెన్ ఫిర్యాదు

2023లో కరెంటు, నీటి సమస్యతో ఓయూకు సెలవులు ఇచ్చారు: రేవంత్‌రెడ్డి

నాటి నోటీసులను పోస్ట్ చేసిన సీఎం

ఆ నోటీసు ఫేక్ అన్న బీఆర్ఎస్

ఒరిజినల్ అంటూ మరో నోటీసు తెరపైకి

అది బీఆర్ఎస్ సృష్టేనని వార్డెన్ స్పష్టీకరణ

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ వేసవి సెలవుల వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీరును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎండగట్టారు. ఓయూకు మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి సెలవులు ఇస్తూ చీఫ్ వార్డెన్ జారీ చేసిన నోటీసులను ప్రస్తావిస్తూ కేసీఆర్ సోమవారం 'ఎక్స్'లో విమర్శలు చేయడంపై

మిగతా 11వ పేజీలో...

రాహుల్, శ్రేయాస్‌లపై వేటు
చాహల్, దూబేలకు చోటు

వికెట్ కీపర్లుగా పంత్, శాంసన్
హార్దిక్‌కు వైస్‌కెప్టెన్సీ
టీ20 వరల్డ్‌కప్‌నకు భారత జట్టు


రాహుల్


పంత్


చాహల్

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్‌కప్‌లో తలపడే భారత జట్టును జాతీయ సెలెక్టర్లు మంగళవారం ప్రకటించారు. 15 మందితో కూడిన ఈ బృందానికి ఊహించినట్టుగానే రోహిత్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. అయితే హార్దిక్ పాండ్యా ఎంపికపై కొంత సందేహాలు వ్యక్తమైనా.. తను బెర్త్ దక్కించుకోవడంతో పాటు జట్టు వైస్ కెప్టెన్సీ కూడా దక్కించుకున్నాడు. 2022 టీ20 వరల్డ్‌కప్ సెమీస్‌లో ఓడాక భారత జట్టులో మార్పుల కారణంగా రోహిత్, విరాట్ లేకుండానే ముందుకెళ్లారు. కానీ తిరిగి రోహిత్‌తో పాటు విరాట్ కోహ్లీ సైతం ఈ మెగా టోర్నీలో ఆడబోతుండడం గమనార్హం. ఓపెనర్‌గా యశస్వీ జైస్వాల్, విడిలార్డర్‌లో విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా రానున్నారు. ఇక జూన్ ఒకటి నుంచి 29 వరకు వెస్టిండీస్, యూఎస్ఏలో ఈ మెగా టోర్నీ జరుగుతుంది. ఇందుకోసం భారత ఆటగాళ్లు విడతలవారీగా అమెరికా వెళ్లనున్నారు. కోచ్ ద్రవిడ్‌తో కలిసి తొలి బ్యాచ్ మే 21న బయలుదేరుతుంది.

రాహుల్‌కు నిరాశే..: జట్టులో స్టార్ ఆటగాడిగా కొనసాగుతున్న కేఎల్ రాహుల్‌పై ఆశ్చర్యకరంగా సెలెక్టర్లు వేటు వేశారు. ఐపీఎల్‌లో నిలకడగానే రాణిస్తున్నప్పటికీ అతడికి స్థానం దక్కలేదు అలాగే మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్‌ను సైతం విస్మరించారు. ఇక ఫినిషర్ రింకూ సింగ్, ఓపెనర్ గిల్ రిజర్వ్ ప్లేయర్లుగా ఉంటారు. ఇప్పటికే టీ20ల్లో భారత్ తరఫున ఆడిన తిలక్ వర్మ, ముకేశ్ కుమార్‌లకు నిరాశే ఎదురైంది. యువ పేసర్ మయాంక్ యాదవ్‌ను సైతం సెలెక్టర్లు పట్టించుకోలేదు.

రిషభ్.. 17 నెలల తర్వాత

వికెట్ కీపర్ రిషభ్ పంత్ సుదీర్ఘ విరామం తర్వాత జాతీయ జట్టులో ఆడబోతున్నాడు. 2022, డిసెంబరులో కారు ప్రమాదానికి గురైన అతను తాజా ఐపీఎల్‌లో మెరుగ్గానే రాణిస్తున్నాడు. దీంతో వికెట్ కీపర్‌గా అతడితో పాటు సంజూ శాంసన్‌ను ఎంపిక చేశారు.ఇక, శాంసన్‌కిది తొలి వరల్డ్‌కప్. 2015లోనే జట్టులోకి వచ్చినా ఇప్పటికి 25 మ్యాచ్‌లే ఆడాడు. అలాగే స్పిన్నర్ చాహల్‌పై తిరిగి సెలెక్టర్లు నమ్మకముంచారు. గతేడాది ఆగస్టులో తన చివరి టీ20 మ్యాచ్ ఆడిన చాహల్ తాజా ఐపీఎల్‌లో ఆడిన 9 మ్యాచ్‌ల్లో 13 వికెట్లు తీశాడు. జడేజా, అక్షర్, కుల్దీప్ ఇతర స్పిన్నర్లుగా ఉన్నారు. అలాగే సీఎస్‌కే విడిలార్డర్ బ్యాటర్ శివమ్ దూబేను సైతం పరిగణనలోకి తీసుకున్నారు. స్పిన్నర్లపై ఎదురుదాడికి దిగే దూబే మెగా టోర్నీలో ఉపయోగపడగలడని సెలెక్టర్లు భావించడంతో రింకూకు బెర్త్ దక్కలేదు. పేస్ బాధ్యతలను బుమ్రా, అర్ష్‌దీప్, సిరాజ్ తీసుకోనున్నారు.

ఇదే మన సైన్యం

బ్యాటర్లు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వీ జైస్వాల్, కోహ్లీ, సూర్యకుమార్.
ఆల్‌రౌండర్లు: హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్.
వికెట్‌కీపర్లు: రిషభ్ పంత్, సంజూ శాంసన్
బౌలర్లు: అర్ష్‌దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్, కుల్దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్.
రిజర్వ్ ఆటగాళ్లు: శుభ్‌మన్ గిల్, రింకూ సింగ్, ఖలీల్ అహ్మద్, అవేశ్ ఖాన్.

భారత జట్టు గ్రూపు దశ మ్యాచ్‌లివే

ఎప్పుడు	ప్రత్యర్థి	వేదిక	సమయం
జూన్ 5	ఐర్లాండ్	న్యూయార్క్	రా. 7.30 గం.
జూన్ 9	పాకిస్తాన్	న్యూయార్క్	రా.8 గం.
జూన్ 12	అమెరికా	న్యూయార్క్	రా.8 గం.
జూన్ 15	కెనడా	లాడర్‌హిల్	రా.8 గం.

ఉబెర్ కప్‌లో అమ్మాయిలకు ఓటమి

చెంగ్డూ (చైనా): ఉబెర్ కప్ గ్రూప్ దశను భారత మహిళల జట్టు పరాజయంతో ముగించింది. గ్రూప్-ఎలో మంగళవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ 0-5తో చైనా చేతిలో చిత్తయింది. కెనడా, సింగపూర్‌లపై విజయాలతో ఇప్పటికే క్వార్టర్స్ బెర్త్ సొంతం చేసుకొన్న భారత్.. చైనాకు కనీస పోటీ కూడా ఇవ్వలేక పోయింది.

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: చెన్నై
చెన్నై X పంజాబ్

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	9	8	1	0	16	0.694
కోల్‌కతా	9	6	3	0	12	1.096
లఖ్‌నవూ	10	6	4	0	12	0.094
చెన్నై	9	5	4	0	10	0.810
హైదరాబాద్	9	5	4	0	10	0.075
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
గుజరాత్	10	4	6	0	8	-1.113
పంజాబ్	9	3	6	0	6	-0.187
ముంబై	10	3	7	0	6	-0.272
బెంగళూరు	10	3	7	0	6	-0.415

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

20 జట్లు...55 మ్యాచ్‌లు

అమెరికా-వెస్టిండీస్ వేదికలుగా మొత్తం 20 జట్లు పాల్గొనే ఈ టీ20 ప్రపంచకప్ జూన్ ఒకటి నుంచి జరగనుంది. 20 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రతి గ్రూపునుంచి టాప్‌లో నిలిచే రెండు జట్లు సూపర్-8కు చేరతాయి. జూన్ 29న జరిగే ఫైనల్‌కు బార్బడోస్ వేదిక కానుంది. అమెరికాలో మూడు, వెస్టిండీస్‌లో ఆరు వేదికల్లో కలిపి ఈ వరల్డ్‌కప్‌లో మొత్తం 55 మ్యాచ్‌లు జరుగుతాయి.

గట్టెక్కిన జెయింట్స్

పోరాడి ఓడిన ముంబై । ప్లేఆఫ్స్ రేసు నుంచి హార్దిక్ సేన అవుట్?


స్టొయినిస్ (45 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 62)

లఖ్‌నవూ: ఆఖరి ఓవర్ వరకూ ఉత్కంఠగా సాగిన లోస్కోరింగ్ మ్యాచ్‌లో.. నెగ్గిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ప్లేఆఫ్స్‌కు మరింత చేరువైంది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' స్టొయినిస్ (45 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 62) అర్ధ శతకంతో పాటు బౌలర్లు రాణించడంతో.. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ 4 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌పై గెలిచింది. తొలుత ముంబై 20 ఓవర్లలో 144/7 స్కోరు చేసింది. నేహల్ వధేరా (46), టిమ్ డేవిడ్ (35 నాటౌట్), ఇషాన్ కిషన్ (32) ఫర్వాలేదనిపించారు. ఛేదనలో లఖ్‌నవూ 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 145 పరుగులు చేసి గెలిచింది. రాహుల్ (28) రాణించాడు. ఈ విజయంతో లఖ్‌నవూ 3వ స్థానానికి ఎగబాకగా.. ఏడో ఓటమితో ముంబై నాకౌట్ అవకాశాలు దాదాపుగా ముగిశాయి. గాయం నుంచి కోలుకొని ఈ మ్యాచ్‌లో ఆడిన మయాంక్ 3.1 ఓవర్లు బౌల్ చేసిన తర్వాత మళ్లీ నొప్పితో మైదానం వీడాడు.

ఆఖర్లో ఒత్తిడి: స్వల్ప ఛేదనలో స్టొయినిస్ రాణించినా.. లఖ్‌నవూ కష్టంగానే గట్టెక్కింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన అరంగేట్రం ఆటగాడు అర్షిన్ కులకర్ణి (0)ని తుషార గోల్డెన్ డక్‌గా పెవిలియన్ చేర్చాడు. అయితే, రాహుల్‌కు జత కలసిన స్టొయినిస్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరోవైపు రాహుల్.. 5వ ఓవర్‌లో తుషార బౌలింగ్‌లో 4,6,4,4తో 20 రన్స్ రాబట్టాడు. పవర్‌ప్లే ముగిసేసరికి లఖ్‌నవూ 52/1తో నిలిచింది. కాగా, ధాటిగా ఆడుతున్న రాహుల్‌ను అవుట్ చేసిన హార్దిక్.. రెండో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఈ దశలో స్టొయినిస్, దీపక్ హుడా (18) సంయమనంతో ఆడడంతో 10 ఓవర్లకు లఖ్‌నవూ 79/2తో మెరుగ్గానే కనిపించింది. అయితే, హుడాను పాండ్యా అవుట్ చేశాడు. నబి బౌలింగ్‌లో స్టొయినిస్ కూడా అదే ఓవర్‌లో అవుటయ్యాడు. చివరి 5 ఓవర్లలో సూపర్ జెయింట్స్ విజయానికి 29 రన్స్ కావాల్సి ఉండగా.. పూరన్ (14 నాటౌట్), టర్నర్ (5) నెమ్మదిగా ఆడడంతో ఆందోళన రేగింది. పైగా 17వ ఓవర్ బౌల్ చేసిన బుమ్రా ఒక్క పరుగే ఇవ్వగా.. తర్వాతి ఓవర్ తొలి బంతికే టర్నర్‌ను కొట్జీ బౌల్డ్ చేసి షాకిచ్చాడు. ఇక, బదోని (6) రనౌటైనా.. ఒత్తిడి మధ్య పూరన్ మ్యాచ్‌ను ముగించాడు.

టాప్ ఢమాల్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హార్దిక్ సేన ఆరంభంలోనే తడబడింది. రోహిత్ (4)ను మొహిసిన్ స్వల్ప స్కోరుకే క్యాచవుట్ చేయగా.. సూర్యకుమార్ (10)ను స్టొయినిస్ వెనక్కిపంపాడు. తిలక్ వర్మ (7) రనౌట్ కాగా.. హార్దిక్ (0)ను నవీనుల్ డకౌట్ చేశాడు. దీంతో పవర్‌ప్లేలో ముంబై 28/4తో కష్టాల్లో పడింది. ఈ దశలో ఓపెనర్ ఇషాన్, వధేరా ఐదో వికెట్‌కు 53 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. 9వ ఓవర్‌లో మయాంక్ బౌలింగ్‌లో కిషన్ ఇచ్చిన క్యాచ్‌ను టర్నర్ చేజార్చాడు. అయితే, గేర్ మార్చే ప్రయత్నం చేస్తున్న ఇషాన్‌ను బిష్ణోయ్ బోల్తా కొట్టించాడు. ఆ తర్వాతి ఓవర్‌లో మయాంక్ బౌలింగ్‌లో వధేరా 6,6,4తో 16 పరుగులతో స్కోరు వేగం పెంచారు. అర్ధ శతకానికి చేరువవుతున్న తరుణంలో వధేరాను మొహిసిన్ అద్భుతమైన యార్కర్‌తో బౌల్డ్ చేయగా.. నబి (1)ని మయాంక్ అవుట్ చేశాడు. కానీ, డెత్‌లో డేవిడ్ కొంత ధాటిగా ఆడడంతో ముంబై 140 మార్క్ అయినా దాటింది.

స్కోరుబోర్డు

ముంబై: ఇషాన్ (సి) మయాంక్ (బి) బిష్ణోయ్ 32, రోహిత్ (సి) స్టొయినిస్ (బి) మొహిసిన్ 4, సూర్యకుమార్ (సి) రాహుల్ (బి) స్టొయినిస్ 10, తిలక్ (రనౌట్) 7, హార్దిక్ (సి) రాహుల్ (బి) నవీనుల్ 0, నేహల్ (బి) మొహిసిన్ 46, టిమ్ డేవిడ్ (నాటౌట్) 35, నబీ (బి) మయాంక్ 1, కొట్జీ (నాటౌట్) 1, ***ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 144/7; వికెట్ల పతనం:*** *1-7, 2-18, 3-27, 4-27, 5-80, 6-112, 7-123;* ***బౌలింగ్:*** *స్టొయినిస్ 3-0-19-1, మొహిసిన్ 4-0-36-2, నవీనుల్ 3.5-0-15-1, మయాంక్ యాదవ్ 3.1-0-31-1, రవి బిష్ణోయ్ 4-0-28-1, దీపక్ హుడా 2-0-13-0.*

లఖ్‌నవూ: రాహుల్ (సి) నబీ (బి) హార్దిక్ 28, అర్షిన్ (ఎల్బీ) తుషార 0, స్టొయినిస్ (సి) తిలక్ (బి) నబీ 62, దీపక్ హుడా (సి) బుమ్రా (బి) హార్దిక్ 18, పూరన్ (నాటౌట్) 14, టర్నర్ (బి) కొట్జీ 5, బదోని (రనౌట్) 6, క్రునాల్ (నాటౌట్) 1, ***ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 19.2 ఓవర్లలో 145/6; వికెట్ల పతనం:*** *1-1, 2-59, 3-99, 4-115, 5-123, 6-133;* ***బౌలింగ్:*** *తుషార 4-0-30-1, బుమ్రా 4-0-17-0, కొట్జీ 3-0-29-1, పీయూష్ 3-0-23-0, హార్దిక్ 4-0-26-2, నబీ 1.2-0-16-1.*

బవుమా, ఎన్‌గిడి అవుట్

కేప్‌టౌన్: టీ20 వరల్డ్‌కప్‌లో పాల్గొనే దక్షిణాఫ్రికా జట్టులో మాజీ కెప్టెన్ తెంబా బవుమా, పేసర్ ఎన్‌గిడిలకు చోటు దక్కలేదు. కెప్టెన్‌గా మార్‌క్రమ్ వ్యవహరించనున్నాడు. అలాగే తొమ్మిది నెలల విరామం తర్వాత పేసర్ నోకియా జట్టులో చేరనున్నాడు. రొసో, వాన్‌డర్ డుస్సెన్‌లపైనా వేటు పడింది.

దక్షిణాఫ్రికా జట్టు: మార్‌క్రమ్ (కెప్టెన్), డికాక్, హెన్‌డ్రిక్స్, క్లాసెన్, మిల్లర్, స్టబ్స్, రికెల్టన్, రబాడ, జాన్సెన్, కేశవ్ మహరాజ్, ఫోర్టున్, నోకియా, కొట్జీ, షంసీ, బార్ట్‌మన్.

ఇంగ్లండ్ జట్టులో ఆర్చర్

లండన్: టీ20 వరల్డ్‌కప్‌లో ఆడే ఇంగ్లండ్ జట్టులో పేసర్ జోఫ్రా ఆర్చర్ చోటు దక్కించుకున్నాడు. బట్లర్ నేతృత్వంలో 15 మందితో కూడిన జట్టును మంగళవారం ప్రకటించారు. గాయం నుంచి కోలుకున్న ఆర్చర్ ఏడాది తర్వాత పునరాగమనం చేయనున్నాడు. స్పిన్నర్ టామ్ హార్ట్‌లీ ఒక్కడే అన్‌క్యాప్డ్ ప్లేయర్. అలాగే ఇదే జట్టు మే 22 నుంచి పాక్‌తో జరిగే నాలుగు టీ20ల సిరీస్‌లోనూ పాల్గొంటుంది. దీంతో ఐపీఎల్‌లో ఆడుతున్న ఇంగ్లండ్ ఆటగాళ్లు బట్లర్, మొయిన్ అలీ, ఫిల్ సాల్ట్, బెయిర్‌స్టో, సామ్ కర్రాన్, టోప్లే, లివింగ్‌స్టోన్, విల్ జాక్స్ ప్లేఆఫ్స్‌కు ముందే తమ జట్లను వీడనున్నారు.

భారత్‌కు రెండో గెలుపు

సిల్హెట్: బంగ్లాదేశ్‌తో రెండో టీ20లో భారత మహిళల జట్టు డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 19 పరుగులతో నెగ్గింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బంగ్లా 20 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌటైంది. రాధా యాదవ్‌కు మూడు.. దీప్తి, శ్రేయాంకలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 5.2 ఓవర్లలో 47/1 స్కోరు దగ్గర భారీ వర్షం కురవడంతో మ్యాచ్ రద్దయ్యింది. అప్పటికే రన్‌రేట్ మెరుగ్గా ఉండడంతో భారత్‌ను విజేతగా ప్రకటించారు.

హర్షిత్‌పై మ్యాచ్ నిషేధం

కోల్‌కతా: ఐపీఎల్ నియమావళిని ఉల్లంఘించిన కోల్‌కతా నైట్‌రైడర్స్ పేసర్ హర్షిత్ రాణాకు 100 శాతం మ్యాచ్‌ఫీజు జరిమానాతోపాటు ఓ మ్యాచ్ నిషేధం విధించారు. సోమవారం ఢిల్లీతో మ్యాచ్‌లో అభిషేక్ పొరెల్‌ను అవుట్‌చేసిన రాణా ఫ్లయింగ్‌కిస్‌తో సెండాఫ్ ఇచ్చి దురుసుగా ప్రవర్తించాడు. ఈ ఐపీఎల్‌లో అతను ఇలా చేయడం ఇది రెండోసారి.

నిత్య, ప్రత్యూషకు స్వర్ణాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇండియన్ గ్రాండ్ ప్రీలో తెలుగు అథ్లెట్లు నిత్య (తెలంగాణ), ప్రత్యూష (ఆంధ్రప్రదేశ్), షణ్ముగం (ఆంధ్రప్రదేశ్) పతకాలు కొల్లగొట్టారు. మంగళవారం బెంగుళూరులో జరిగిన ఈ పోటీల్లో 100 మీటర్ల రేసులో స్వర్ణం గెలిచిన నిత్య.. ఆ తర్వాత 200 మీటర్ల పరుగులో కాంస్యం అందుకుంది. ఇదే రేసులో ప్రత్యూష పసిడి పతకం సాధించింది. పురుషుల 200 మీటర్ల రేసులో షణ్ముగం కాంస్యం దక్కించుకున్నాడు.

బిజినెస్

గోద్రెజ్ కుటుంబ ఆస్తుల విభజన

- ఆది గోద్రెజ్, ఆయన సోదరుడు నదీర్‌కు ఐదు లిస్టెడ్ కంపెనీలు
- చిన్నతండ్రి పిల్లలు జంషెడ్ గోద్రెజ్, స్మితకు గోద్రెజ్ బాయిస్ సహా దాని అనుబంధ సంస్థలు

న్యూఢిల్లీ: గోద్రెజ్ గ్రూప్ ఆస్తుల విభజన కొలిక్కి వచ్చింది. ఇందుకు సంబంధించి ఆది గోద్రెజ్ (82), అతని సోదరుడు నదీర్ (73), వీరి చిన్నతండ్రి పిల్లలు జంషెడ్ గోద్రెజ్ (75) స్మిత గోద్రెజ్ క్రిష్ణా (74) ఒక ఒప్పందానికి వచ్చారు. ఈ ఒప్పందం ప్రకారం గోద్రెజ్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐదు లిస్టెడ్ కంపెనీలు ఆది గోద్రెజ్, అతని సోదరుడు నదీర్ చేతికి వస్తాయి. గోద్రెజ్ అండ్ బాయిస్, దాని అనుబంధ సంస్థలు, ముంబైలోని 3,400 ఎకరాల ల్యాండ్ పార్సిల్ జంషెడ్, అతని సోదరి స్మిత చేతికి వస్తాయి. జంషెడ్ గోద్రెజ్, స్మిత గోద్రెజ్ చేతికి వచ్చే గోద్రెజ్ అండ్ బాయిస్ కంపెనీ, దాని అనుబంధ సంస్థలు ఏరోస్పేస్, ఏవియేషన్, రక్షణ, ఫర్నీచర్, ఐటీ సాఫ్ట్‌వేర్ రంగాల్లో పట్టుంది. గోద్రెజ్ అండ్ బాయిస్ కంపెనీకి జంషెడ్ గోద్రెజ్ ఇకపై చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు. స్మిత గోద్రెజ్ కుమార్తె నిరికా హోల్కర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు. ఎలాంటి గొడవలు, మధ్యవర్తులెవరూ లేకుండా అన్నదమ్ములే కుటుంబ ఆస్తులను సామరస్యంగా పరిష్కరించుకోవడం విశేషం.

తగ్గిన మోల్డ్ టెక్ లాభం

హైదరాబాద్: మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ లిమిటెడ్ మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.160.74 కోట్ల అమ్మకాలపై రూ.27.85 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.1,468.75 కోట్ల అమ్మకాలపై రూ.292.67 కోట్ల నికర లాభం ఆర్జించింది.

ధర పెరిగినా పసిడికి తగ్గని గిరాకీ

ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 8% వృద్ధి, 136.6 టన్నులుగా నమోదు
3 నెలల్లో 19 టన్నుల గోల్డ్ కొనుగోలు చేసిన ఆర్‌బీఐ : డబ్ల్యూజీసీ వెల్లడి



న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చితో ముగిసిన తొలి త్రైమాసికానికి (క్యూ1) భారత్‌లో బంగారం గిరాకీ వార్షిక ప్రాతిపదికన 8 శాతం పెరిగి 136.6 టన్నులకు చేరుకుంది. ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) మంగళవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. గడిచిన కొన్ని నెలల్లో బంగారం ధరలు భారీగా పెరిగి సరికొత్త ఆల్‌టైమ్ గరిష్ఠాలకు చేరినప్పటికీ, దేశీయంగా బలమైన ఆర్థిక వాతావరణం ఈ విలువైన లోహానికి గిరాకీ కొనసాగేందుకు దోహదపడిందని డబ్ల్యూజీసీ రిపోర్టు పేర్కొంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సైతం దూకుడుగా బంగారం కొనుగోళ్లు జరపడం మెరుగైన వృద్ధికి మరో కారణమని నివేదిక పేర్కొంది. గత ఏడాది జనవరి-మార్చి కాలానికి గోల్డ్ డిమాండ్ 126.3 టన్నులుగా నమోదైంది. మరిన్ని ముఖ్యాంశాలు..

1 విలువపరంగా, క్యూ1లో బంగారం గిరాకీ 20 శాతం వృద్ధితో రూ.75,470 కోట్లకు పెరిగింది. సమీక్షా కాలంలో దేశీయంగా బంగారం ధరల సగటు 11 శాతం పెరిగినప్పటికీ, పసిడికి డిమాండ్ రెండంకెల స్థాయిలో వృద్ధి చెందడం గమనార్హం.

1 మొత్తం డిమాండ్‌లో స్వర్ణాభరణాల విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 4 శాతం పెరిగి 95.5 టన్నులకు చేరుకోగా.. పెట్టుబడి అవసరాల కోసం బంగారం కడ్డీలు, నాణేల కొనుగోళ్లు 19 శాతం వృద్ధి చెంది 41.1 టన్నులకు చేరుకున్నాయి. గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)లోకి సైతం 2 టన్నులకు పైగా పెట్టుబడులు వచ్చాయి. విలువపరంగా బంగారు ఆభరణాల విక్రయాలు 15 శాతం పెరిగి రూ.52,750 కోట్లుగా, బంగారంలో పెట్టుబడులు 32 శాతం పెరిగి రూ.22,720 కోట్లుగా నమోదయ్యాయి.

1 ఈ జనవరి-మార్చిలో దేశీయంగా 38.3 టన్నుల బంగారం రీసైక్లింగ్ జరిగిందని, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 10 శాతం అధికమని డబ్ల్యూజీసీ తెలిపింది.

1 క్యూ1లో ఆర్‌బీఐ 19 టన్నుల బంగారం కొనుగోలు చేసింది. గత ఏడాది మొత్తానికి కొనుగోలు చేసిన 16 టన్నుల కంటే అధికమిది. ఈ ఏడాదిలో మరింత బంగారం కొనుగోలు చేయనున్నట్లు ఆర్‌బీఐ సంకేతాలిచ్చిందని డబ్ల్యూజీసీ ఇండియా రీజినల్ సీఈఓ సచిన్ జైన్ తెలిపారు.

1 ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో దేశంలోకి బంగారం దిగుమతులు వార్షిక ప్రాతిపదికన 25 శాతం పెరిగి 179.4 టన్నులకు చేరుకున్నాయి. 2023లో ఇదే సమయానికి 143.4 టన్నుల బంగారం దిగుమతైంది.

1 క్యూ1లో ప్రపంచవ్యాప్త బంగారం డిమాండ్ 3 శాతం పెరిగి 1,238 టన్నులకు చేరుకుంది. 2016 తర్వాత గోల్డ్ గ్లోబల్ డిమాండ్‌పరంగా ఇదే అత్యంత బలమైన త్రైమాసికమని డబ్ల్యూజీసీ తన నివేదికలో పేర్కొంది.



ఈ ఏడాది దేశంలో బంగారం డిమాండ్ 700-800 టన్నుల స్థాయిలో నమోదు కావచ్చు. ధరలు మరింత ఎగబాకిన పక్షంలో పసిడి గిరాకీ వార్షిక అంచనాలోని దిగువ శ్రేణికే పరిమితం కావచ్చు. గత ఏడాది గోల్డ్ డిమాండ్ 747.5 టన్నులుగా నమోదైంది. ప్రస్తుత త్రైమాసికం (ఏప్రిల్-జూన్) విషయానికొస్తే, పసిడి ధరలు ఏప్రిల్‌లో అమాంతం పెరగడంతో పాటు ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో గిరాకీ స్తబ్దుగానే ఉండనుందని భావిస్తున్నాం.
- సచిన్ జైన్, రీజినల్ సీఈఓ, ఇండియా, డబ్ల్యూజీసీ

జోయాలుక్కాస్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు

హైదరాబాద్: ప్రముఖ జువెలరీ సంస్థ జోయాలుక్కాస్ అక్షయ తృతీయ కోసం ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. ఈ ఆఫర్‌లో భాగంగా వజ్రాలు (డైమండ్స్) కొనుగోలు చేసిన వినియోగదారులకు రూ.2,000 విలువైన ఉచిత వోచర్స్ అందించనున్నట్లు తెలిపింది. అలాగే రూ.50,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన బంగారు నగలు కొనుగోలు చేసిన ఖాతాదారులకు రూ.1,000 విలువైన గిఫ్ట్ వోచర్, రూ.10,000 విలువైన వెండి నగలు కొనే కస్టమర్లకు రూ.500 విలువైన గిఫ్ట్ వోచర్‌ను అందించనున్నట్లు జోయాలుక్కాస్ వెల్లడించింది. మే నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ మధ్య వరకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జోయాలుక్కాస్ షోరూమ్‌ల్లో ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. కాగా ఈ అక్షయ తృతీయ కోసం జోయాలుక్కాస్ 10 లక్షలకు పైగా విలక్షణమైన ఆభరణాలను తన షోరూమ్స్‌లో అందుబాటులో ఉంచింది.

డబ్ల్యూఏఎస్ఎల్ ఈక్విటీలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌కు వాటా

హైదరాబాద్: విమానాశ్రయాల్లో డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సేవలు అందించే డబ్ల్యూఏఎస్ఎల్ ఈక్విటీలో, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ 8.4 శాతం వాటా తీసుకుంది. ఇందుకోసం రూ.57 కోట్లు చెల్లించినట్లు తెలిపింది. విమానాశ్రయాలకు సంబంధించిన వ్యాపారాల్లో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునే చర్యల్లో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఈ వాటా కొనుగోలు చేసింది. ఉత్తిష్ఠ విరాట్ ఫండ్ నుంచి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఈ వాటా కోసం 4.6 లక్షల షేర్లను కొనుగోలు చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,650 ▲	66,600 ▲	87,000 ▼
ముంబై	71,710 ▼	65,686 ▼	80,050 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	365	విజయవాడ	370
వరంగల్	367	గోదావరి	370
చిత్తూరు	468	విశాఖపట్నం	400

డజను గుడ్లు రూ.48

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	129	గోదావరి	135
వరంగల్	129	విజయవాడ	135
కరీంనగర్	129	గుంటూరు	137
మహబూబ్‌నగర్	129	ఒంగోలు	137
కర్నూలు	129	చిత్తూరు	127
విశాఖపట్నం	127		

నిఫ్టీ సరికొత్త రికార్డు

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల దన్నుతో ఎన్ఎస్ఈ నిఫ్టీ మంగళవారం సరికొత్త జీవితకాల గరిష్ఠానికి ఎగబాకింది. ఇంట్రాడేలో ఒక దశలో సూచీ 139.95 పాయింట్ల లాభంతో ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 22,783.35 వద్దకు చేరుకుంది. బీఎస్ఈ సెన్సెక్స్ సైతం 440 పాయింట్లకు పైగా బలపడి 75,111.39 స్థాయికి పెరిగింది. కానీ, ఆఖరి గంటలో మదుపరులు బ్యాంకింగ్, ఐటీ, మెటల్ రంగ షేర్లలో పెద్దఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడటంతో ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సూచీలు ఏకంగా నష్టాల్లోకి మళ్లాయి. స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 188.50 పాయింట్ల నష్టంతో 74,482.78 వద్దకు జారుకుంది. నిఫ్టీ 38.55 పాయింట్లు కోల్పోయి 22,604.85 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 17 నష్టపోయాయి.

జేఎన్‌కే లిస్టింగ్ అదుర్స్: హీటింగ్ పరికరాల తయారీ సంస్థ జేఎన్‌కే ఇండియా మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.415తో పోలిస్తే బీఎస్ఈలో కంపెనీ షేరు 49.39 శాతం ప్రీమియంతో రూ.620 వద్ద లిస్టయింది. ఒకదశలో 71.56 శాతం పెరుగుదలతో రూ.712 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 67.21 శాతం లాభంతో రూ.693.95 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3,859.81 కోట్లుగా నమోదైంది. గతవారంలో ముగిసిన కంపెనీ ఐపీఓకు సైతం భారీ స్పందన లభించింది. ఇష్యూ సైజుకు 28 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ ఐపీఓకు సెబీ ఓకే: గోల్డ్ లోన్ కంపెనీ మణప్పురం ఫైనాన్స్ అనుబంధ విభాగమైన ఆశీర్వాద్ మైక్రోఫైనాన్స్ ఐపీఓకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా ఈ కంపెనీ తాజా ఈక్విటీ జారీ ద్వారా రూ.1,500 కోట్ల వరకు సమీకరించాలని భావిస్తోంది.

నేడు మార్కెట్లకు సెలవు: మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా మే 1న (బుధవారం) స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సెలవు. మార్కెట్లు గురువారం యథావిధిగా పనిచేస్తాయి.

మ్యూచువల్ ఫండ్స్‌ల్లో జరిగే మోసాలకు చెక్

- కొత్త నిబంధనలు జారీ చేసిన సెబీ

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)ల్లో జరిగే ఫ్రంట్ రన్నింగ్, మోసపూరిత లావాదేవీలు, ఇన్‌సైడర్ ట్రేడింగ్ వంటి విధానాలకు చెక్ పెట్టేందుకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మార్గదర్శకాల ప్రకారం ఎంఎఫ్‌లను నిర్వహించే అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) ఇలాంటి మోసాలను అడ్డుకునేందుకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. ఏఎంసీలు ఈ వ్యవస్థల పనితీరుకు జవాబుదారీగా ఉండడంతో పాటు బాధ్యత కూడా తీసుకోవాలని సెబీ స్పష్టం చేసింది.

మరింత పర్యవేక్షణ

ఈ వ్యవస్థలో ఉద్యోగులు, బ్రోకర్లు, డీలర్లు చేసే ఫ్రంట్ రన్నింగ్, మోసపూరిత లావాదేవీలను అడ్డుకునేందుకు మరింత పర్యవేక్షణ, అంతర్గత నియంత్రణ పద్ధతులు ఉండాలని సెబీ స్పష్టం చేసింది. ఫ్రంట్ రన్నింగ్, మోసపూరిత లావాదేవీలు జరిపే వారిని ఎప్పటికప్పుడు గుర్తించేందుకు గట్టి పర్యవేక్షణ కూడా అవసరమని తెలిపింది. మంగళవారం సమావేశమైన సెబీ డైరెక్టర్ల బోర్డు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

ఎస్ఎంఈలకు రూ.4,200 కోట్ల నిధులు: మోడిఫై

హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ (ఎస్ఎంఈ)కు ఫైనాన్సింగ్ సేవలను మరింతగా విస్తరించనున్నట్లు ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ మోడిఫై ప్రకటించింది. ఎస్ఎంఈలకు అవసరమైన బిజినెస్ టు బిజినెస్ (బీ2బీ) క్రాస్ బోర్డర్ ఫైనాన్సింగ్, పేమెంట్ సొల్యూషన్స్‌ను మోడిఫై అందిస్తోందని సంస్థ కంట్రీ హెడ్ సచిన్ నిగమ్ వెల్లడించారు. భారత్ నుంచి ఎస్ఎంఈ సంస్థల ఎగుమతులు ఏటా గణనీయంగా పెరుగుతూ వస్తున్నాయని, అయితే ఇదే సమయంలో ఈ సంస్థలు పలు ఆర్థికపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నాయన్నారు. ఇందుకోసం మోడిఫై ప్రత్యేకంగా ఎస్ఎంఈలకు అవసరమైన నిధుల (ఫైనాన్సింగ్)ను అందించటంతో పాటు బీమా సదుపాయాన్ని కల్పిస్తోందన్నారు. 2019లో మోడిఫై భారత మార్కెట్లోకి ప్రవేశించి నాటి నుంచి ఇప్పటి వరకు ఎస్ఎంఈలకు 150 కోట్ల డాలర్ల వరకు నిధుల (క్రాస్‌బోర్డర్ ఫైనాన్సింగ్)ను సమకూర్చిందని తెలిపారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఎస్ఎంఈల వాటా 15 శాతంగా ఉందన్నారు. కాగా వచ్చే రెండేళ్లలో తెలుగు రాష్ట్రాల్లోని ఎస్ఎంఈలకు 50 కోట్ల డాలర్ల (రూ.4,200 కోట్లు) వరకు నిధులను అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

ఓటర్ల కోసం అభిబస్ ప్రత్యేక ఆఫర్

హైదరాబాద్: ఆన్‌లైన్ బస్-టికెటింగ్ ప్లాట్‌ఫామ్ అభిబస్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఓటర్ల కోసం ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని తెలుగు రాష్ట్రాల్లోని ప్రజల కోసం అభివోట్ పేరుతో ఈ ఆఫర్‌ను తీసుకువచ్చినట్లు అభిబస్ సీఈఓ లెనిన్ కోడూరు, సీఓఓ రోహిత్ శర్మ తెలిపారు. ఈ ఆఫర్‌లో భాగంగా ప్రతి టికెట్ కొనుగోలుపై రూ.100 క్యాష్‌బ్యాక్‌తో పాటు 20 శాతం నుంచి రూ.250 వరకు డిస్కౌంట్‌ను అందించనున్నట్లు చెప్పారు. ఈ ఆఫర్ మే 11 నుంచి 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ బస్ టికెట్ విభాగంలో అభిబస్ 12.5 శాతం మార్కెట్ కలిగి ఉందని, తమ ప్లాట్‌ఫామ్ ద్వారా ఏపీ, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలతో పాటు 2,000 మంది ప్రైవేట్ బస్ ఆపరేటర్లు సేవలందిస్తున్నారని తెలిపారు.


ABN ఆంధ్రజ్యోతి
BIG DEBATE
బిగ్ డిబేట్ వీడియోల కోసం క్లిక్ చేయండి
Click here


ఎన్నికలు - 2024
లోక్‌సభ ఎన్నికలు
లోక్‌సభ ఎన్నికల కవరేజీ కోసం క్లిక్ చేయండి
Click here


ఎన్నికలు - 2024
ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు
ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కవరేజ్ కోసం క్లిక్ చేయండి
Click here

నైరుతిలో వర్షాలే వర్షాలు!

- లానినా ప్రభావంతో బలపడనున్న రుతుపవనాలు
- దక్షిణాసియాలోనూ సాధారణానికి మించి వర్షాలు
- దక్షిణాసియా వాతావరణ ఫోరం, ఐఎండీ అంచనాలు



విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో బలహీనపడుతూ ప్రస్తుతం చివరి దశలో ఉంది. మరికొద్దిరోజుల్లో తటస్థ పరిస్థితులు ఏర్పడి, జూలై చివరిలో లానినా ప్రభావం కనిపిస్తుందని అమెరికా, ఆస్ట్రేలియా వాతావరణ సంస్థలు ఇప్పటికే వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువగా అంటే 106 శాతం వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనాకు వచ్చింది. నైరుతి రుతుపవనాల సీజన్ రెండో భాగంలో లానినా కీలక భూమి పోషించనుండడంతో పుష్కలంగా వర్షాలు కురవనున్నాయని తెలిపింది. అదే సమయంలో దక్షిణాసియాలో కూడా సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని దక్షిణాసియా వాతావరణ ఫోరం తాజాగా పేర్కొంది. అటు భారత వాతావరణ శాఖ, ఇటు దక్షిణాసియా ఫోరం అంచనాలు ఒకేలా ఉండడం విశేషం. వచ్చే నెలలో ఎల్‌నినో అంతమైన తరువాత పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు చల్లబడనున్నాయి. దీని ఫలితంగా పసిఫిక్ నుంచి బలమైన వ్యాపార పవనాలు (ట్రేడ్ విండ్స్) వీచే అవకాశం ఉన్నందున దేశంలో పుష్కలమైన వర్షాలు కురవనున్నాయని భారత వాతావరణ సంస్థ అంచనా వేసింది. అందుబాటులో ఉన్న రికార్డుల మేరకు 1950 నుంచి ఎల్‌నినో తరువాత వచ్చే లానినా సంవత్సరాల్లో పుష్కలంగా వర్షాలు కురిశాయి. ముఖ్యంగా 1987లో బలమైన ఎల్‌నినో కొనసాగగా తరువాత లానినా ఏర్పడడంతో 1988లో దేశంలో 121 శాతం వర్షపాతం నమోదైంది. అయితే దేశంలో అన్ని ప్రాంతాల్లో సమానంగా కాకుండా కొన్నిచోట్ల ఎక్కువగా, మరికొన్ని చోట్ల తక్కువగా వర్షపాతం నమోదైన విషయాన్ని నిపుణులు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. గత ఏడాది బలహీనమైన రుతుపవనాల ప్రభావంతో దేశంలో ఆహార ధాన్యాల దిగుబడి తగ్గింది. వర్షాధారంపై ఆధారపడిన ప్రాంతంలో సాగు విస్తీర్ణం తగ్గింది. తూర్పు ప్రాంతంలో తప్ప దేశంలోని మిగిలిన చోట్ల రిజర్వాయర్లల్లో నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. గతానికంటే ప్రస్తుతం తలసరి వార్షిక నీటి లభ్యత తక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. దేశంలో 1951లో తలసరి వార్షిక నీటి లభ్యత 5178 క్యూబిక్ మీటర్లు ఉండగా 1991కల్లా 2210, ఈ ఏడాది 1700 క్యూబిక్ మీటర్లకు పడిపోయింది. అయితే ఈ ఏడాది మాత్రం పుష్కలంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున దేశంలో రిజర్వాయర్లలో నీటి నిల్వలు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇదిలావుండగా దక్షిణాసియాలో నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని దక్షిణాసియా వాతావరణ ఫోరం అంచనావేసింది. ఎల్‌నినో ప్రభావం తగ్గి తొలుత తటస్థం, తరువాత లానినా ఏర్పడనున్నందున ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఎక్కువ వర్షాలు కురుస్తాయని ఈ ఫోరం మంగళవారం వెల్లడించింది.

నారాయణ స్కూల్స్ విజయ శంఖారావం

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): టెన్త్ ఫలితాల్లో తమ సంస్థ విద్యార్థులు విజయ శంఖారావం పూరించారని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు సిధూర, శరణి తెలిపారు. ప్రతి ఏడుగురిలో ఒకరు 10 జీపీఏ సాధించారని చెప్పారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరు విద్యార్థులు 9 జీపీఏ ఆ పైన సాధించినట్టు, బోర్డు ప్రకటించిన 10 జీపీఏ సాధించిన విద్యార్థుల్లో 16.10 శాతం మంది విద్యార్థులు తమ సంస్థ వారే ఉన్నట్టు పేర్కొన్నారు. మొత్తం టాప్ గ్రేడ్స్‌లో 41,450 మంది విద్యార్థులు నారాయణ స్కూల్స్ వారేనని చెప్పారు. సబ్జెక్టుల వారీగా 19,224 మంది విద్యార్థులు 10 జీపీఏను సాధించారన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను తమ రోజు వారీ సిలబస్‌లో భాగంగా బోధించడం ద్వారా నారాయణ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తున్నట్టు చెప్పారు.

నిర్మల్ జిల్లా ఫస్ట్.. వికారాబాద్ లాస్ట్

పదో తరగతి పరీక్షా ఫలితాలు విడుదల.. 91.3 శాతం మంది విద్యార్థులు పాస్

- బాలికల్లో 3.81 శాతం అధిక ఉత్తీర్ణత
- ఉత్తీర్ణతలో ప్రభుత్వ, జడ్పీ స్కూళ్లు లాస్ట్
- జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. విద్యా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ ఫలితాలను విడుదల చేశారు. పది పరీక్షల్లో ఈసారి 91.31 శాతం ఉత్తీర్ణత నమోదయింది. బాలురతో పోలిస్తే బాలికల ఉత్తీర్ణత 3.81 శాతం ఎక్కువగా ఉంది. ఫలితాల్లో నిర్మల్ జిల్లా మొదటి స్థానంలో, వికారాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలిచాయి. రాష్ట్రంలో 4,94,207 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇందులో 4,51,272 మంది(91.31 శాతం) ఉత్తీర్ణత సాధించారు. 2,48,909 మంది బాలురు పరీక్షలు రాయగా.. 2,22,656 మంది(89.42 శాతం) పాస్ అయ్యారు. 2,45,208 మంది బాలికలు పరీక్షలకు హాజరు కాగా.. 2,28,616 మంది(93.23 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేట్ విద్యార్థుల ఉత్తీర్ణత 49.73 శాతంగా నమోదయింది. ఈ ఏడాది 3,927 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. 6 పాఠశాలలు సున్నా ఫలితాలను సాధించాయి. రాష్ట్రంలో 8,883 మంది విద్యార్థులు 10కి 10 జీపీఏ సాధించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు 98.71 శాతం ఉత్తీర్ణతతో ముందంజలో నిలిచాయి. ఎస్సీ గురుకులాల్లో 98.06 శాతం, బీసీ గురుకులాల్లో 98.25, గిరిజన గురుకులాల్లో 97.57శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రభుత్వ పాఠశాలలు 80.18 శాతం, జడ్పీ స్కూళ్లు 86.18 శాతం ఉత్తీర్ణతతో చివరి రెండు స్థానాల్లో నిలిచాయి. కాగా ఇతర మీడియంలలో కంటే ఇంగ్లిష్ మీడియంలో అత్యధికంగా 93.74 శాతం ఉత్తీర్ణత నమోదయింది. విద్యార్థులు ఫలితాలను http://results.bse.telan-gana.gov.in, http://results.bsetelan-gana.org వెబ్‌సైట్లలో చూసుకోవచ్చు. కాగా, ఫలితాల్లో 99.05 శాతం ఉత్తీర్ణతతో నిర్మల్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 98.65 శాతం ఉత్తర్ణతతో సిద్దిపేట జిల్లా రెండో స్థానంలో ఉంది. 98.27 శాతంతో సిరిసిల్ల మూడు.. 98.16శాతంతో జనగామ నాలుగో స్థానంలో ఉన్నాయి. 65.10 శాతం ఉత్తీర్ణతతో వికారాబాద్ జిల్లా చివరి స్థానం లో నిలిచింది. గద్వాల జిల్లా 81.38 శాతం ఉత్తీర్ణతతో చివరి నుంచి రెండో స్థానంలో ఉంది. జూన్ 3 నుంచి 13 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. మే 16 లోపు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలి. రీకౌంటింగ్ కోసం ప్రతీ సబ్జెక్టుకు రూ.500 ఫీజు కట్టాలి. మే 15లోపు రుసుమును చెల్లించాలి. రీ వెరిఫికేషన్ కోసం ప్రతీ సబ్జెక్టుకు రూ.100 చొప్పున మే 15లోపు ఫీజు చెల్లించాలి.



ఫలితాలను విడుదల చేస్తున్న బుర్రా వెంకటేశం, దేవసేన

ఈ ఏడాది నుంచి వ్యక్తిత్వ వికాస తరగతులు: వెంకటేశం

తక్కువ ఉత్తీర్ణత శాతం సాధించిన జిల్లాలు, పాఠశాలలపై సమీక్ష చేస్తామని విద్యా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. వికారాబాద్ జిల్లాలో అతి తక్కువ ఉత్తీర్ణత నమోదు కావడానికి కారణాలను తెలుసుకుని, తగిన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఈ ఏడాది సున్నా శాతం ఉత్తీర్ణత వచ్చిన స్కూళ్లలో ప్రభుత్వ పాఠశాలలు లేవన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు. వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక దృష్ట్యా టెట్ పరీక్షలో ఒకటి, రెండు రోజుల షెడ్యూల్‌ను మార్చనున్నట్టు చెప్పారు. కాగా, 6 ఏళ్లు దాటిన వారికే మొదటి తరగతిలో అడ్మిషన్ కల్పించే విషయంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని విద్యా శాఖ డైరెక్టర్ దేవసేన చెప్పారు. ఇక, పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బీసీ గురుకుల విద్యార్థులు, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు, సిబ్బందికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు తెలిపారు.

46 డిగ్రీలు దాటేసింది

నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి, జగిత్యాల జిల్లా జైనలో 46.2 డిగ్రీలు

- సరికొత్త రికార్డులు సృష్టిస్తున్న ఎండ
- వడదెబ్బతో ఆరుగురి మృతి


ఎండల తీవ్రతతో నిర్మానుష్యంగా మారిన వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌక్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): భానుడి భగ భగలతో రాష్ట్రం వేడెక్కిపోతోంది. రోజుకో డిగ్రీ చొప్పున ఎండ వేడి పెరిగిపోతుండటంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి, జగిత్యాల జిల్లా జైనలో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ వేసవిలో మంగళవారం తొలిసారి ఉష్ణోగ్రత 46 డిగ్రీలు దాటింది. జగిత్యాల జిల్లా అల్లీపూర్‌లో 46.1.. అదే జిల్లా కొల్వాయి, కరీంనగర్ జిల్లా కొత్తగట్టు, వీణవంక, జమ్మికుంటలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సిద్దిపేట జిల్లా ధూల్‌మిట్ట, నల్లగొండ జిల్లా నాంపల్లి, జగిత్యాల జిల్లా వెల్గటూర్‌లో 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నల్లగొండ జిల్లాలోని చందంపేట, తెల్లదేవరపల్లిలో 45.8.. దామరచర్ల, వేములపల్లిలో 45.7.. అనుములలో 45.6.. అడవిదేవులపల్లి, మిర్యాలగూడలో 45.2.. త్రిపురారం, గట్టుప్పల్‌లో 45.1.. పెద్దవూరలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం నుంచి మే5 వరకు పలు జిల్లాల్లో వడగాలుల తీవ్రత కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

వడదెబ్బతో ఆరుగురి మృతి

వడదెబ్బతో మంగళవారం ఆరుగురు చనిపోయారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం రెడ్డిపల్లికి చెందిన అంబాల అయిలమ్మ(60) జమ్మికుంటలో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు వెళ్లింది. సమావేశం ముగిసే సమయంలో ఒక్కసారిగా కుప్పకూలింది. 108 వాహనంలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని రాగంపేటకు చెందిన రైతు ఐతరవేని రాజేశం(47), నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారంలో మేదరి అనిల్‌కుమార్(32), కామారెడ్డి జిల్లా మహ్మద్‌నగర్ మండలం గిర్ని తండాకు చెందిన నావత్ మీరాబాయి(68), భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో కొత్తవడ్ల శంకర్(35), నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లికి చెందిన ఉమామహేశ్వర్‌రావు (60) వడదెబ్బతో మృతి చెందారు.

కొల్లగొడుతున్న సైబర్ కేటుగాళ్లు

డ్రగ్స్ పార్సిల్ అంటూ భయపెట్టి రూ.47 లక్షలు దోపిడీ

- టాస్కుల పేరిట సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి రూ.10.25 లక్షలకు కుచ్చుటోపి
- కొత్త క్రెడిట్ కార్డు పేరిట ఓ వ్యక్తికి రూ.1.90 లక్షల టోకరా



హైదరాబాద్ సిటీ, పటాన్‌చెరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఏదో ఒక సైబర్ మోసం వెలుగులోకి వస్తూనే ఉన్నా, అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నా సైబర్ నేరగాళ్ల వలలో ఎవరో ఒకరు పడుతూనే ఉన్నారు. ముంబై సీబీఐ అధికారులమంటూ హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారికి ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు డ్రగ్స్ రవాణా, మనీ లాండరింగ్ అంటూ భయపెట్టి అతని నుంచి రూ.47 లక్షలు కొట్టేశారు. సదరు వ్యాపారికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు.. డ్రగ్స్ ఉన్న ఫెడెక్స్ కొరియర్ మీ పేరున ఇరాన్ వెళుతుందని, అందులో బ్యాంకు పాసు పుస్తకాలు ఉన్నాయని చెప్పారు. ఆపై, స్కైప్ కాల్ చేసి మీ బ్యాంకు ఖాతాల నుంచి విదేశాలకు నగదు అక్రమంగా వెళుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి అరెస్టు చేసేందుకు వస్తున్నామని పోలీసులు, కస్టమ్స్ అంటూ వరుస కాల్స్‌తో హడలెత్తించారు. దీంతో బెదిరిపోయిన సదరు వ్యాపారి ఈ కేసు నుంచి బయటపడేయాలని వారిని కోరాడు. దాంతో, మీ ఖాతాలోని డబ్బును తాము సూచించిన ఖాతాలోకి బదిలీ చేస్తే తనిఖీల తర్వాత వెనక్కి ఇస్తామని నమ్మించారు. వారి మాటలను నమ్మిన ఆ వ్యాపారి తన ఖాతాలోని రూ.47 లక్షలను వారు సూచించిన ఖాతాకి బదిలీ చేశాడు. ఆ తర్వాత మోసపోయానని గ్రహించాడు.

పెట్టుబడికి రెట్టింపు లాభాలంటూ..

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వచ్చిన సందేశాలకు ఆకర్షితుడై ఓ బిజినెస్ డెవలప్‌మెంట్ యాప్‌లో చేరాడు. తాము సూచించిన టాస్క్(పనులు)లు పూర్తి చేస్తే పెట్టిన పెట్టుబడికి రెట్టింపు లాభాలు తిరిగి ఇస్తామని ఆ యాప్ నిర్వాహకులు పేర్కొన్నారు. తొలుత టాస్కులు పూర్తి చేయగా లాభాల పేరిట రెట్టింపు డబ్బు ఖాతాలో జమ చేశారు. దీంతో అత్యాశకు పోయిన ఆ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రూ.10.25 లక్షల దాకా ఆ యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయాడు. ఇక, కొత్త క్రెడిట్ కార్డు పేరిట జరిగిన సైబర్ మోసానికి హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి రూ.1.90 లక్షలు పోగొట్టుకున్నాడు. రూ.3లక్షల విలువైన క్రెడిట్ కార్డు ఇస్తామంటూ వాట్సాప్‌లో వచ్చిన ఓ మెసేజ్‌కి స్పందించగానే గుర్తు తెలియని వ్యక్తి వీడియోకాల్ చేశాడు. ఏపీకే అనే యాప్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించి కేవైసీ పేరిట గుర్తింపు వివరాలు, ప్రస్తుత క్రెడిట్ కార్డు వివరాల అందులో నమోదు చేయించాడు. వాటి ఆధారంగా బాధితుడి నుంచి ఓటీపీలు తీసుకుని అతని క్రెడిట్ కార్డులోని నుంచి రూ. 1,90,398 కొట్టేశారు.



వివరాలు వెల్లడిస్తున్న అంకమ్మరావు

పది ఫలితాల్లో భాష్యం విద్యార్థుల జయభేరి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 30 : తెలంగాణ పదో తరగతి ఫలితాల్లో భాష్యం విద్యార్థులు జయభేరి మోగించారని సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ వెల్లడించారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో 264 మంది భాష్యం విద్యార్థులు జీపీఏ 10/10 సాధించి చరిత్ర సృష్టించారన్నారు. జీపీఏ 9.8పైగా 502 మంది విద్యార్థులు, 9.7కి పైగా 717 మంది, జీపీఏ 9.5కి పైగా 905 మంది, 9కి పైగా 1492 మంది విద్యార్థులతో పాటు మొత్తం 11,201 'ఏ' గ్రేడ్లు కైవసం చేసుకున్నారని తెలిపారు. మ్యాథ్స్ 'ఏ' గ్రేడ్లు 1556, సైన్స్ 'ఏ' గ్రేడ్లు 1920 వంటి ఫలితాలతో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా హైదరాబాద్ భాష్యం జోనల్ హెడ్ బి. అంకమ్మరావు మాట్లాడుతూ తెలంగాణ పదవ తరగతి ఫలితాల్లో మరోసారి భాష్యం విద్యార్థులు రికార్డు సృష్టించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందిని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ భాష్యం హనుమంతరావు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదా రెడ్డి

ఎస్సార్‌కు జీపీఏల పంట

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30 : పదవ తరగతి ఫలితాల్లో ఎస్సార్ విద్యార్థులు ఎప్పటిలాగే 10 జీపీఏల పంట పండించినట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ ఎ. వరదా రెడ్డి తెలిపారు. ఎస్ఎస్‌సీ పరీక్ష ఫలితాల్లో ఎస్ఆర్ విద్యా సంస్థల విద్యార్థులు 124 మంది 10/10 జీపీఏ సాధించి మరోమారు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారన్నారు. ఈ విజయం క్రమశిక్షణతో కూడిన విద్య, పటిష్టమైన పాఠ్య ప్రణాళిక, అంకితభావం కలిగిన ఉపాధ్యాయ బృందంతో సాధ్యమైందన్నారు. విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటిని ఆచరణలో పెట్టి ఒత్తిడి లేని వాతావరణంలో పోటీ పరీక్షలను ఎదుర్కొనేలా ఎస్ఆర్ విద్యార్థులకు ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌లో ఎక్కువ శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విజయ దుందుభి

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫలితాల్లో తమ సంస్థ విజయ దుందుభి మోగించిందని శ్రీచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ సీమ తెలిపారు. 1402 మంది 10 జీపీఏ సాధించారని, 9.8 జీపీఏను 2,803 మంది, 9 జీపీఏను 8,216 మంది విద్యార్థులు సాధించినట్టు చెప్పారు. కేవలం మ్యాథ్స్ సైన్స్ సబ్జెక్టుల్లో ఏ గ్రేడ్‌ను 17,913 మంది విద్యార్థులు పొందినట్టు తెలిపారు. ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సి-ఐపీఎల్, ఎంపీఎల్, ఐకాన్, సి-బ్యాచ్, సివిల్స్, మెడికాన్, టెక్నో వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్‌లు, మైక్రో లెవల్ టీచింగ్ సిస్టం, అంకితభావంతో పనిచేసే అధ్యాపకులవల్లనే ఈ ఫలితాలు సాధించినట్టు తెలిపారు.

టెన్త్ ఫలితాల్లో కేశవరెడ్డి ఆధిక్యం

టెన్త్ ఫలితాల్లో తమ సంస్థ విద్యార్థులు ఆధిక్యత సాధించినట్టు కేశవరెడ్డి విద్యా సంస్థల చైర్మన్ కేశవరెడ్డి ప్రకటించారు. మొన్నటి ఏపీ టెన్త్ ఫలితాల్లో అత్యధిక మార్కులతో చరిత్ర సృష్టించిన తమ విద్యార్థులు తెలంగాణ ఫలితాల్లోనూ సత్తా చాటారని చెప్పారు. అత్యధిక శాతం 10 జీపీఏను సాధించి ప్రభంజనం సృష్టించారని తెలిపారు. ప్రతి ఐదుగురిలో ఇద్దరు 9 జీపీఏ సాధించారని, దాంతో పాటు అన్ని సబ్జెక్టుల్లో సగటు జీపీఏ 8కి పైగా ఉందని వివరించారు. 54 శాతం ఏ-1, ఏ-2 గ్రేడ్స్ సాధించడం తమ సంస్థ విద్యా ప్రమాణాల నాణ్యతకు అద్దం పడుతుందని పేర్కొన్నారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లది రాజ్యాంగ వ్యతిరేక అజెండా: గురుదీప్ సప్పల్

హైదరాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): "బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లది రాజ్యాంగ వ్యతిరేక అజెండా" అని సీడబ్ల్యూసీ శాశ్వత సభ్యుడు గురుదీప్ సప్పల్ అన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాతాపాల్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్నే రద్దు చేయాలని బీజేపీ చూస్తోందని రాజ్యాంగం హిందువులకు వ్యతిరేకంగా ఉందని, దాన్ని మార్పు చేయాలని ఆర్ఎస్ఎస్ తన శ్వేతపత్రంలో రాసుకుందన్నారు. కానీ రాజ్యాంగం దృష్టిలో అందరూ సమానమేనని, అన్ని వర్గాలకూ అది ఓటు హక్కు కల్పించిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చిందని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్‌కు ఇవి నచ్చవు కాబట్టే రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తోందన్నారు. మోదీ హయాంలో... కుట్ర పూరితంగానే కుల గణన చేపట్టలేదన్నారు. అధికారంలోకి రాగానే కులగణన చేపట్టి రిజర్వేషన్లు పెంచుతామని గురుదీప్ సప్పల్ హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌లో కొనసాగుతున్న చేరికలు

వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు మంగళవారం నాడూ కొనసాగాయి. గాంధీభవన్‌లో చేరికల కమిటీ సభ్యులు జగ్గారెడ్డి, కోదండరెడ్డిల సమక్షంలో వనపర్తి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత శాంతయ్య, మరో 150 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. అలాగే ఆదిలాబాద్ డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిత్ ఖాన్ తిరిగి హస్తం గూటికి వచ్చారు. అదే జిల్లాకు చెందిన గండ్రత్ సుజాత, సంజీవరెడ్డి తదితరులు కూడా చేరారు. వీరికి కమిటీ సభ్యులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజలు తిరగబడితే బీజేపీ ఉండదు: ఈరవత్రి అనిల్

ప్రజలు తిరగబడితే మోదీ, అమిత్‌షాలే కాదు బీజేపీ కూడా బంగాళాఖాతంలో కొట్టుకుపోద్దని మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ అన్నారు. దేశంలో రిజర్వేషన్లు ఉండకూడదన్నదే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతమన్నారు. బీసీలకు 27 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ మండల్ కమిషన్ బిల్లును వీపీ సింగ్ ప్రభుత్వం పెట్టినప్పుడు.. బీజేపీ కమండల యాత్ర చేసిందన్నారు. గాంధీభవన్‌లో మంగళవారంనాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రిజర్వేషన్ల అమల్లో ఓబీసీలకు అన్యాయం జరుగుతుందనే రాహుల్‌గాంధీ కుల గణన చేపడతామన్నారని చెప్పారు. అది జీర్ణించుకోలేకనే బీజేపీ నేతలు కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారు.

రియాక్టర్ పేలి కార్మికుడి మృతి

కీసర రూరల్, ఏప్రిల్ 30: కెమికల్ రియాక్టర్ పేలి ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన మేడ్చల్ జిల్లా కీసర మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని అంకిరెడ్డిపల్లిలోని సాల్వో ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో బీహార్‌కు చెందిన సోనుకుమార్ (23) ఏడాదిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం కంపెనీలో ప్రమాదవశాత్తూ కెమికల్ రియాక్టర్ పేలింది. ఈ ప్రమాదంలో సోనుకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దగ్ధ వనాలు

ఉత్తరాఖండ్‌లో అడవులు తగలబడుతున్నాయి. మంటలు ఆర్పే ప్రయత్నాలు ఉధృతంగా సాగుతున్నప్పటికీ, కొత్తకార్చిచ్చులు పుట్టుకొస్తున్నాయి. గత ఏడాదితో పోల్చితే భారీ, అతిభారీ దావానలాల సంఖ్య ఈ ఏడాది ఎక్కువగా ఉంది. గత పదిరోజుల్లో రెండువందలకు పైగా తీవ్రస్థాయి కార్చిచ్చులు నమోదైతే, గత ఏడాది ఇదే కాలంలో పదకొండుమాత్రమే నమోదైనాయట. మంటలు ఆర్పేందుకు, వ్యాప్తిని నిరోధించేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సాయంతో విశ్వప్రయత్నం చేస్తున్నది. హెలికాప్టర్లు బాంబీ బకెట్లతో నీళ్ళు కుమ్మరిస్తున్నాయి. అయినప్పటికీ, విద్యాలయాలకూ, జనావాసాలకు కూడా ఈ కార్చిచ్చుల బాధ తప్పడం లేదని వార్తలు వస్తున్నాయి.

ఈ కార్చిచ్చులమీద సర్వోన్నత న్యాయస్థానం ముందు మూడేళ్ళుగా నాలుగుపిటిషన్లు విచారణకోసం ఎదురుచూస్తున్నాయని, వాటిని వెంటనే స్వీకరించాలని సోమవారం ఒక ప్రభుత్వేతర సంస్థ ప్రధాన న్యాయమూర్తికి మొరబెట్టుకుంది. వేలాది హెక్టార్ల అడవి అగ్నికి ఆహుతి అయిపోతున్నదని, ఉత్తరాఖండ్ రాష్ట్రంగా ఏర్పడినప్పటినుంచి ఇప్పటివరకూ అధికారిక లెక్కల ప్రకారమే యాభైవేల హెక్టార్ల అడవి తగలబడిపోయిందని ఈ సంస్థ తన బాధ వ్యక్తంచేసింది. ప్రకృతికంటే మానవకార్యకలాపాలే ఈ దావానలాలకు ముఖ్య కారణమని ఆ సంస్థ ఆరోపిస్తున్నది. 2019లో 2,981 హెక్టార్లు తగలబడితే, ఆ మరుసటి ఏడాది, అంటే కరోనా ఆంక్షలు అమలులో ఉన్నప్పుడు 172 హెక్టార్లు మాత్రమే అగ్నికి ఆహుతి అయిన విషయాన్ని ఈ సంస్థ చీఫ్‌జస్టిస్ దృష్టికి తీసుకువచ్చింది. ఈ డేటాను లోతుగా గమనించినప్పుడు, 2021లో 3,576 హెక్టార్లు, 2022లో 3,425 హెక్టార్లు మంటల్లో మాయంకావడం ఆశ్చర్యం కలిగించదు. ఏటా ఫిబ్రవరినుంచి దావానలాలు ఆరంభమవుతాయి కనుక ఆర్నెల్లు ముందునుంచే నిర్దిష్టమైన చర్యలతో వాటిని నియంత్రించవచ్చునని పిటిషన్‌దారు వాదన.

కార్చిచ్చులపై పిటిషన్లను సత్వరమే విచారణకు చేపడతామన్న చంద్రచూడ్ హామీని అటుంచితే, ఈ దావానలాలకు ప్రధానకారణం మానవ కార్యకలాపాలే. స్థానికులు, పర్యాటకులు కాలుతున్న సిగరెట్లను నిర్లక్ష్యంగా విసిరేయడం, ఎక్కడపడితే అక్కడ వండుకొని, నిప్పు సరిగా ఆర్పకపోవడం, వ్యవసాయక్షేత్రాల్లో వ్యర్థాలను తగలబెట్టడం ఇత్యాది చర్యలతోపాటు, స్మగ్లర్లు ఉద్దేశపూర్వకంగా అడవులకు నిప్పంటిస్తున్న ఘటనలు కూడా ఎక్కువవుతున్నాయి. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటూ, వాతావరణం మరింత పొడిగా మారిపోయిన నేపథ్యంలో కార్చిచ్చుల సంఖ్య పెరిగివుండవచ్చు. కానీ, వేసవి ప్రవేశం కంటే ముందుగానే వందలాది హెక్టార్ల అడవి నాశనమైన అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. తప్పును పూర్తిగా వాతావరణ మార్పులమీదకు నెట్టివేయడం సరికాదు. మనిషి అత్యాశకు అడవులు బలైపోతుంటే, మానవ నిర్లక్ష్యం కారణంగా పెరిగిన భూతాపం మిగిలిన వనాలను మింగేస్తోంది.

కార్చిచ్చు ఘటనల సంఖ్య ఉత్తరాఖండ్‌లో గత రెండుదశాబ్దాల్లో బాగా పెరిగాయి. భారీ ప్రాజెక్టుల నిర్మాణంతో అడవుల విధ్వంసం ఒకపక్కన జరిగిపోతుంటే, పర్యాటకాన్ని పెంచడం, అభివృద్ధి సాధించడం పేరిట చేపట్టిన చర్యలు మరింత నష్టాన్ని చేకూర్చుతున్నాయి. అడవుల నిర్వహణలో స్థానికుల పాత్ర గతంతో పోల్చితే బాగా తగ్గిపోయిందని, దావానలాలను అరికట్టడంలో పూర్వపు తరాలవారు ప్రదర్శించిన చొరవ ఇప్పటివారిలో లేకుండాపోయిందని, ప్రభుత్వాలు సైతం ప్రజాభాగస్వామ్యం విషయంలో శ్రద్ధచూపడం లేదని పర్యావరణవేత్తలు వాపోతున్నారు. 90శాతం కార్చిచ్చులు మానవ ప్రేరేపితాలేనని అంటున్నప్పుడు, వాటిని నివారించడానికీ, నిరోధించడానికీ స్థానికుల సాయం చాలా అవసరం. వేసవి సమీపించి, వేడి పెరిగి, వాతావరణం పూర్తిగా పొడిబారి అగ్గిరాజుకున్న తరువాత ప్రజలను హెచ్చరించడమో, అభ్యర్థించడమో కాక, ముందుగానే వారి భాగస్వామ్యంతో నివారణ చర్యలు ఆరంభం కావాలి. ఎండుటాకులనుంచి పైన్ వృక్షాల వరకూ అగ్గిపుట్టించే ఏ అంశాన్నీ వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డెబ్బయ్‌శాతం అడవులున్న ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో దావానలాలను సమర్థంగా ఎదుర్కోవడానికి సిబ్బందికి ఆధునిక పరికరాలు ఉండాలి, ప్రత్యేకంగా నిధుల కేటాయింపులు జరగాలి.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన నేపథ్యంలో నిజానికి 8 గంటల పనిదినం క్రమక్రమంగా 7 గంటల, 6 గంటల, 5 గంటల, 4 గంటల పనిదినంగా మారాలి. కానీ 8 నుండి 10, 12, 14, 15, 16 గంటలుగా మారడం ఏమిటి? భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఇదే ధోరణి ఉన్నది. ఈ రోజు కార్మిక పోరాటం జీతభత్యాల వరకే పరిమితం కాక, పని గంటల సమస్యపై కూడా దృష్టి సారించాల్సి ఉంది.

పని గంటలపై పోరాటం ఇంకా ముగియలేదు!

కార్మికుణ్ణి 'మాట్లాడే యంత్రం'గా దిగజార్చిన పెట్టుబడిదారీ యుగనీతిపై ఓ తిరుగుబాటు బావుటా మే డే! కార్మికుణ్ణి కూడా మనిషిగానే చూడాలంటే, అతడు/ ఆమె రోజుకు ఏఏ విధులకు ఎన్నెన్ని గంటల్ని కేటాయించాలో నిర్వచించింది మేడే పోరాటం. 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, మరో 8 గంటలు తన కోసం. ఈ ఆఖరిది ఆచరణలో వినోదం కోసం. లేదా కుటుంబ జీవితం కోసం. ఇదే అత్యంత ప్రాధాన్యత గలది. అదే 1886లో ప్రధానంగా పొందింది, నేడు ప్రధానంగా కోల్పోయేదీ!

రోజుకు 24 గంటలు. దాన్ని మూడు సమ భాగాలు చేస్తే 8 గంటలౌతుంది. ఓ 8 గంటలు పెట్టుబడిదార్ల వద్ద పని కోసం. ఇంకో 8 గంటలు పని ద్వారా కోల్పోయిన శరీర శక్తిని తిరిగి పొందేందుకు నిద్రకోసం. మరో ముఖ్యమైన 8 గంటలు తన కోసం. అంటే కార్మికుడి కోసం. ఆచరణలో కుటుంబం కోసం. అదే సాంఘిక జీవితం. సోషల్ లైఫ్. ఓ మనిషిగా కార్మికుణ్ణి మార్పుకు గురి చేసే ముఖ్యమైన ప్రక్రియ అదే!

మనిషికి అవసరమైన 8 గంటల నిద్రా కాలాన్ని కూడా పారిశ్రామిక వర్గం కబ్జా చేసిన దశ ఉంది. అది కార్మికవర్గాన్ని 'టాకింగ్ టూల్'గా; 'లివింగ్ యానిమల్'గా ఫ్యాక్టరీల్లో 16 గంటలకు మించి పని చేయించింది. ఫలితంగా ఆకలి, రోగాల కంటే, నిద్ర చాలని కారణంగా అకాల మరణాలు జరిగిన దశ ఒకటుంది. అలా మరణించిన వారిని పశువుల శవాల్లా అవతలకు ఈడ్చివేసి రిజర్వ్‌డ్ నిరుద్యోగులతో పని చేయించుకుంది. అలా పెట్టుబడిదారీ వ్యవస్థ మానవ శవ రాశుల పునాది మీద బలపడింది.

1789 ఫ్రెంచ్ విప్లవం, 1886 మేడే పోరాటం మధ్య 97 ఏళ్ల వ్యవధి ఉంది. శతాబ్ది తేడాలో సంభవించిన రెండు ప్రాపంచిక ఘటనలు రెండు భిన్నమైన మానవ విలువల్ని అందించిన నేపథ్యం ఉంది. ఈ రెండింటికి కర్త పాత్రను మొదట సందర్భంలో రైతాంగం, తర్వాతి సందర్భంలో కార్మికవర్గం చేపట్టి విజయవంతం చేశాయి. ఆ కాలాల్లో వాటికి ఏఏ వర్గాల జనం కర్తలుగా మారినా, అవి అందించిన ఫలితాలు మాత్రం అంతిమంగా ఆనాటి సగటు సమాజాల విలువలుగానే మారాయి. ఆ విలువలను కోల్పోయే ప్రమాదం ఏర్పడితే ఆ నిర్దిష్ట వర్గాల ప్రజల వరకే పరిమితం కాకుండా మొత్తం ప్రజలు కూడా నష్టపోతారు. ఈ వెలుగులో మరో 8 గంటల పని దినానికి ఎదురయ్యే నేటి ప్రమాదం పట్ల సకల రంగాల ప్రజల్ని అప్రమత్తం చేయాల్సి ఉంది.

మేడే పోరాటంతో దక్కిన 8 గంటల పని దినం కార్మికుణ్ణి మనిషిగా మార్చింది. పని, నిద్ర పోగా మరో 8 గంటలు కార్మికవర్గానికి దక్కింది. దీంతో భార్యాబిడ్డలతో కార్మికవర్గం సామాజికంగా వినోదభరిత జీవితాన్ని పొందింది. తద్వారా కార్మికుడు యంత్రంగా కాక, మనిషిగా రూపొందాడు. ఈ మరో 8 గంటల సాంఘిక జీవితం కార్మికవర్గాన్ని పూర్తి స్థాయిలో మార్చివేసింది.

వినోద జీవితం గడపడానికి సమయం దొరికిన తర్వాతనే నాటి ప్రజలందరి వలెనే తమ భార్యాబిడ్డలతో కార్మికవర్గం వీధుల్లో, పార్కుల్లో, వినోద క్రీడల్లో, పండగ పబ్బాలలో, సంబరాలలో, గ్రంథాలయాల్లో భాగమైంది. తన పూర్వ పశు బంధం స్థానంలో కొత్తగా మనిషిబంధం రూపొందింది. ఏ నిర్వచనాన్ని ఎవరు ఎలా ఇచ్చినా, వాస్తవ ఆచరణలో నాటి కార్మికుణ్ణి యాంత్రిక జీవితం నుండి వేరు పరిచింది మేడే పోరాటమే.



మేడే పేరు వింటే ఎర్ర జెండా రెపరెపలు, జండా గద్దెలు, స్థూపాలంకరణలు, విప్లవ గానాలు, పోరాట నాదాలు, కార్మిక ప్రదర్శనలు, శ్రామికవర్గ కవాతులు, ప్రభాత భేరీలు, ఉద్వేగభరిత ప్రసంగాలు గుర్తుకు వస్తాయి. ఇంతకంటే భిన్నమైన మానవీయ కోణం కూడా మేడేలో దాగి ఉంది. దాన్ని ప్రాచుర్యంలోకి తేవడం నేటి తక్షణ, ప్రధాన కర్తవ్యం.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన నేపథ్యంలో నిజానికి 8 గంటల పనిదినం క్రమక్రమంగా 7 గంటల, 6 గంటల, 5 గంటల, 4 గంటల పని దినంగా మారాలి. కానీ 8 నుండి 10, 12, 14, 15, 16 గంటలుగా మారడం ఏమిటి? కోవిడ్‌లో 12 నుండి 14 కోట్ల మంది వలస కార్మికుల వెతలు లోకం ఎదుట బహిర్గతమైనవి. భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఇదే ధోరణి ఉన్నది.

శారీరక శ్రమ చేసే కార్మికవర్గం మాటే కాదు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ వర్గం మాట కూడా ఇదే! ఈ మానసిక శ్రమ చేసే ఉద్యోగ వర్గాలతో సైతం గతం కంటే ఎక్కువ గంటల పని చేయించే స్థితి ఏర్పడింది. ఇదెక్కడి వరకు వెళ్లిందంటే ఉన్నత విద్యావంతులే కాక, సాంకేతిక నిపుణులై అధిక రాబడి గల సాఫ్ట్‌వేర్ వంటి ఉద్యోగులు సైతం నేడు అధిక సమయం పనిచేయాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా ఐటి ఉద్యోగవర్గపు సాంఘిక జీవితం తీవ్ర కల్లోలభరితమవుతున్నది. వారు మానసిక రోగులుగా మారుతున్న దుస్థితిని చూస్తున్నాం. వారి వైవాహిక కుటుంబ జీవితంపై దుష్ప్రభావం పడుతోంది. ఎంత జీతాలు వచ్చినా సాంఘిక జీవితాన్ని కోల్పోతే సుఖం ఏమిటి? ఈ రోజు కార్మిక పోరాటం జీతభత్యాల వరకే పరిమితం కాక, పని గంటల సమస్యపై కూడా దృష్టి సారించాల్సి ఉంది. ఈ కర్తవ్యం శ్రామికవర్గ, ఉద్యోగ సంఘాలపై ఉంది.

మేడే సందర్భంగా శ్రామికవర్గ సంస్థల నేతలు, ఆర్గనైజర్లు, కార్యకర్తలు ప్రత్యేక బాధ్యతని నిర్వహించాల్సి ఉంది. వారికి మేడే కార్మికవర్గ వ్యవహారంగా కాకుండా, యావత్తు సమాజ వ్యవహారంగా మార్చడానికి ఓ అవకాశం ఉంది. వారు దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వారు మేడేని విశాల ప్రజాల మధ్యకు తీసుకువెళ్లే ప్రయత్నం చేయాలి. ఆ సావకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ఇప్పటికే కొంత వైఫల్యం ఉంది. ఇలా చెప్పాల్సి వస్తున్నందుకు సాటి శ్రామికవర్గ సహచరునిగా బాధతో పాటు విచారం వ్యక్తం చేస్తున్నాను.

పని గంటల కాలపరిమితి పెరిగిన మేరకు కార్మికవర్గం తమ సాంఘిక జీవితాన్ని కోల్పోతుంది. కారల్ మార్క్స్ చెప్పినట్లు కార్మికవర్గం తీవ్ర పరాయీకరణకి గురౌతుంది. తన ఎదుట గల అన్ని శక్తుల్ని శత్రువులుగా చూస్తోంది. ఆ అందరి దృష్టిలో కార్మికవర్గం కూడా తేలికైపోతుంది. దాన్ని వారు కూడా శత్రువుగా చూసే స్థితి ఏర్పడుతుంది. తుదకు ఆ నష్టం కేవలం కార్మికవర్గానికే పరిమితం కాకుండా మొత్తం సమాజం నష్టపోతుంది. ఈ విధంగా దేశంలో నలభై కోట్లకి పైగా కార్మిక కుటుంబాలది యాంత్రిక జీవితంగా మారితే, భావి సామాజిక సంక్షోభస్థితి ఏ స్థాయిలో ఉంటుందో తేలిగ్గా ఊహించవచ్చు. ఈ కారణంగా రేపటి సంక్షోభాన్ని నివారించడం కోసం కార్మిక కుటుంబాల్ని చైతన్య పరిచి పోరాటానికి సిద్ధం చేయడం ఓ కర్తవ్యం కావాలి. అందుకే 138వ మేడే సందర్భంగా కార్మికోద్యమ శక్తులతో పాటు ప్రజాతంత్ర, వామపక్ష, లౌకిక, ప్రగతిశీల శక్తులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.

జీతభత్యాలు, సౌకర్యాలు, హక్కులు, జీవన ప్రమాణాలు, ఉద్యోగ భద్రత వంటి వివిధ కోర్కెల సాధనకై పోరాడుతూ అంతకంటే ప్రాధాన్యతని పని గంటలపై ఇవ్వాల్సి ఉంది. మన మీద ఇది చరిత్ర మోపిన బాధ్యత! రేపు ముందుకు వెళ్లాలంటే నేడు మనం వెనక్కి వెళ్లాల్సిందే. 2025 వైపుకూ, ఇంకా ముందుకూ వెళ్లాలంటే, మంచి భవిష్యత్తును మనం నిర్మించుకోవాలంటే, 1886 వైపుకు చూపును సారిద్దాం. చికాగో విప్లవ స్ఫూర్తిని పొంది ముందడుగు వేద్దాం.

(నేడు మేడే)

● పి. ప్రసాద్
ఐ.ఎఫ్.టి.యూ.

మారుతున్న మోదీ ప్రచార సరళి



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

దేశ రాజధాని ఢిల్లీ పొలిమేరల్లోని ఘజియాబాద్, ఎక్కడ చూసినా వేలాది అపార్ట్‌మెంట్లు, మాల్స్‌తో ఒక కాంక్రీట్ జంగిల్‌లా ఉంటుంది. ఇక్కడ నివసించే వారంతా ఎక్కువగా ఢిల్లీలో రకరకాల ఉద్యోగాలు చేస్తున్నా అత్యధికులు ఉత్తరప్రదేశ్ ఓటర్లే. జనవరి 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిన రోజు ఈ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొన్నది. ఆటోలు, కార్లపై కాషాయ పతాకాలు రెపరెపలాడాయి. దాదాపు ప్రతి అపార్ట్‌మెంట్‌లో అయోధ్యలో ప్రాణప్రతిష్ఠను పెద్ద పెద్ద స్క్రీన్లపై ప్రత్యక్ష ప్రసారం చేశారు. రామమందిరం కోసం ప్రజల శతాబ్దాల పోరాటాన్ని దేశ స్వాతంత్రోద్యమంతో పోలుస్తూ ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని ఉత్కంఠతో విన్నారు. అందరికీ ప్రసాదాలు పంచిపెట్టారు. పేదలకు అన్నదానాలు చేశారు. భారతదేశం పూర్తిగా మారిపోతోందన్న అభిప్రాయం ఈ దృశ్యాలు చూసినప్పుడు అనిపించింది. అయోధ్యలో రామమందిర నిర్మాణంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీని అభినందిస్తూ పార్లమెంట్‌లో తీర్మానం కూడా చేశారు. 'శ్రీరాముడు తన స్వంత నివాసానికి తిరిగి వచ్చారు. ఈసారి బీజేపీ 400 సీట్లు సాధించడం ఖాయం' అని ప్రధాని మోదీ ఫిబ్రవరి 5న లోక్‌సభలో ప్రసంగించారు.

కాని ఆశ్చర్యకరమేమంటే ఇదే ఘజియాబాద్‌లో ఏప్రిల్ 26న రెండవ విడత ఎన్నికల్లో గత మూడు ఎన్నికల్లో కంటే అత్యంత తక్కువ శాతం పోలింగ్ జరిగింది. అపార్ట్‌మెంట్ల నుంచి జనం బయటికి రాలేదు. ఎందుకో గాని భారతీయ జనతా పార్టీ నమ్మకం పెట్టుకున్న నగర ప్రజలు ఓటింగ్ చేసేందుకు ఆసక్తి ప్రదర్శించలేదు. రాత్రి 10 గంటల వరకు ఓటింగ్ జరిగినప్పటికీ ఓటింగ్ శాతం 49.65 శాతానికి మించలేదు. శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠను అంత ఉత్సాహంగా జరుపుకున్న ప్రజలు ఎందుకు అంతే ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనలేకపోయారో బీజేపీ నేతలే కారణాలు చెప్పలేకపోతున్నారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికీ, రాజకీయాలకూ సంబంధం లేదని జనం భావించారో లేదో కూడా చెప్పలేం. అదే సమయంలో దేశంలో జరుగుతున్న రాజకీయాలను వారు చర్చించుకోవడం లేదని కూడా చెప్పలేము. అన్నిటికన్నా ముఖ్యం ఈ దేశంలో ప్రజాస్వామిక ప్రక్రియను ప్రజలు అంత సీరియస్‌గా, చైతన్యవంతంగా తీసుకుంటున్నారా లేదా అన్నది చర్చనీయాంశం. ఎన్నికల పుణ్యమా అని వచ్చిన ఒక రోజు సెలవును విశ్రాంతిగా గడపకుండా ఎండన పడి ఓటింగ్‌కు ఎందుకు వెళ్లాలని భావించేవారు అధికంగా కనిపిస్తున్నారు. కోవిడ్ సమయంలో గంటలు కొట్టించి, దీపాలు వెలిగించి, 'గో గో కరోనా' అన్న నినాదాలు చేయించిన, వాక్సినేషన్ సర్టిఫికెట్లపై కూడా తన ఫోటోను వేయించుకుని ప్రోత్సహించిన నాయకుడు ఎన్నికల పట్ల ప్రజలను ఎందుకు ఉత్తేజవంతుల్ని చేయలేకపోతున్నారో అర్థం కావడం లేదు. అంత మాత్రాన ప్రభుత్వం పట్ల ప్రజలకు భ్రమలు తొలగిపోయాయని ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యల్నీ పూర్తిగా విశ్వసించలేము. అదే సమయంలో తక్కువ శాతం పోలైనా ఆ ఓట్లన్నీ తమకేనని బీజేపీ నేతలు చెబుతున్న మాటల్నీ నమ్మడానికి వీల్లేదు. రెండింటి మధ్య సత్యం వేరే ఉన్నదని మాత్రం అనుకోవడానికి వీలుంది.

అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ తర్వాత మోదీకి తిరుగులేదని, ఆయనను ఓడించగల శక్తులు లేవనే అభిప్రాయం చాలా మందిలో ఏర్పడింది. టీనా (దేర్ ఈజ్ నో ఆల్టర్‌నేటివ్- ప్రత్యామ్నాయం లేదు) అన్న ఒకే ఒక కారణంగా ఆయన అజేయుడనే అభిప్రాయం కలిగింది. ప్రతిపక్షాలు వివిధ రాష్ట్రాల్లో కొంత ఏకం అయినా మోదీని ఏమీ చేయలేరనే చాలా మంది భావించారు. ఎన్నికల బాండ్లపై సుప్రీం కోర్టు తీర్పు తర్వాత తీగలాగితే డొంక కదిలి నట్లుగా మోదీ వ్యతిరేక చర్చ వేడెక్కింది. ప్రతిపక్షాలపై ఏజెన్సీల దాడులు, కేజ్రీవాల్ అరెస్టు తదితర పరిణామాలతో మోదీ ఏకపక్ష చర్యలు సరైనవా అన్న చర్చా మొదలైంది. తటస్థంగా ఉన్న వర్గాలు కూడా మోదీ విధానాలపై సందేహాలను వ్యక్తం చేయడం మొదలుపెట్టాయి. అయినప్పటికీ మోదీ విజయాన్ని అడ్డుకోవడం సాధ్యమా అన్న సందేహాలు ఇప్పటికీ మాయం కాలేదు. మోదీ అనుకున్నంతగా 400 సీట్లు సాధించలేక పోవచ్చేమో కాని ఆయన మళ్లీ ప్రధానమంత్రి కావడాన్ని ఎవరు ఆపలేరనే అభిప్రాయం చాలా మందిలో మారలేదు. ఆయన శక్తియుక్తులను తక్కువ అంచనా వేయలేకపోవడమే ఇందుకు కారణం.

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే మోదీ ఎన్నికల ప్రచారం రకరకాల మలుపులు తిరుగుతోంది. రామమందిర ప్రాణప్రతిష్ఠ చేసిన నరేంద్రమోదీ ఆ విషయాన్ని కూడా రానురానూ ప్రస్తావించడం తగ్గించారు. అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ జరిగిన వెంటనే ఎన్నికల షెడ్యూలు ప్రకటించి ఉంటే బీజేపీ ఘనవిజయం సాధించేదనే అభిప్రాయం చాలా మందిలో ఉండేది. కాని మోదీయే పూర్తిగా రామమందిరంపై దృష్టి కేంద్రీకరించకుండా తన స్వంత పేరుతో ప్రచారం ఉధృతం చేశారు. గత ఎన్నికల్లో చౌకీదార్ అని చెప్పుకున్న మోదీ ఈ ఎన్నికల్లో 'మోదీ కా గ్యారంటీ' అన్న పదాలకు విస్తృత ప్రాధాన్యత కల్పించారు. ఎన్నికల మేనిఫెస్టో మాత్రమే కాదు, ప్రచార ప్రకటనల్లోనూ మోదీ గ్యారంటీ అన్న పదాలను ప్రజల్లోకి చొచ్చుకువెళ్లేలా చూసేందుకు ప్రయత్నించారు. వికసిత్ భారత్, అమృత కాల్, ఆత్మనిర్భర్, విశ్వగురు వంటి అంశాలను ప్రస్తావించి భారత్‌ను గతంలో కంటే ఎక్కువ అభివృద్ధి చేస్తుంది తానేనని, ప్రజలకు సంక్షేమ కార్యక్రమాల ఫలితాలు నేరుగా అందేలా చేస్తోంది తానేనని మోదీ చెప్పుకున్నారు. ఇదే అంశంపై ఆయన ప్రచారం పూర్తిగా కొనసాగించి ఉంటే ఎన్నికలు ఆసక్తికరంగా మారేవి. ఆరు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధినీ, పది సంవత్సరాల్లో మోదీ సాధించిన అభివృద్ధినీ బేరీజు వేసుకునేందుకు అవకాశం ఉండేది.

కాని క్రమంగా మోదీ ఈ ధోరణి కూడా తగ్గించి కాంగ్రెస్‌పై విమర్శల బాణాలు పెంచారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన వెంటనే అందులో ఉన్న అంశాలపై తీవ్ర దాడులు చేయడం మొదలుపెట్టారు. తద్వారా మోదీ చేస్తున్న ఆరోపణలు నిజంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉన్నాయా అన్న ఆసక్తి అనేకమందిలో పెరిగింది. తాము సామాజిక న్యాయం గురించి అద్భుతమైన ఎన్నికల ప్రణాళిక రూపొందించినా దానిపై జనం దృష్టి పెద్దగా పడడం లేదని మొదట్లో జై రాంరమేశ్, కొప్పుల రాజు వంటి నేతలు వాపోయేవారు. కాని ఉన్నట్లుండి కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోకు ప్రచారాన్ని మోదీయే కల్పించారు. కాంగ్రెస్ పార్టీ అందర్నీ దోచి, మైనారిటీలకు పంచిపెడుతుందనే మోదీ చేసిన ప్రచారం ఊపందుకోవడంతో కాంగ్రెస్ మేనిఫెస్టోపై పలువురి దృష్టి మళ్లింది. దానిపై ఎన్నికల కమిషన్ బీజేపీకి నోటీసులు ఇచ్చిన తర్వాత విషయంపై మరింత చర్చ జరిగింది.



మోదీ ఎన్నికల ప్రచారం రకరకాల మలుపులు తిరుగుతోంది. రామమందిర ప్రాణప్రతిష్ఠ చేసిన నరేంద్రమోదీ ఆ విషయాన్ని రానురానూ ప్రస్తావించడం తగ్గించారు. తన స్వంత పేరుతో ప్రచారం ఉధృతం చేశారు. గత ఎన్నికల్లో చౌకీదార్ అని చెప్పుకున్న మోదీ ఈ ఎన్నికల్లో 'మోదీ కా గ్యారంటీ' అన్న పదబంధానికి విస్తృత ప్రాధాన్యం కల్పించారు. అభివృద్ధి అంశంపై ఆయన ప్రచారం పూర్తిగా కొనసాగించి ఉంటే ఎన్నికలు ఆసక్తికరంగా మారేవి. మోదీ క్రమంగా ఈ ధోరణినీ తగ్గించి కాంగ్రెస్‌పై విమర్శలు ముమ్మరం చేశారు.


గత పదేళ్లుగా మోదీ హయాంలో కష్టించి సాధించామని బీజేపీ చెప్పుకుంటున్న విజయాలకు ప్రచారంలో క్రమంగా ప్రాధాన్యత తగ్గిపోతోంది. పెద్దనోట్ల రద్దు, నల్లధనానికి అడ్డుకట్ట వేయడం, పాకిస్థాన్‌పై సర్జికల్ దాడులు, కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాఖ్ రద్దు, అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ, జన్‌ధన్ యోజన, 80 కోట్లమందికి ఉచిత ఆహార ధాన్యాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ వంటి అంశాలపై బీజేపీ నేతలు తక్కువగా మాట్లాడుతున్నారు. వాటి బదులు కాంగ్రెస్ లేవనెత్తిన అంశాలకు మోదీ ప్రాచుర్యం కల్పిస్తున్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లు ఉండవని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టేందుకు మోదీ, ఆయన అనుయాయులు రంగంలోకి దిగారు. ఈ అంశాలపై ప్రజల మనసుల్లో అనుమాన బీజాలు నాటడంలో కాంగ్రెస్ విజయవంతం కాగలిగిందా? లేకపోతే 2019 ఎన్నికల్లో కేవలం 52 సీట్లు సాధించిన కాంగ్రెస్‌కు మోదీ ఎందుకు ఎన్నికల ప్రచారంలో అంత ప్రాధాన్యత కల్పిస్తున్నారు? ఊసులో లేకుండా పోవాల్సిన పార్టీ మోదీ నాలుకపై పదే పదే ఎందుకు తచ్చాడుతోంది?

ఈ దేశ సంపద కొన్ని వర్గాల చేతుల్లోనే పరిమితం కాకుండా ప్రజలకు పంచడం గురించి రాజకీయ పార్టీలు హామీలు గుప్పించడం కొత్త విషయం కాదు. ప్రపంచంలో సంపద విషయంలో నెలకొన్న అసమానతలను థామస్ పికెటీ లాంటి ఆర్థికవేత్తలు ఎప్పుడో ప్రస్తావించారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని దేశానికి తిరిగి తీసుకువచ్చి ప్రజలకు పంచుతానని మోదీ 2014లో చేసిన ప్రచారం ఆయనకు ఎంతో జనాదరణ కల్పించిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. కేంద్ర ఏజెన్సీలు స్వాధీనపరుచుకున్న డబ్బును ప్రజలకు పంచిపెడతానని కూడా ఆయన ఇటీవల హామీ ఇచ్చారు. కాని గత పదేళ్లలో మోదీ సంపదను ప్రజలకు పంచారా, కొన్ని వర్గాలకు కేంద్రీకృతం చేశారా అన్న చర్చను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. అదానీ, అంబానీలకు దోచి పెట్టారని రాహుల్‌గాంధీ ప్రతి సభలోనూ ప్రస్తావించారు. చివరకు సంపదను పంచడం గురించి కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో కూడా కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. మోదీ ఈ చర్చను కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మార్చడంలో ఎంతమేరకు సఫలీకృతులవుతారన్నది చెప్పలేం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధనవంతుల ఆస్తులను పేదలకు పంచుతారని, వారసత్వ పన్ను విధిస్తారని మోదీ చేస్తున్న ప్రచారం కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మారుతుందా లేదా సానుకూలంగా మారుతుందా అన్న అనుమానాలకు దారితీస్తోంది. ప్రైవేట్ ఆస్తులను ప్రజల ఆస్తులుగా పరిగణించేందుకు రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో ఆర్టికల్ 39(బి)ని అన్వయించడంపై 9 మంది సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ బెంచ్ కూడా ఇదే సమయంలో విచారణ జరుపుతుండడం ఈ చర్చను మరింత ఆసక్తికరంగా మార్చింది. ప్రభుత్వ ఏజెన్సీల దాడులు, కోర్టు కేసులు, పోలీసుల సమన్లు వంటి అంశాలను పక్కన పెడితే రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, రిజర్వేషన్లు, సంపదను పంచడం, అభివృద్ధి, సంక్షేమం వంటి విషయాలపై చర్చ జరగడం ఆరోగ్యకరమైన పరిణామమే.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

మేడిగడ్డ పాట్లన్నీ అన్నారం, సుందిళ్లకూ తప్పవు!

కాళేశ్వరం కహానీ 3



రాష్ట్ర నీటి పారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) అన్ని డిజైన్లను సిద్ధం చేయడానికి కేంద్ర విభాగంగా ఉంటుంది. డిజైన్లపై తుది నిర్ణయం సీడీవోదే. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వంటి బ్యారేజీలకు డిజైన్లు, డ్రాయింగ్‌లను తయారు చేసే సామర్థ్యం సీడీవో విభాగానికి పూర్తిగా ఉన్నది. అయితే ఈ సందర్భంలో సీడీవోకు డిజైన్ల తయారు చేసేందుకు తగినంత సమయం ఇవ్వలేదు. డ్రాయింగ్‌లను పునఃసమీక్షించడానికి లేదా సవరించడానికి తగినంత సమయం ఇవ్వకుండా అడపాదడపా మార్పులు చేయాలని కోరుతూ ఉన్నతాధికారులు పలుమార్లు జోక్యం చేసుకున్నారు. ప్రాజెక్ట్ నిర్మాణ యూనిట్‌తో పాటు కలిసి పని చేయడానికి సీడీవోను అనుమతించలేదు. దీనివల్ల డిజైన్లు, డ్రాయింగ్లలో లోపాలు ఏర్పడ్డాయి. అంతేగాక, ఆ డిజైన్లు, డ్రాయింగుల అమలు నిర్మాణ సమయంలో క్షేత్ర స్థాయిలో సరిగా జరగలేదు.

నీటి పారుదల శాఖకు చెందిన సీడీవో విభాగం మూడు బ్యారేజీల హైడ్రాలిక్, స్ట్రక్చరల్ డిజైన్లను చేపట్టింది. డిజైన్ డాక్యుమెంట్లు, డ్రాయింగ్స్‌లో కొన్ని లోపాలు ఉన్నాయి. పైగా నీటి పారుదల శాఖలో వివిధ యూనిట్ల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల సీడీవో ఇచ్చిన డ్రాయింగ్‌లను ప్రాజెక్టు నిర్మాణ యూనిట్ సరిగ్గా అనుసరించలేకపోయింది. కొన్ని ఉదాహరణలను చూస్తే– బ్యారేజీ సైట్ వద్ద ఏదైనా డిజైన్, మోడల్ అధ్యయనానికి ప్రాథమికమైన గేజ్ డిశ్చార్జ్ కర్వ్‌ను ప్రాజెక్ట్ నిర్మాణ యూనిట్ లేదా సీడీవో యూనిట్ ధ్రువీకరించాలి. ఇక్కడ అది జరగలేదు. దిగువన ఉన్న ఆర్‌సిసి రాఫ్ట్ (raft) కాంక్రీట్ కోటింగ్ మూడు బ్యారేజీలలో అనేక చోట్ల చెల్లాచెదురుగా కనిపించింది. దీనికి డిజైన్లు, డ్రాయింగ్‌లలో లోపాలు, లోపభూయిష్టమైన నిర్మాణం కారణం.

ప్లానింగ్, ఇన్వెస్టిగేషన్, గ్రౌండ్ ఇంప్రూవ్‌మెంట్, నిర్మాణాల్లో సీడీవో ఎలాంటి పాత్ర పోషించలేదు. సీడీవో ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూంటేనే అది ఇచ్చిన డిజైన్లను, డ్రాయింగ్లను ప్రాజెక్టు నిర్మాణ యూనిట్ క్షేత్రస్థాయిలో సరిగా పాటిస్తున్నారో లేదో తెలుస్తుంది. నిర్మాణంలో ఉన్న బ్యారేజీని ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం సీడీవో పరిధిలో లేకపోవడం దురదృష్టకరం. అందువల్లనే సీడీవో విభాగం ఫ్లోటింగ్ స్ట్రక్చర్‌గా డిజైన్ చేసిన బ్యారేజీలను అందుకు అనుగుణంగా నిర్మించలేదు. వాటిని రిజిడ్ స్ట్రక్చర్లుగా నిర్మించారు. ఇంత పెద్ద ప్రాజెక్టు నిర్మాణంలో విభాగాల మధ్య అత్యుత్తమమైన సమన్వయం అవసరం. అది ఇక్కడ జరగలేదు.

అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఎగువ, దిగువ పైల్ కటాఫ్‌లను రాఫ్ట్‌తో అనుసంధానం చేయగా, మేడిగడ్డ బ్యారేజీలో కనెక్షన్ జాయింట్‌ను ప్రధాన రాఫ్ట్ నుంచి వేరు చేశారు. మూడు బ్యారేజీల్లోని మిగతా అన్ని భాగాల డిజైన్ దాదాపు ఒకేలా ఉన్నప్పుడు ఈ ఒక్క విషయంలోనూ వేర్వేరు ఏర్పాట్లు చేయడంలో హేతుబద్ధత లేదు. ప్రాజెక్టు నిర్మాణ విభాగం చేసిన అభ్యర్థనలకు అనుగుణంగా సీడీవో విభాగం డిజైన్‌లో పలు మార్పులు చేసింది. ఆర్‌సిసి రాఫ్ట్‌లో స్తంభాల కింద ఉన్న లాక్స్‌ను తొలగించడం, రాఫ్ట్ లోతు పెంచడం, సిసి బ్లాక్‌ల సైజు పెంచడం... వంటివి కొన్ని ఉదాహరణలు. సీడీవో కోరిన అన్ని జియోటెక్నికల్ వివరాలను ప్రాజెక్టు ఇన్వెస్టిగేషన్ యూనిట్ అందించి ఉంటే, సీడీవో ఇచ్చిన డిజైన్లు డ్రాయింగ్‌లను ప్రాజెక్టు నిర్మాణ విభాగం పూర్తిస్థాయిలో పాటించి ఉంటే అన్నీ సక్రమంగా జరిగేవి. ఈ రెండూ ఇక్కడ జరగలేదు. ఇందుకు కారణం ఉన్నతాధికారులు సీడీవోతో జోక్యం చేసుకోవడమే!

ముందుగా చెప్పినట్లుగా డీపీఆర్‌లో సూచించిన షీట్ పైల్స్‌ను డిజైన్ల సమయంలో సెకెంట్ పైల్స్‌గా మార్చారు. ప్రైమరీ (పీసీసీ), సెకండరీ (ఆర్సీసీ) సెకెంట్ పైల్స్ డ్రైవింగ్ నాణ్యంగా జరగాలంటే అందుకు సరైన ప్రణాళిక, పర్యవేక్షణ అవసరం. అలా జరిగితేనే సెకెంట్ పైలింగ్ ద్వారా సృష్టించబడిన కట్ ఆఫ్ గోడ నిలువుగా, గట్టిగా ఉంటుంది. ఈ మూడు బ్యారేజీల్లో నిర్మాణ కాలపరిమితిని అందుకోవడానికి, ముందుగా నిర్ణయించిన మార్గంలో వివిధ ప్రాంతాల నుంచి ప్రారంభమయ్యే పైల్స్‌ను నడపడానికి అనేక యంత్రాలను ఉపయోగించారు. ఒక చిన్న పొరపాటు పగుళ్ళకు దారితీయవచ్చు. ఎందుకంటే పైలింగ్‌లో నిమగ్నమైన ప్రతి బృందంలో ఎక్కడో ఒక చోట పొరపాటు జరగవచ్చు. మెథడ్ స్టేట్‌మెంట్ ప్రకారం కటాఫ్ గోడల నీటిని ఆపే బిగుతును తనిఖీ చేయడానికి, నిర్ధారించడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

మూడు బ్యారేజీల విషయంలోనూ పలు కీలకమైన డాక్యుమెంట్లను నీటిపారుదల శాఖ ఆమోదించలేదు (ఉదా: క్వాలిటీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అండ్ ఇన్‌స్పెక్షన్ అండ్ టెస్టింగ్ ప్లాన్, పరీక్షల ఫ్రీక్వెన్సీ, ఏజెన్సీ చేపట్టిన డిజైన్ మిక్స్, వివిధ పనుల మెథడ్ స్టేట్‌మెంట్, ఇతర సంబంధిత డాక్యుమెంట్లు). నీటి పారుదల శాఖకు నాణ్యత, నియంత్రణ యంత్రాంగాలను నిర్వహించడానికి తగినంత సామర్థ్యం లేదు. కేవలం పైపై పర్యవేక్షణ చేస్తూ నేరుగా నిర్మాణ సంస్థలకే ఈ బాధ్యత అప్పగించారు. అంటే తమ పనిని తనిఖీ చేసుకునే బాధ్యతను నిర్మాణ సంస్థలకే వదిలివేశారన్నమాట! ఇది తీవ్రమైన లోపం. బ్యారేజీ భద్రతకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాల్సిన ఈ ప్రాజెక్టులో క్వాలిటీ కంట్రోల్ అండ్ అస్యూరెన్స్ యూనిట్ మరింత క్రియాశీలకంగా ఉండాల్సింది. ముఖ్యంగా సెకెంట్ పైల్‌తో కటాఫ్ గోడ నిర్మాణానికి సంబంధించిన నాణ్యతా నియంత్రణ పరీక్షలను క్వాలిటీ కంట్రోల్ యూనిట్ గానీ, నిర్మాణ సంస్థలు గానీ చేపట్టలేదు. నిర్మాణ సంస్థలు సమర్పించిన మెథడ్ స్టేట్‌మెంట్‌లో కూడా పైల్ కటాఫ్ గోడలకు నాణ్యతా నియంత్రణ, భరోసాలకు సంబంధించిన ప్రస్తావన లేదు.


నిష్క్రమణ (గ్రేడియంట్) లేదా అవశేష పీడనం విషమించినప్పుడు, ఇసుక కణాలు అవశేష పీడనం ద్వారా పైకి తోసుకుపోతాయి. ఈ ఇసుక d/s పైల్ పైన మరుగుతుంది. దీన్నే బాయిలింగ్ అంటారు. నియంత్రణలో లేని బాయిలింగ్ చివరకు పైపింగ్‌కు దారితీస్తుంది. అంటే దిగువ మట్టి హరించుకుపోయి క్రమంగా బ్యారేజీ కుంగిపోతుంది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఇదే జరిగింది.

ప్రస్తుతం ఎగువన ఉన్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా మేడిగడ్డ తరహాలోనే ఉన్నాయి. వాటి నిర్మాణ పద్ధతులు కూడా మేడిగడ్డ తరహాలోనివే. ఈ బ్యారేజీలు కూడా ఇప్పటికే మేడిగడ్డకు ఎదురైన ఎన్నో సమస్యలను చవి చూశాయి. దీనినిబట్టి మేడిగడ్డ బ్యారేజీలోని బ్లాక్ నెం.7లో జరిగిన పైపింగ్, రాఫ్ట్ కింద ఖాళీ గొయ్యి ఏర్పడటం వంటి సమస్యలన్నీ ఈ బ్యారేజీల్లో కూడా ఏర్పడవచ్చు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ వైఫల్యం లాంటిదే అన్నారం లేదా సుందిళ్ల బ్యారేజీ విషయంలో కూడా జరిగే అవకాశం ఉన్నది.



నిర్మాణం పూర్తయిన తర్వాత 2019లో మేడిగడ్డ రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేశారు. కట్ ఆఫ్ వాల్ దిగువన ఉన్న సీసీ బ్లాకుల దిగువ ప్రాంతంలో నీరు వెంటనే భూమి నుంచి బయటకు రావడం గమనించారు. అయితే జలాశయంలో నిల్వ ఉన్న నీటిని మరమ్మతుల కోసం ఖాళీ చేయకుండా నిర్దేశిత అవసరాలకు వాడుకుంటూనే ఉన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడం వల్ల రిజర్వాయర్ మరమ్మతులను నిర్వహించలేకపోయామని ప్రాజెక్టు నిర్మాణ విభాగం పేర్కొంది.

2019లో మొదటి వర్షాకాలం తర్వాత మూడు బ్యారేజీల్లో సీసీ బ్లాకులకు జరిగిన నష్టాన్ని ప్రాజెక్టు నిర్మాణ యూనిట్, నిర్మాణ సంస్థలు గమనించాయి. సంవత్సరాలపాటు మరమ్మత్తు జరగకపోవటం, క్రమబద్ధమైన నిర్వహణ ప్రోటోకాల్ లేకపోవడం వల్ల క్రమంగా క్షీణతకు దారితీసింది. సంబంధిత అథారిటీ నుంచి అనుమతులు రాకపోవడంతో రిజర్వాయర్ మరమ్మతులకు నోచుకోలేదని సమాచారం. ఆపరేషన్, మెయింటెనెన్స్ విషయంలో ఇది ఘోరమైన లోపం.





హద్దు దాటిన పీడనం వల్ల ఇసుక హరించుకుపోయి బ్యారేజీ కుంగుతుంది.

2019లో మొదటి వర్షాకాలం వచ్చిన వెంటనే మూడు బ్యారేజీల దిగువన సీసీ బ్లాకులకు జరిగిన నష్టం, బ్యారేజీల్లో ఇసుక పైపింగ్... ఇతర సమస్యలు క్రమంగా అభివృద్ధి చెందడం ఇరిగేషన్ అధికారులు, నిర్మాణ సంస్థల దృష్టికి వచ్చింది. దురదృష్టవశాత్తూ ఒకరికొకరు ఉత్తర ప్రత్యుత్తరాలు పంపుకోవడం మినహా అటు ఇరిగేషన్ అధికారులు గానీ, ఇటు నిర్మాణ సంస్థలు గానీ సమస్యలను పరిష్కరించడానికి, నష్టాన్ని సరిదిద్దడానికి ఎటువంటి చొరవా చూపించలేదు. దీంతో 2019 నుంచి సీసీ బ్లాకులు, ప్లింత్ స్లాబుల పరిస్థితి క్రమంగా క్షీణించింది. బీఐఎస్ స్టాండర్డ్ ఐఎస్.7349.2012 ప్రకారం ప్రతి సంవత్సరం వర్షాకాలం తర్వాత బ్యారేజీకి దిగువన ఉన్న ఏప్రాన్ ప్రాంతాన్ని పరిశీలించాలి. కానీ ఇలా చేయకపోవడం వల్ల ఏటేటా క్షీణతకు దారితీసి, అంతిమంగా పెద్ద సెటిల్‌మెంట్ వైఫల్యంగా పరిణమించింది. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ యూనిట్ తన విధులు, బాధ్యతల్లో ఘోరంగా విఫలమైంది.

ప్రస్తుతం ఎగువన ఉన్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా మేడిగడ్డ తరహాలోనే ఉన్నాయి. వాటి నిర్మాణ పద్ధతులు కూడా మేడిగడ్డ తరహాలోనివే. ఈ బ్యారేజీలు కూడా ఇప్పటికే మేడిగడ్డకు ఎదురైన ఎన్నో సమస్యలను చవి చూశాయి. దీనినిబట్టి మేడిగడ్డ బ్యారేజీలోని బ్లాక్ నెం.7లో జరిగిన పైపింగ్, రాఫ్ట్ కింద ఖాళీ గొయ్యి ఏర్పడటం వంటి సమస్యలన్నీ ఈ బ్యారేజీల్లో కూడా ఏర్పడవచ్చు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ వైఫల్యం లాంటిదే అన్నారం లేదా సుందిళ్ల బ్యారేజీ విషయంలో కూడా జరిగే అవకాశం ఉన్నది.

■ వెదిరె శ్రీరామ్
కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సలహాదారు





టెన్త్‌లో 30th దిగజారిన హైదరాబాద్ స్థానం



ఫలితాల అనంతరం ఓ పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థినుల ఆనందం

ఉత్తీర్ణతలో మాత్రం 6 శాతం పెరుగుదల ● కలెక్టర్ దృష్టి పెట్టినా మెరుగుపడని ర్యాంక్ ● బాలికలదే మళ్లీ హవా

పదో తరగతి వార్షిక ఫలితాల్లో ఈసారి కూడా హైదరాబాద్ జిల్లా రాష్ట్రస్థాయి ర్యాంకులో వెనకబడింది. గతేడాది ఫలితాలతో పోల్చితే ఉత్తీర్ణతలో 6 శాతం పెరిగినప్పటికీ, ర్యాంకుపరంగా 30వ స్థానంలో నిలిచింది. గతేడాది రాష్ట్రస్థాయిలో 28వ స్థానంలో ఉండగా, ఈసారి 2 పాయింట్లు దిగువకు పోయింది.

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జిల్లాలో టెన్త్ ఫలితాల్లో మెరుగైన ర్యాంక్ సాధించేందుకు స్వయంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక దృష్టి సారించినా సారీ నిరాశే మిగిలింది. ఈసారి జిల్లాలో 95 శాతానికి పైగా ఫలితాలు రావాలని, విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తరచూ తనిఖీలు నిర్వహించారు. పరీక్షలను ఎలా రాయాలనే విషయంపై కలెక్టర్ స్వయంగా పలు స్కూళ్లలోని పిల్లలకు అవగాహన కల్పించారు. అయినా ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఇటు తల్లిదండ్రులు, అటు అధికారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. కొంతమంది అధికారులు, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగానే మెరుగైన ఫలితాలు రాలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రంగారెడ్డి జిల్లాకు 24వ స్థానం

25 ప్రభుత్వస్కూల్స్‌లో 100 శాతం ఉత్తీర్ణత

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా రాష్ట్రంలో 24వ స్థానంలో నిలిచింది. 25 ప్రభుత్వ స్కూళ్లలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో మొత్తం 50,811 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 46,245 మంది విద్యార్థులు పాసయ్యారు. ఉత్తీర్ణత శాతం 91.01గా నమోదైంది. గత ఏడాది కంటే ఈ సారి 4.04 శాతం పెరిగింది.

బాలికలదే హవా

పదో తరగతి వార్షిక ఫలితాల్లో మరోసారి ప్రభుత్వ పాఠశాలల బాలికలు సత్తాచాటారు. ప్రైవేట్ పిల్లలతో పోటీపడి 10/10 జీపీఏ

మిగతా 8వ పేజీలో..

10/10 జీపీఏ సాధించిన కొందరు విద్యార్థులు

- అమీర్‌పేట డివిజన్ ఉన్నత పాఠశాలలో 82 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 67 మంది ఉత్తీర్ణులు అయ్యారు. అక్షిత 10/10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది.
- ప్రగతినగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఎం అక్షర 10/10 జీపీఏ సాధించి కుత్బుల్లాపూర్‌లో టాపర్‌గా నిలిచింది.
- సనత్‌నగర్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు 10/10 సాధించారు.

ఇంకా..

- సరూర్‌నగర్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన నజియా ఖటూన్
- మణికొండ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన డి. కుశ్వంత్ రామ్‌చంద్రవర్మ
- సుల్తాన్‌బజార్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన వైజీ ప్రతిక్ష
- మాసబ్‌ట్యాంక్‌లోని రెడ్‌క్రాస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జెట్టి జ్యోత్స్న
- మణికొండ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి కుశ్వంత్
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం ప్రభుత్వ పాఠశాల ఇంగ్లిష్ మీడియం విద్యార్థిని మేఘన
- కర్మన్‌ఘాట్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని అమూల్య 10/10 జీపీఏ సాధించారు.

విజయానికి వైకల్యం అడ్డుకాదని..



బీరెల్లి అంజలీదేవిని అభినందిస్తున్న కుటుంబసభ్యులు

నిజాంపేట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సాధించాలనే తపన ఉంటే ఎన్ని అడ్డంకులు ఉన్నా అధిగమించవచ్చునని బీరెల్లి అంజలీదేవి నిరూపించింది. పదోతరగతి ఫలితాల్లో 10 జీపీఏకు గాను 9.4 సాధించి భళా అనిపించింది. నిజాంపేట్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న అంజలీదేవి ఎత్తు 2.5 అడుగులు. తండ్రి సంఘమేష్ వాచ్‌మన్. తల్లి శిరిష గృహిణి. అంజలీదేవి పట్టుదలతో చదివి స్కూల్లో మొదటి స్థానంలో నిలిచింది. ఐఏఎస్ కావాలనేది తన లక్ష్యమని చెప్పింది.

గ్రేటర్‌లో పదో తరగతి ఫలితాలు జిల్లా..

సంవత్సరం	జిల్లా	పరీక్షకు హాజరు	మొత్తం ఉత్తీర్ణత	బాలురు (పాస్)	బాలికలు (పాస్)	శాతం
2024	హైదరాబాద్	73,202	63,511	29,513	33,998	86.76
	రంగారెడ్డి	50,811	46,245	23,508	22,737	91.01
	మేడ్చల్	46,736	41,879	21,131	20,748	89.61
2023	హైదరాబాద్	68,468	54,971	25,333	29,638	80.29
	రంగారెడ్డి	47,551	41,488	20,825	20,663	87.25
	మేడ్చల్	43,319	39,299	19,802	19,497	90.72

బాలాపూర్‌లో సీఎం సభ గ్రాండ్ సక్సెస్

- పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు
- నేతలు, కార్యకర్తలతో కోలాహలం
- భారీ జెండాలతో ఎన్ఎస్‌యూఐ కార్యకర్తల సందడి
- ఉత్సాహంగా, ఆసక్తిగా సాగిన సీఎం ప్రసంగం



బాలాపూర్ చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం రాత్రి మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. సీఎం రేవంత్ మాట్లాడుతున్నంత సేపూ ప్రజలు, కార్యకర్తలు ఈలలు, చప్పట్లతో సందడి చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు ప్రజలను భారీగా సమీకరించడంతో సీఎం సభ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, చేవెళ్ల ఇన్‌చార్జి వేం నరేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి,

మిగతా 8వ పేజీలో..



కొండాపూర్‌లోని ఓమాల్‌లో క్రికెటర్లు



ప్యాట్ కమిన్స్

సిటీలో క్రికెటర్ల సందడి

బేగంపేట/అమీర్‌పేట/గచ్చిబౌలి ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సన్‌రైజర్స్ హైదరాబాద్ టీం నగరంలో మంగళవారం సందడి చేసింది. బేగంపేటలోని లైఫ్ స్టైల్‌లో, అమీర్‌పేటలోని ఓ హోటల్‌లో మంగళవారం జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ పాల్గొన్నారు. తనకు మహేష్‌బాబు నటన, హైదరాబాద్ బిర్యానీ అంటే ఇష్టమని తెలిపారు. అలాగే, కొండాపూర్‌లోని ఓ మాల్‌లో స్టార్ క్రికెటర్లు హెన్రిచ్ క్లాసెన్, అబ్దుల్ సమద్, నితీష్‌కుమార్‌రెడ్డి, జయదేశ్ ఉనద్కత్, నటరాజన్ అభిమానులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అభిమానులు క్రికెటర్లతో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు.

కాంగ్రెస్ కార్నర్ మీటింగ్‌లు.. ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 1న కాంగ్రెస్ పార్టీ రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్న సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మూసాపేట చిత్తారమ్మ ఆలయం వద్ద, చందానగర్‌లోని తుల్జాభవానీ మందిరం వద్ద ర్యాలీ, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులుంటాయని తెలిపారు. భరత్‌నగర్ బ్రిడ్జి నుంచి కైతలాపూర్ వైపునకు వెళ్లే వాహనాలను మూసాపేట వైపు పంపుతారు. హైటెక్ సిటీ నుంచి కూకట్‌పల్లి వచ్చే వాహనాలను కేపీహెచ్‌బీ 4ఫేజ్, లోధా అపార్ట్‌మెంట్ వైపు పంపుతారు. బాలానగర్ వైపు నుంచి వచ్చే వాహనాలను కూకట్‌పల్లి, ఐడీఎల్ లేక్ వైపు పంపుతారు. అదే విధంగా హెచ్‌సీయూ నుంచి బీహెచ్ఈఎల్ వెళ్లే వాహనాలను నల్లగండ్ల ఫ్లైఓవర్ మీదుగా పంపుతారు.

క్రిమినల్ కేసులతో దారికి!

ఎన్నికల విధులకు పలువురు ఉద్యోగులు హాజరు

ఎన్నికల విధుల శిక్షణకు గైర్హాజరైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన అనంతరం కొందరు ఉద్యోగులు విధులకు వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. శిక్షణకూ హాజరయ్యారు. అయినా వారిపై నమోదైన కేసుల విషయంలో ఏం చేయలేమని జీహెచ్ఎంసీ వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయంలో న్యాయపరంగా ముందుకు వెళ్లాల్సిందే అని ఎన్నికల సిబ్బందిని సమకూరుస్తోన్న బల్దియాలోని శానిటేషన్ విభాగం అదనపు కమిషనర్ కార్యాలయం స్పష్టం చేస్తోంది. దీంతో కేసులు నమోదైన ఉద్యోగులు లబోదిబోమంటున్నారు. సర్వీసులో ఎఫ్ఐఆర్ మచ్చగా ఉంటుందేమో అని ఆందోళన చెందుతున్నారు.

- సర్వీసులో మచ్చగా మారుతుందన్న ఆందోళన
- కేసుల విషయంలో ఏం చేయలేమంటోన్న అధికారులు
- న్యాయపరంగా ముందుకు సాగాల్సిందే
- విధులకు హాజరైన వారి విషయంలో సానుకూలత ఉండే అవకాశం



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులకు గైర్హాజరైన ఉద్యోగులపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. క్రిమినల్ కేసుల నమోదుకూ వెనుకాడలేదు. దీంతో అధికారులు దారికి వస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోసం హైదరాబాద్ జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తించాలని పలు ప్రభుత్వ విభాగాల అధికారులు, ఉద్యోగులకు జిల్లా ఎన్నికల అధికారి పేరిట సందేశాలు వెళ్లాయి. 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 3986 పోలింగ్ కేంద్రాల్లో విధుల నిర్వహణకు దాదాపు 16 వేల మంది అవసరం. 20 శాతం అదనపు సిబ్బందితో కలిపి మొత్తం 20 వేల మందిని సమకూర్చాలని నిర్ణయించారు. దాదాపు అన్ని ప్రభుత్వ విభాగాల ఉద్యోగులు విధులు నిర్వర్తించాలని సూచించారు. ఇందులో భాగంగా పలు దఫాలుగా

మిగతా 8వ పేజీలో..

రూ820 కోట్లు..! ● రికార్డు స్థాయిలో ఎర్లీబర్డ్ ఆదాయం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎర్లీ బర్డ్ పథకంలో జీహెచ్ఎంసీకి రికార్డు స్థాయి రాబడి వచ్చింది. మంగళవారం అర్ధరాత్రి వరకు 7.27లక్షల మంది రూ.820కోట్లు ఆస్తి పన్ను చెల్లించారు. కిందటి ఆర్థిక సంవత్సరం రూ.785.84 కోట్ల పన్ను వసూలైంది. జీహెచ్ఎంసీ చరిత్రలో ఇదే రికార్డు. ఇప్పుడా రికార్డును తిరగరాస్తూ రూ.820 కోట్లు వచ్చాయని సంస్థ వర్గాలు పేర్కొన్నాయి.

రూ. 3.32 కోట్లు విడుదల

సీజ్ చేసిన నగదు సంబంధిత వ్యక్తులకు అప్పగింత

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తోన్న తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న రూ.3.32 కోట్లు విడుదల చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ తెలిపారు. ఆధారాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ మొత్తం తీసుకెళ్తున్న 129 కేసులకు సంబంధించిన రూ.4.48 కోట్లు జిల్లా గ్రీవెన్స్ కమిటీ(డీజీసీ)కి రాగా.. ఇందులో 123 కేసులకు సంబంధించిన రూ.3.32 కోట్లు విడుదల చేసినట్టు పేర్కొన్నారు. రూ.10 లక్షలు మించి పట్టుబడిన మూడు కేసులకు సంబంధించిన రూ.66.49 లక్షలను ఆదాయ, వాణిజ్య పన్నుల శాఖలకు సిఫారసు చేశారు. షెడ్యూల్ విడుదల నుంచి ఇప్పటి వరకు రూ.19.67 కోట్ల నగదు, రూ.9.43 కోట్ల విలువైన వస్తువులు, 21,618 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా మెజిస్ట్రేట్‌గా వ్యవహరించే కలెక్టర్ నుంచి రూ.4.48 కోట్ల నగదు సంబంధిత కేసులు మాత్రమే డీజీసీకి సిఫార్సు చేశారు. సీజ్ చేసిన డబ్బులకు సంబంధించి కమిటీ ఛైర్మన్, అదనపు కమిషనర్ 96188 88110, కమిటీ కన్వీనర్ 91778 72240 నంబర్లకు ఫోన్ చేయాలని రోనాల్డ్‌రోస్ సూచించారు.

3, 4 తేదీల్లో హోమ్ ఓటింగ్

- ఓటర్లు అందుబాటులో ఉండాలి
- రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మే 3, 4 తేదీల్లో 85 ఏళ్ల పైబడిన ఓటర్లకు హోమ్ ఓటింగ్ ఏర్పాటు చేసినట్లు హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఆ సమయంలో ఓటర్లు ఇంటిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ఎన్నికల నిర్వహణపై ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 22,17,094 మంది ఓటర్లు ఉన్నారని.. ఇందులో 11,25,310 మంది పురుషులు, 10,91,587 మంది మహిళలు, 107 మంది ఇతరులు ఉన్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్‌కు గుర్తుల గుబులు..!

రోడ్ రోలర్, చపాతి మేకర్ ఎఫెక్ట్ భయం ● సికింద్రాబాద్, హైదరాబాద్ స్థానాలకు కేటాయింపు



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాన పార్టీల అభ్యర్థులకు గుర్తులు గుబులు పుట్టిస్తున్నాయి. తమ పార్టీ గుర్తును పోలిన గుర్తులు పలు పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించడంతో ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ అభ్యర్థులను గతంలోలానే రోడ్ రోలర్, చపాతి మేకర్ గుర్తులు ఆందోళన కలిగిస్తున్నాయి. యుగ తులసి పార్టీకి ఎన్నికల సంఘం అధికారికంగా రోడ్ రోలర్ గుర్తు కేటాయించగా.. మరో స్వతంత్ర అభ్యర్థికి చపాతి మేకర్ గుర్తు దక్కింది. బ్యాలెట్‌లో నాలుగో అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తోన్న టీ పద్మారావుగౌడ్ ఉండగా.. ఐదో అభ్యర్థిగా రోడ్ రోలర్ గుర్తున్న యుగ తులసి పార్టీ అభ్యర్థి కొలిశెట్టి శివకుమార్ ఉన్నారు. పోలిన గుర్తులు బ్యాలెట్‌లో ఒకే చోట ఉండడంతో ఓటర్లు అయోమయానికి గురవుతారన్న భయం బీఆర్ఎస్ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. హైదరాబాద్‌లో స్వతంత్ర అభ్యర్థికి చపాతి మేకర్ గుర్తు కేటాయించారు. రోడ్ రోలర్, చపాతి మేకర్ గుర్తులను ఏ పార్టీకి, స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించకుండా ఆదేశాలు జారీ చేయాలని అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పార్టీ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది.

ఈ సారైనా ఇస్తారా..!

ఓటర్లకు చేరని ఇన్ఫర్మేషన్ స్లిప్పులు

- తరచూ మారుతోన్న పోలింగ్ కేంద్రాలు
- సమాచారం తెలియక ఓటర్ల ఇబ్బందులు
- పోలింగ్‌కూ కొందరు దూరం
- కీలక అధికారులకు స్లిప్పులు.. ఫొటోలకు ఫోజులు
- క్షేత్రస్థాయిలో ఇష్టారాజ్యం

జీహెచ్ఎంసీ, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఏవైనా క్షేత్రస్థాయిలో ఓటర్లకు ఇన్ఫర్మేషన్ స్లిప్పులు అందడం లేదు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, సీఈఓ వంటి కీలక అధికారుల నివాసాలకు వెళ్తోన్న అధికారులు వారికి ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులు అందజేస్తూ ఫొటోలకు పోజులిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పంపిణీ ఎలా జరుగుతోంది..? ఎవరికి ఇస్తున్నారు.. ఏ ప్రాంతాలకు ఇంకా వెళ్లలేదు.. అన్నది ఉన్నతాధికారులు పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. దీంతో సిబ్బంది ఇస్తేనే సమాచారం అన్నట్టుగా పరిస్థితి మారింది.

రూ.లక్షలు ఖర్చు.. ఓటర్‌కు చేరని స్లిప్పులు

జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో 45.70 లక్షల మంది ఓటర్లు.. 3,986 పోలింగ్ కేంద్రాలున్నాయి. పోలింగ్ కేంద్రాల వారీగా బూత్ లెవల్ ఆఫీసర్లు, సహాయక సిబ్బంది ఉన్నారు. ఓటర్ నమోదు, పేర్ల తొలగింపు దరఖాస్తుల పరిశీలనతోపాటు.. ఎన్నికల సమయంలో ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులు వాళ్లు పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ పని చేసినందుకుగాను సిబ్బందికి ప్రత్యేక చెల్లింపులుంటాయి. బీఎల్ఓలు స్లిప్పులు పంచుతున్నారా.. లేదా? దరఖాస్తుల పరిశీలనకు క్షేత్రస్థాయిలో తిరుగుతున్నారా..? అన్నది నియోజకవర్గాల వారీగా ఉండే అధికారులు పట్టించుకోవడం లేదు. సక్రమంగా పని చేయలేదన్న కారణంతో బీఎల్ఓలకు కొంత మొత్తం చెల్లిస్తోన్న అధికారులు.. మిగతా నిధులను దారి మళ్లిస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి. ఈ విషయం తెలిసినా కేంద్ర కార్యాలయ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. స్లిప్పులు, స్టిక్కర్ల ముద్రణకు రూ.20 లక్షలకుపైగా ఖర్చు చేస్తున్నారు.

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీలు/అభ్యర్థులు ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులు పంపిణీ చేయవద్దు. గతంలో ఓటర్లకు సమాచార స్లిప్పులు అందజేసే అవకాశముండగా.. ఆ సాకుతో ప్రలోభాలకు తెర తీస్తున్నారన్న ఉద్దేశంతో ఎన్నికల సంఘం కొత్త నిబంధన తీసుకువచ్చింది. కేవలం ప్రభుత్వ విభాగాల సిబ్బంది మాత్రమే స్లిప్పులు అందజేయాలి. ఇంటింటికీ తిరిగి పోలింగ్ కేంద్రం, ఓటర్ జాబితాలో సీరియల్ నంబర్, పార్ట్ నంబర్ వివరాలతో కూడిన స్లిప్పులు ఓటర్లకు ఇవ్వాలి. దీంతో ఓటర్లు సులువుగా పోలింగ్‌లో పాల్గొనే అవకాశముంటుది. కానీ, గ్రేటర్‌లో మెజార్టీ ఓటర్లకు సమాచార స్లిప్పులు అందడం



లేదు. మొబైల్ యాప్, ఆన్‌లైన్ వెబ్‌సైట్లలో ఓటర్ ఇన్ఫర్మేషన్ తెలుసుకునే అవకాశమున్నా.. కొందరికి వాటి వినియోగం తెలియదు. జనసాంద్రత ఎక్కువగా ఉండే నగరంలో తరచూ పోలింగ్ కేంద్రాలు మారుతుంటాయి. ఓ ఎన్నికల్లో ఓ పోలింగ్ కేంద్రంలో ఓటేస్తే.. మరుసటి ఎన్నికల్లో అక్కడే ఓటు వేయాల్సి ఉంటుందని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. దీంతో ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాల వివరాలు ఓటర్లు తెలుసుకోవాల్సి ఉంటుంది. స్లిప్పులు రాక, సమాచారం తెలియక కొందరు పోలింగ్‌కు దూరంగా ఉంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ అంబర్‌పేట, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, చార్మినార్ తదితర నియోజకవర్గాల్లో స్లిప్పుల పంపిణీ జరుగలేదు.

నేడు కవి సమ్మేళనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మే డే సందర్భంగా తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం కవిసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్ తెలిపారు. ఎన్నికల సందర్భాన్ని పురస్కరించుకుని 'ఎన్నికల భారతం' కవితా సంకలనం పుస్తకావిష్కరణ చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏజీటీయూసీ ఎండీ యూసుఫ్ విచ్చేస్తుండగా, అరసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం పుస్తకావిష్కరణ చేస్తారని తెలిపారు.

వంట రుచిగా లేదని ఇటుకతో బాదిన భర్త

● భార్య మృతి


రవీణా దుర్వే

నిజాంపేట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వంట రుచిగా లేదని భార్యతో ఘర్షణ పడ్డ భర్త క్షణికావేశంలో ఇటుకతో భార్య తలపై మోదాడు. దాంతో కుప్పకూలిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన రవీణా దుర్వే (28), నవీన్ దుర్వే (35) దంపతులు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ప్రగతి నగర్‌లో ఉంటూ కూలీగా పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి ఇంట్లో చేసిన వంట రుచిగా లేదని భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆవేశానికి లోనైన భర్త నవీన్ భార్య తలపై ఇటుకతో బలంగా కొట్టాడు. దీంతో ఆమె కుప్పకూలి మృతిచెందింది. తోటికూలీలు ఇచ్చిన సమాచారంతో బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

భార్యను కొట్టి చంపిన కేసులో భర్తకు పదేళ్ల జైలు


గడ్డల నాగప్ప

కూకట్‌పల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భార్యను సిమెంట్ రాయితో తలపై బలంగా కొట్టి చంపిన కేసులో భర్తకు పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ కూకట్‌పల్లిలోని 6వ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి మంగళవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరుకు చెందిన గడ్డల నాగప్ప (26), చిట్టెమ్మ దంపతులు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి మియాపూర్‌లోని మాతృశ్రీనగర్ వద్ద మెట్రో ఫుట్‌పాత్‌పై నివాసముంటూ చిత్తుకాగితాలు ఏరుకొంటూ జీవించేవారు. వీరిది ప్రేమ వివాహం. అయితే, భార్య వ్యవహారశైలిని అనుమానించిన భర్త తరచూ ఆమెతో గొడవ పడేవాడు. పలుమార్లు హెచ్చరించినా తీరు మార్చుకోకపోవడంతో 2020 డిసెంబర్ 23న రాత్రి ఆమెకు మద్యం తాగించాడు. మత్తులో ఉన్న ఆమె తలపై నాగప్ప సిమెంట్ రాయితో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు కోర్టులో నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి జస్టిస్ సి.పావని నిందితుడైన నాగప్పకు పదేళ్ల జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు పీపీ తెలిపారు.

కాంగ్రెస్‌కు సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి మద్దతు

బర్కత్‌పుర, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ జాతీయ అధ్యక్షుడు గొంటి కుమార్‌చౌదరి తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజలకు చేసింది ఏమీ లేదని అన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం సికింద్రాబాద్‌ను అభివృద్ధి చేయలేనది, ప్రత్యేక నిధులు తీసుకురావడంలో కిషన్‌రెడ్డి పూర్తిగా వైఫల్యం చెందారని ఆరోపించారు. రిజర్వేషన్ల విషయంపై ప్రధాని మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా లేదంటే ఉమ్మడి రాజధాని అవుతుందమని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొనడం బీఆర్‌ఎస్ ఓటమికి నిదర్శనమన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని అన్ని ఎంపీ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

● ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఫ్రంట్

బర్కత్‌పుర, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 'సేవ్ ఇండియా, సేవ్ డెమోక్రసీ' నినాదంతో ప్రతి ఒక్కరు ఎంపీ ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఫ్రంట్ పిలుపునిచ్చింది. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఫ్రంట్ చైర్మన్ సనావుల్లాఖాన్, వివిధ సంఘాల ప్రతినిధులు సలీంహలీ, ఎస్.ఎస్. తన్వీర్, హైముద్దీన్, షకీల్ తదితరులు మాట్లాడారు. దేశం ఫాసిస్టు ధోరణిలో పోతుందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్ల కాలంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని, మైనారిటీ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఇండియా కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. ఇండియా కూటమిని గెలిపిస్తే దేశంలో ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడుతుందన్నారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి



మైలార్‌దేవుపల్లి డివిజన్ శ్రీరాంనగర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి తనయుడు ఆర్యాన్‌రెడ్డి, తదితరులు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపిస్తే చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని తెలంగాణ రాష్ట్ర పాడిపరిశ్రమ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం మైలార్‌దేవుపల్లి డివిజన్ శ్రీరాంనగర్, నేతాజీనగర్, వెంకటేశ్వర కాలనీ, బుద్వేల్ రైల్వేస్టేషన్ బస్తీలలో రంజిత్‌రెడ్డి తనయుడు ఆర్యాన్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు సానెం శ్రీనివాస్‌గౌడ్, సామ ఇంద్రపాల్‌రెడ్డి, ఎస్.ధనుంజయ్ తదితరులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ అన్నివర్గాలను సమానంగా చూసే పార్టీ అని, పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి పాటుపడే పార్టీ అన్న ఆయన, దేశంలో స్వేచ్ఛ సమాన త్వం కావాలంటే హస్తం గుర్తుకు ఓటేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ ఖాలేద్, కవితారెడ్డి, గోపాల్, శ్రీనివాస్ గుప్తా, బ్రహ్మచారి, గోపాల్, నర్సింహ్మయాదవ్, సతీష్, కిషోర్, సునీత, రాజిరెడ్డి పాల్గొన్నారు.

శివరాంపల్లిలో....

శివరాంపల్లి బస్తీ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ్ ఆధ్వర్యంలో డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీకి ఓటేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కోరని బాల్‌రాజ్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు కావాలంటే కాంగ్రెస్‌కు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఆస్తులను అమ్మి ప్రైవేటు పరం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం కావాలా... ప్రజల కోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీ కావాలా.. ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కె.ఎస్ దయానంద్, భరత్‌రెడ్డి, సాయి ముదిరాజ్, కోరని శ్యామ్, పెండ్యాల శ్రీధర్, సీహెచ్ అమర్నాథ్, కోరని నరేందర్, కోరని పాండు, పి.ఉమా మహేశ్వరీ, గుంటి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో కాంగ్రెస్ నేతల ప్రచారం

సరూర్‌నగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్ధతుగా మంగళవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 10,11వ డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లో కాంగ్రెస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ఓటర్లకు కరపత్రాలు పంచుతూ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ.. హస్తం గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలింపిచాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కంచర్ల అమరేందర్‌రెడ్డి, డి.యాదిరెడ్డి, రవీందర్, సామిడి సాయిచరణ్‌రెడ్డి, అభిషేక్, రమణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

రంజిత్‌రెడ్డికి మద్దతుగా కార్పొరేటర్ దొడ్ల ప్రచారం

హైదర్‌నగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఆల్విన్‌కాలనీ డివిజన్ కేటీఆర్‌నగర్‌లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి కరపత్రాలు అందించి హామీలు నేరవేరుస్తున్న కాంగ్రెస్‌కు ఓట్లువేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, సీహెచ్ భాస్కర్, షౌకత్ అలీమున్నా, సయ్యద్, యాదగిరి, సంగమేష్, అగ్రవాసు, జనార్దన్, శ్రీనివాస్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: సీతారెడ్డి

చేవెళ్ల:ఎంపీ ఎన్నికలలో రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణీ సీతారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆలూర్, వెంకన్నగూడ గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యం ప్రజలతో మమేకమై ప్రజా సమసస్యలను పరిష్కరిస్తూ ఆపదలో ఉన్న వారికి నేను ఉన్నాని భరోసా ఇచ్చే ప్రజానేత రంజిత్‌రెడ్డి అని అన్నారు. చేవెళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ది సాధ్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటి పథకాలను ప్రజలకు చేరవేయాలన్నారు. చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డికి మరో అవకావం ఇవ్వాలని కోరారు.



ఆలూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న రంజిత్‌రెడ్డి సతిమణీ సీతారెడ్డి

కార్యక్రమంలో చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, సీనియర్ నాయకుడు సున్నపు వసంతం, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పెంటయ్యగౌడ్, మండల అక్షుడు వీరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పది ఫలితాలలో పయనీర్ కాన్సెప్ట్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

రాజేంద్రనగర్, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాలలో రాజేంద్రనగర్ సర్కిల్ కాటేదాన్ టీఎన్‌జీవోస్ కాలనీ మణికంఠహిల్స్‌లోని పయనీర్ కాన్సెప్ట్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 85 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 25 మంది విద్యార్థులు 9జీపీఏ సాధించారు. 54మంది విద్యార్థులు 8జీపీఏ, 77 మంది విద్యార్థులు 7జీపీఏ సాధించి ప్రతిభ కనబరిచారు. చింతకింది శశాంక్ 10 జీపీఏ స్కోర్‌తో పాఠశాల టాపర్‌గా నిలిచారు. దీపికానాయక్, శుభం సారంగి 9.8 జీపీఏ సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సంరెడ్డి సాకేత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ తృప్తిపాటిల్, అదనపు ప్రిన్సిపాల్ బత్తుల సుధీర్ అభినందించారు. పాఠశాల టాపర్‌గా నిలిచిన చింతకింది శశాంక్‌కు రూ.10వేల చెక్కును ప్రోత్సాహక బహుమతిగా అందించారు.



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ సాకేత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ తృప్తిపాటిల్, సుధీర్

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/bk5rUid లో చదవండి.

Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.

నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్

తెలుగు వర్సిటీలో ఫైన్ ఆర్ట్స్ శిక్షణ తరగతులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణంలో శిల్పం, చిత్రలేఖనం శాఖ పక్షాన ఫైన్ ఆర్ట్స్ నందు వేసవి సెలవుల్లో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ తెలిపారు. పెయింటింగ్స్, శిల్పం, ప్రింట్ మేకింగ్ కోర్సులకు సంబంధించి 45 రోజులపాటు శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్ ఇస్తామని అన్నారు. మే 8 నుంచి తరగతులు ప్రారంభమవుతాయిని, కోర్సు రూ.6,000 ఫీజును చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాల కోసం 83090 11865, 83094 98807 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

బీజేవైఎం రంగారెడ్డి ఉపాధ్యక్షుడిగా విజయేందర్

పహాడీషరీఫ్ ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బీజేవైఎం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా మామిడిపల్లి గ్రామానికి చెందిన లిక్కి విజయేందర్‌రెడ్డి నియమితులయ్యారు. మంగళవారం జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు టి. యాదీశ్ ఆయనకు నియామకపత్రం అందజేశారు.

గడప గడపకూ బీఆర్‌ఎస్ ప్రచారం



గౌలిగూడలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌యాదవ్

అఫ్జల్‌గంజ్/మదీన, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ ఎంపీ బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ గడప గడపకు ప్రచారం చేశారు. మంగళశారం గౌలిగూడ మహంకాళి ఆలయం, సన్నీమెస్, నకాస్‌గల్లీ, గౌలిగూడ రామ్‌మందిర్ వాడల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి బీఆర్‌ఎస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం కిషన్‌బాగ్‌లోని హైదరాబాద్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ కిషన్‌బాగ్ డివిజన్ అధ్యక్షుడు సాయికిరణ్ అధ్యక్షతన జరిగిన ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ బలంగా ఉన్నదని, సమష్టిగా పనిచేస్తే విజయం ఖాయమన్నారు.

కన్హా శాంతివనం ఓ ఆధ్యాత్మిక కేంద్రం

● మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్



బాబూజీ మహరాజ్ నాణాన్ని విడుదల చేస్తున్న రామ్‌నాథ్ కోవింద్, కమలేష్ డి పటేల్

నందిగామ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కన్హా శాంతివనం ఓ ఆధ్యాత్మిక కేంద్రమని, ఇక్కడ గురూజీలు ఇస్తున్న సందేశాలు ప్రజల్లో ఆలోచనలను రేకెత్తిస్తున్నాయని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. రాంచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురువు బాబూజీ మహరాజ్ 125వ జయంతిని రెండో రోజు మంగళవారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని కన్హా శాంతివనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ బాబూజీ మహరాజ్ అన్ని మతాలతో తన బంధాన్ని పెంచుకున్నారని, ఆయన దూరదృష్టితోనే హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ అనేక సామాజిక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. బాబూజీ 125వ జయంతి సందర్భంగా వారు చేసిన సేవలకు గుర్తింపుగా రిజర్వ్ బ్యాంకు ప్రవేశపెట్టిన నాణాన్ని రామ్‌నాథ్ కోవింద్, రాంచంద్రమిషన్ గురూజీ పద్మభూషణ్ కమలేష్ డి పటేల్ విడుదల చేశారు. అంతకుముందు కమలేష్‌తో కలిసి మాజీ రాష్ట్రపతి ధ్యానం చేశారు. కార్యక్రమానికి దేశవిదేశాల నుంచి 50వేల మంది అభ్యాసకులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.

ఉస్మానియా ప్రతిష్ఠను దెబ్బతీసిన కాంగ్రెస్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వందేళ్ల చరిత్ర ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ ప్రతిష్ఠను కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసిందని, విద్యుత్, తాగునీటి సమస్యను కారణంగా చూపుతూ విద్యార్థులను వెళ్లగొట్టేందుకు కుట్ర చేస్తోందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ యూనివర్సిటీ విద్యార్థుల సమస్యపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించిన తర్వాతే ప్రభుత్వం చీఫ్ వార్డెన్‌కు షోకాజ్ నోటీసులిచ్చి చేతులు దులుపుకొందన్నారు. అయితే వీసీ అనుమతి లేకుండా హాస్టల్‌ను ఖాళీ చేయాలని నోటీసులు ఎలాఇస్తారని, చీఫ్ వార్డెన్ సొంత నిర్ణయం తీసుకుంటారా అని ఆయన ప్రశ్నించారు. షోకాజ్ నోటీసులు ఇవ్వాల్సింది చీఫ్ వార్డెన్‌కు కాదు.. యూనివర్సిటీ విద్యార్థులకు విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించలేని స్థితిలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

టీఎస్ ఎప్‌సెట్‌కు 617మంది ఆంగ్లో ఇండియన్ల దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తోన్న టీఎస్ ఎప్‌సెట్‌కు ఏపీ, తెలంగాణ విద్యార్థులతో పాటు ఆంగ్లో ఇండియన్స్ కూడా పోటెత్తారు. గతంలో కంటే భిన్నంగా ఈ ఏడాది ఎప్‌సెట్‌కు 617మందికి పైగా ఆంగ్లో ఇండియన్ అభ్యర్థులు దరఖాస్తు చేయడం విశేషం. వీరిలో 386మంది ఇంజనీరింగ్‌కు దరఖాస్తు చేయగా, 231మంది అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షకు దరఖాస్తులు సమర్పించారు. గతంలో పదుల సంఖ్యలో మాత్రమే ఆంగ్లో ఇండియన్స్ ఎప్‌సెట్‌కు దరఖాస్తు చేసేవారని, ఈ ఏడాది 600కు పైగా దరఖాస్తులు రావడం పట్ల జేఎన్‌టీయూ అధికారులతో పాటు సాంకేతిక విద్యావిభాగం అధికారులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

జేఎన్‌టీయూలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లకు ఘన సన్మానం



వెంకటరెడ్డి దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న జేఎన్‌టీయూ వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మూడున్నర దశాబ్దాలుగా జేఎన్‌టీయూలో పనిచేస్తూ పదవీవిరమణ చేసిన ఇద్దరు అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లను వర్సిటీ ఉన్నతాధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అడ్మిషన్స్ విభాగంలో ఏఆర్‌గా పనిచేస్తున్న తుమ్మల వెంకటరెడ్డితో పాటు జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఏఆర్‌గా పనిచేసిన చంద్రశేఖర్ మంగళవారం పదవీరమణ చేశారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, రెక్టార్ విజయకుమార్‌రెడ్డి జ్ఞాపికలతో వారిని ఘనంగా సత్కరించారు.

'రెవెన్యూ ఉద్యోగుల బిల్లులు చెల్లించాలి'

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించి తిరస్కరించిన బిల్లులను తక్షణం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ శాఖ ఉద్యోగులు సమర్పించిన వెహికల్ బిల్స్, సప్లిమెంటరీ శాలరీ బిల్స్, మెడికల్ బిల్స్ వంటి వివిధ రకాల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. పే అండ్ అకౌంట్స్ ద్వారా వేతనం పొందుతున్న ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారికి వారి వేతనాలు చెల్లిస్తున్న విధంగానే ఎన్నికల గౌరవ వేతనం(ఇన్సెంటివ్) కూడా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

రైతుల అభివృద్ధికి కృషి చేసిన బీజేపీ ప్రభుత్వం

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



చేవెళ్ల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దేశంలో రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎంతోకృషి చేసిందని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో రైతు సమ్మేళనం, బీజేపీ కిసాన్ మోర్చా సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో రైతులందరినీ ధనవంతులను చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ అనేక పథకాలు చేపట్టారని తెలిపారు. ఫసల్ బీమా, కృషిసిందాయ్, కిసాన్ సమ్మాన్, వంటి పథకాలను ప్రవేశపెట్టారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల ముందువరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ పథకాలను తెలంగాణ రైతాంగానికి అందకుండా చేసిందని విమర్శించారు. రైతుల పంటలకు మద్దతుధర కల్పించడంతో పాటు పంటలను దేశంలో ఎక్కడైనా విక్రయించే అవకాశం దక్కిందన్నారు. చేవెళ్ల ప్రాంతంలో రైతుల సంక్షేమానికి తాను కట్టుబడి ఉన్నానన్నారు. చేవెళ్లను మిల్లెట్స్ హబ్‌గా తీర్చి దిద్దుతామన్నారు. బీజేపీ అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తున్నదని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో బీజేపీ విజయ ఢంకా మోగిస్తుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. చేవెళ్ల పార్లమెంట్‌లో 3లక్షల ఓట్ల మెజారిటీతో ప్రజలు బీజేపీని గెలిపిస్తారని ఆయన ధీమావ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు తల్లోజు ఆచారి, అంజన్‌కుమార్‌గౌడ్, విఠల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహరెడ్డి, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చేవెళ్లలో భారీగా బీజేపీలో చేరికలు

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో చేవెళ్ల మండలంలోని రేగడిఘనాపూర్, కౌకుంట్ల, బస్తేపూర్, మిర్జాగూడ, దేవునిఎర్రవల్లి, అంతారం తదితర గ్రామాల్లోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు వందలాది మంది బీజేపీలో చేరారు. వారికి విశ్వేశ్వర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

నాణ్యమైన వ్యాయామ పరికరాలుండాలి



మానక్ మంథన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న యూఎస్పీ యాదవ్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వ్యాయామశాలల్లో నాణ్యమైన వ్యాయామ పరికరాలను అందుబాటులో ఉంచాలని బీఐఎస్ సౌత్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ యూఎస్పీ యాదవ్ అన్నారు. ప్రజలకు భద్రత కల్పిస్తూ వ్యాయామశాలల్లో అనుసరించాల్సిన భారతీయ ప్రమాణాలపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధికారులు మంగళవారం సికింద్రాబాద్‌లో మానక్ మంథన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ యూఎస్పీ యాదవ్, జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) శాస్త్రవేత్త కె.వెంకటేష్ మాట్లాడుతూ వ్యాయామశాలలో ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపే ఏర్పాట్లు, గుండె సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు శిక్షితులైన సిబ్బందితో పాటు అత్యవసర వినియోగ పరికరాలు అందుబాటులో ఉండాలన్నారు. వ్యాయామశాలకు వచ్చే ప్రతి వ్యక్తిని పర్యవేక్షించే విధానం, రుసుం చెల్లింపులు అంశాలను మిళితం చేస్తూ రూపొందించిన ఈ ప్రమాణాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్, ప్రముఖ వ్యాయామశాలల ప్రతినిధులు, శిక్షకులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

కేర్‌లో ప్రపంచస్థాయి వైద్య సేవలు



కేర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైజెస్టివ్ డిసీజెస్ అండ్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ప్రారంభించిన డాక్టర్ హరిప్రసాద్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): హైటెక్‌సిటీలోని కేర్ ఆస్పత్రిలో ప్రపంచస్థాయి వైద్య సేవలను అందిస్తున్నట్లు డాక్టర్ హరిప్రసాద్ తెలిపారు. కేర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైజెస్టివ్ డిసీజెస్ అండ్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్, చైర్మన్ అండ్ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ హరిప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్లాంటేషన్ ప్రారంభంతో ప్రపంచస్థాయి వైద్యసేవలు అందించే అవకాశం దక్కిందని అన్నారు. అత్యున్నత నైపుణ్యాలు, నూతన సాంకేతికతల కోసం నిరంతరం చేసే కృషి తమ వైద్య, ఆరోగ్య సేవల స్థాయిని మరింత పెంపొందిస్తాయన్నారు. అంతర్జాతీయస్థాయి వైద్య పరికరాలు, అప్‌డేట్ ట్రీట్‌మెంట్ పద్ధతులు, నిరంతరం పేషెంట్ సపోర్ట్, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రక్రియను మెరుగ్గా అందిస్తాయన్నారు. కేర్ ఆస్పత్రుల గ్రూప్, సీఈవో జస్దీప్ సింగ్ మాట్లాడుతూ త్వరగా రోగ నిర్ధారణ, ఆధునిక పద్ధతుల ద్వారా కాలేయ వ్యాధిని రూపుమాపాలన్న ధ్యేయంతో పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైజెస్టివ్ డిసీజెస్ అండ్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ విభాగాల అధిపతి డాక్టర్ మొహమ్మద్ అబ్దుల్ నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో 'యూనిక్' ప్రభంజనం



ఉత్తీర్ణులైన విద్యార్థులతో కరస్పాండెంట్ శివయ్య, ప్రధానాచార్యులు నాగభూషణం

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి సూర్యానగర్‌లోని యూనిక్ ఉన్నత పాఠశాల విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో మరోసారి జయకేతనం ఎగురవేశారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ స్థాయిలో గత నాలుగేళ్లతో పాటు ఈసారి కూడా ప్రథమ స్థానంలో నిలిచింది. జీపీఏ 10/10తో 22మంది విద్యార్థులు రికార్డ్ సృష్టించారు. జీపీఏ 9.8తో 14 మంది, 9.7తో 7 మంది, 9.5తో 12 మంది, 9.3తో 12 మంది, 9.2తో 13 మంది, 9తో 13 మంది ఉత్తీర్ణులు అవడంతో పాటు జీపీఏ 9/10పై 93 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. దీంతో పరీక్ష రాసిన 147 మంది విద్యార్థుల్లో 146 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులను, వారికి సహకరించిన ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్ పి. శివయ్య, ప్రధానాచార్యులు ఎం.నాగభూషణం అభినందించారు.

పదవ తరగతి ఫలితాల్లో త్రివేణి విజయభేరి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో త్రివేణి విద్యార్థులు విజయ దుందుభి మోగించారని త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. త్రివేణి అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులు71 మంది 10/10 జీపీఏ సాధించారని, గతంతో పోల్చితే ఇది ఎక్కువన్నారు. అలాగే అత్యధిక బ్రాంచ్‌లలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి, మరోసారి తెలంగాణలోనే నంబర్ 1 స్కూల్‌గా నిలిచిందన్నారు. త్రివేణి స్కూల్స్‌లో ఐఐటీ, నీట్, జేఈఈ, ఎన్‌టీఎస్‌ఈ, ఒలింపియాడ్ వంటి పరీక్షలకు కూడా విద్యార్థులను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్, ఖమ్మం, కొత్తగూడెంలలో ఉన్న బ్రాంచీల్లో పదవ తరగతి పాసైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బందికి శుభాభినందనలు తెలిపారు.

ట్రిపుల్‌ఐటీహెచ్ ఏఐ ప్రాజెక్టుకు నిధులు అందజేసిన సెంటిఫిక్

హైదరాబాద్ సిటీ : ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీహెచ్)లోని రాజిరెడ్డి సెంటర్ ఫర్ టెక్నాలజీ అండ్ సొసైటీలో చేపట్టిన ఏఐ ప్రాజెక్టుకు సెంటిఫిక్ సంస్థ నిధులను అందించింది. పోషకాహార లోపాన్ని గుర్తించేందుకు ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) వినియోగించి ఐఐఐటీహెచ్‌లో నిర్వహిస్తున్న 'ఏఐ ఫర్ ఆటోమేటెడ్ మాల్ న్యూట్రిషన్ డిటెక్షన్' ప్రాజెక్టు మొదటిదశ కోసం సెంటిఫిక్ సంస్థ రూ.18 లక్షల నిధులను అందజేసింది. ఐఐఐటీహెచ్ ప్రొఫెసర్ రమేష్ లోగనాథన్ సెంటిఫిక్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ క్రైమ్‌ను ఆశ్రయించిన సివిల్స్ మూడో ర్యాంకర్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): కొంతమంది తన పేరుతో సోషల్ మీడియాలో నకిలీ ఖాతాలను సృష్టించారని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల సివిల్స్‌లో మూడో ర్యాంకు సాధించిన అనన్యరెడ్డి సైబరాబాద్‌లోని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన గుర్తింపును ఉపయోగించి ప్రజలను మోసం చేయడానికి ఇన్‌స్టాగ్రామ్, టెలీగ్రామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో నకిలీ ఖాతాలు సృష్టించారని, సివిల్ సర్వీసెస్ ఔత్సాహికులకు మెంటర్‌షిప్ ప్రోగ్రామ్‌లను నిర్వహించడానికి తన గుర్తింపును ఉపయోగిస్తున్నారని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. మెంటర్‌షిప్ ప్రోగ్రామ్‌లకు డబ్బులు వసూలు చేస్తూ ఔత్సాహికులను మోసం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది.

ఆర్టీసీ కార్మికులందరికీ బాండ్ బకాయిలు చెల్లించాలి

హైదరాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పని చేస్తున్న కార్మికులందరికీ 2013 పీఆర్సీ బకాయిల బాండ్ డబ్బులను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని టీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈ.వెంకన్న కోరారు. ఈ మేరకు మంగళవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆయన వినతిపత్రం సమర్పించారు. కార్మికుల బాండ్ బకాయిల చెల్లింపుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి రూ.281 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి కేవలం రూ.81 కోట్లు మాత్రమే వచ్చాయని ఆర్టీసీ యాజమాన్యం పేర్కొంటున్నదని ఆయన తెలిపారు.

ఏబీవీపీ దాడిని ఖండించిన నిర్బంధ వ్యతిరేక వేదిక

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ సెనేట్ హాల్లో సమావేశమైన సమూహ-కవులు, రచయితలపై ఏబీవీపీ జరిపిన దాడిని నిర్బంధ వ్యతిరేక వేదిక తీవ్రంగా ఖండించింది. ఏబీవీపీ భౌతికదాడి భావ ప్రకటన స్వేచ్ఛపై దాడిగా నిర్బంధ వ్యతిరేక వేదిక కన్వీనర్ ప్రొ. జి.హరగోపాల్ అభివర్ణించారు. దాడులకు పాల్పడ్డ వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వేదిక కన్వీనర్ ప్రొ. జి. హరగోపాల్ ఒక ప్రకటనలో కోరారు.

టెన్త్‌లో 30వ స్థానం

(5వ పేజీ తరువాయి)

సాధించి విజయకేతనం ఎగురవేశారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి ఈ ఏడాది 73,202 మంది పరీక్షకు హాజరయ్యారు. అలాగే రంగారెడ్డి జిల్లాలో 50,811 మంది, మేడ్చల్ జిల్లాలో 46,736 మంది పరీక్ష రాశారు. అయితే మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో బాలుర కంటే బాలికలే అధికశాతం ఉత్తీర్ణత సాధించడం ఆసక్తికరంగా మారింది. హైదరాబాద్ జిల్లాలో పరీక్ష రాసిన మొత్తం విద్యార్థుల్లో బాలురు 83.41 శాతం పాస్‌కాగా.. అమ్మాయిలు 89.90 శాతం ఉత్తీర్ణత సాధించారు. రంగారెడ్డిలో బాలురు 88.89 శాతం, బాలికలు 93.32 శాతం మంది పాసయ్యారు. కాగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 87.35 శాతం బాలురు పాస్‌కాగా.. బాలికలు 92.03శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

బాలాపూర్‌లో సీఎం సభ గ్రాండ్ సక్సెస్

(5వ పేజీ తరువాయి)

మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, కె.లక్ష్మారెడ్డి, రంగారెడ్డి జడ్పీ చైర్మన్ అనితాహరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబితమ్మ ఉదయం కారు గుర్తుకు, రాత్రి కమలం గుర్తుకు

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రోగ్రామ్ 7గంటలకు అని చెప్పగా, ఆయన సరిగ్గా ఎనిమిది గంటలకు వేదిక (ఓపెన్ టాప్ వాహనం)వాహనం వద్దకు చేరుకున్నారు. ముందుగా ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి మాట్లాడగా, ఆ తర్వాత సీఎం 25 నిమిషాల పాటు ప్రసంగించారు.
- బడంగ్‌పేట్ మేయర్ పారిజాతానర్సింహారెడ్డితో ప్రచార రథంపై ఆయన కాసేపు ముచ్చటించారు.
- మాజీ మంత్రి సబితారెడ్డిని ఉద్దేశించి.. సీఎం మాట్లాడుతూ మా అక్క ఉదయం కారు గుర్తుకు, రాత్రి కమలం గుర్తుకు ప్రచారం చేస్తున్నదని వ్యాఖ్యానించినపుడు సభికుల నుంచి అనూహ్య స్పందన కనిపించింది. కారు, కమలం దోస్తీ చేస్తున్నాయని ఆయన అన్నారు.
- బీజేపీ అభ్యర్థి తానేదో పెద్ద 'కొండ'ను అనుకుంటున్నారని, కానీ, తమ కార్యకర్తల అండ ఉండగా ఎంతటి కొండనైనా, బండనైనా బద్దలుకొట్టగలుగుతామని సీఎం పేర్కొనగా కార్యకర్తలు గట్టిగా ఈలలు వేశారు.
- కొండా గతంలో అధికార బీఆర్ఎస్‌లో ఎంపీగా ఉండి వెలగబెట్టిందేమీ లేదని సీఎం ఎద్దేవా చేశారు.
- చేవెళ్ల నుంచి తమ అభ్యర్థి లక్ష ఓట్ల మెజారిటీతో గెలవబోతున్నాడని, అందులో మహేశ్వరం నుంచే 25వేల ఓట్ల ఆధిక్యత ఉండాలని ఆయన నాయకులకు, ప్రజలకు పిలుపునిచ్చారు.
- మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్ గెలిచిఉంటే ఈ పాటికి మహేశ్వరం నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెంది ఉండేదని ఆయన వ్యాఖ్యానించారు. అప్పుడు మిస్ అయింది.. ఇప్పుడు మిస్ కానివ్వొద్దని సూచించారు.

విశ్వేశ్వర్‌రెడ్డి పొలిటికల్ టూరిస్టు: రంజిత్‌రెడ్డి

మాజీ ఎంపీ, బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి చేవెళ్లకు ఓ పొలిటికల్ టూరిస్టులా మారారని కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి విమర్శించారు. గతంలో ఐదేళ్లు అధికారంలో ఉండి ఆయన నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. ఆయనను కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాలని, అలాంటి నేత ప్రజలకు ఏం సేవ చేస్తాడని రంజిత్ ప్రశ్నించారు. తాను నిరంతరం ప్రజల్లో ఉంటానని, తన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికీ చేతనైన సాయం చేస్తానని పేర్కొన్నారు. తనను మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు.

మార్మోగిన 'మూడు రంగుల జెండాబట్టి'..

సభకు ముందు, సభానంతరం 'మూడు రంగుల జెండాబట్టి, సింగమోలే కదలీనాడు'.. అనే పాట మార్మోగింది. సీఎం ప్రసంగించడానికి మైకు చేతిలోకి తీసుకోగానే 30 సెకన్ల పాటు మళ్లీ ఆ పాటను ప్లే చేయడంతో కార్యకర్తలు ఉత్సాహంగా స్టెప్పులేశారు. ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు పాటకు అనుగుణంగా భారీ జెండాలను ఊపుతూ సందడి చేశారు. మొత్తంమీద సీఎం సభ సక్సెస్ కావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు.

క్రిమినల్ కేసులతో దారికి!

(5వ పేజీ తరువాయి)

సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. 300 మందికిపైగా సిబ్బంది ట్రైనింగ్‌లో పాల్గొనలేదు. దీంతో శిక్షణకు ఎందుకు రాలేదో వివరణ ఇవ్వాలని కోరుతూ షోకాజ్ నోటీసులు పంపారు. నోటీసులకు కొందరు వివరణ ఇవ్వగా ఇంకొందరు స్పందించలేదు. దీంతో వివరణ ఇవ్వని, కారణాలు సహేతుకంగా లేని వారిపై ఆర్‌పీ యాక్ట్ 1951 సెక్షన్ 134 ప్రకారం కేసు నమోదుకు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు. 100 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా.. అనంతరం దాదాపు 40 మంది ఎన్నికల విధులకు హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేశారని ఓ అధికారి తెలిపారు.

న్యాయపరంగా...

ఎఫ్ఐఆర్‌లు నమోదైన అనంతరం రాష్ట్ర ఎన్నికల సంఘం పరిధిలోకి విషయం వెళ్తుందని రోనాల్డ్‌రోస్ తెలిపారు. తదుపరి మినహాయింపులు అక్కడి నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా కేసు నమోదైన అనంతరం న్యాయపరంగా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎన్నికల విధుల గైర్హాజరు కేసుల విషయంలోనూ అదే విధానంలో ముందుకు వెళ్లాలని ఎన్నికల విభాగం వర్గాలు చెబుతున్నాయి. కేసు కొట్టివేతకు సంబంధించి కోర్టును ఆశ్రయించాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. లోక్ అదాలత్‌తోనూ కేసులు కొట్టి వేసే అవకాశముందని ఓ అధికారి చెప్పారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా జిల్లా ఎన్నికలకు సంబంధించి 100 మందిపై క్రిమినల్ కేసులు నమోదు కావడం గమనార్హం.

అయినా.. మినహాయింపు కోసం...

ఓ వైపు ఎఫ్ఐఆర్‌లో నమోదవుతున్నా.. ఎన్నికల విధుల మినహాయింపునకు వెల్లువలా విజ్ఞప్తులు వస్తున్నాయి. పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన సరిగా ఉండడం లేదని, రాత్రి బస, కాలకృత్యాలు తీర్చుకోవడం, స్నానం చేయడం ఇబ్బందిగా ఉంటుందని మెజార్టీ ఉద్యోగులు పేర్కొంటున్నారు. మినహాయింపు ఇవ్వాలనే లేఖల్లోనూ వారు ప్రధానంగా ఈ అంశాలనే ప్రస్తావిస్తున్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు ఈ విషయంలో అవస్థలు పడుతున్నట్టు చెబుతున్నారు. రాత్రి పోలింగ్ కేంద్రంలో ఉండాలనే నిబంధన నుంచి మినహాయింపునిస్తే విధులు నిర్వర్తించేందుకు అభ్యంతరం లేదని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ ఎన్నికల్లో ఎక్కువగా ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా మహిళలు ఉన్నారు. పీఓ, ఏపీఓల్లో ఒకరు పోలింగ్ కేంద్రంలోనే ఉండాల్సిన దృష్ట్యా.. ఈ సారి ఎక్కువగా మినహాయింపు వినతులు వస్తున్నాయని ఓ అధికారి చెప్పారు. ఇదిలా ఉంటే కొందరు ఉద్యోగులకు హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో రెండు చోట్ల ఎన్నికల విధులు కేటాయించారు. వీరంతా తమకు ఒక ఏరియాలో ఎన్నికల విధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఖాజాగూడలో గేమింగ్ లేడీ డాన్ అరెస్ట్

మరో10 మంది జూదరులు కూడా.. ● రూ.62వేల నగదు స్వాధీనం



పోలీసుల అదుపులో నిర్వాహకురాలు మాధవి, జూదరులు

రాయదుర్గం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఖాజాగూడలోని ఓ అపార్టుమెంట్‌లో కొంతకాలంగా గేమింగ్ (మూడు ముక్కలాట) నిర్వహిస్తున్న నిర్వాహకురాలిని, ఆడుతున్న జూదరులను మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజాగూడలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కంభంపాటి మాధవి(50) కొంతకాలంగా గేమింగ్ నిర్వహిస్తోంది. విశ్వసనీయ సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం సాయంత్రం దాడిచేసి నిర్వాహకురాలు మాధవితో పాటు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు నాంపల్లికి చెందిన శ్రీనివాస్(58), సరూర్‌నగర్ బైరామల్‌గూడకు చెందిన కె.రాజేందర్‌రెడ్డి(50), మాదాపూర్ సిద్ధిక్‌నగర్‌కు చెందిన డి.లక్ష్మీనారాయణ(53), నాంపల్లికి చెందిన కె.రాములు(71), కుత్బుల్లాపూర్ భరత్‌నగర్‌కు చెందిన కె.బాలరాజ్(55), నల్గొండకు చెందిన జి.రాజేందర్‌రెడ్డి(48), గాజులరామారం ప్రాంతానికి చెందిన నాగరాజు(60)ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.62,620 , 11సెల్‌ఫోన్లు, ఐదుసెట్ల ప్లేయింగ్‌కార్డ్స్ స్వాధీనం చేసుకున్నారు. వారిపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిర్వాహకురాలు మాధవి కొంతకాలంగా గేమింగ్ నిర్వహిస్తూ ప్రతి ఆటకు రూ.1000 ఆర్గనైజర్ ఫీజు వసూలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. రోజుకు 100కు పైగా ఆటలు నిర్వహిస్తుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వీరికి మందు, విందువంటి సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు విచారణలో తెలిసిందన్నారు.

నకిలీ ఆక్సిటోసిన్ ఇంజక్షన్ల విక్రయం..

ముఠా అరెస్ట్



పోలీసులకు పట్టుబడ్డ నిందితులు, స్వాధీనం చేసుకున్న నకిలీ ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆవులు, గేదెల్లో పాల దిగుబడి పెరుగుతుందని నమ్మించి, నకిలీ ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముఠాను సౌత్‌వెస్టుజోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి నకిలీ ఇంజక్షన్ సీసాలు-100, ఎసిటిక్ యాసిడ్ బాటిల్-1, ఫినాలిక్ యాసిడ్ (కార్బోలిక్ యాసిడ్ క్రిస్టల్)-12 స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను మంగళ్‌హాట్ పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పేరుమాల్ తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి హిందీనగర్‌కు చెందిన వ్యాపారి సురేష్‌కుమార్ గుప్తా, అత్తాపూర్‌కు చెందిన లాలా బాబూ యాదవ్ (ఇంజక్షన్ ప్రిపరేటర్), నాంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న హౌస్ కీపర్ అబ్దుల్ హజీ ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఎసిటిక్ యాసిడ్, నీటితో కలిసి విషపూరితమైన ఫినాల్ ఐపీ (కార్బోలిక్ యాసిడ్ క్రిస్టల్)ని పలుచగా మార్చేసి నకిలీ ఆక్సిటోసిన్ ఇంజక్షన్లను తయారు చేస్తున్నారు. వాటిని పశువుల దాణా దుకాణాలు, ప్రైవేట్ డెయిరీలు నడుపుతున్న వ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు ఇచ్చి, ఆవులు, గేదెల్లో శక్తికి మించి పాల దిగుబడిని పెంచి, కొందరు కేటుగాళ్లు వాటి ఆరోగ్యంతో పాటు.. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని ప్రభుత్వం ఆక్సిటోసిన్ ఇంజక్షన్‌ను నిషేధించిందని డీసీపీ తెలిపారు. ఈ ముఠా ఓల్డ్ మల్లేపల్లిలోని జెట్ కేఫ్ సమీపంలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న సౌత్‌వెస్టుజోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మంగళ్‌హాట్ పోలీసులతో కలిసి అరెస్టు చేశారు. మంగళ్‌హాట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అబ్ కీ బార్?

బీజేపీ మళ్లీ గెలిస్తే.. రాజ్యాంగాన్ని చింపి విసిరేస్తారు: రాహుల్

భింద్(ఎంపీ), ఏప్రిల్ 30: కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని చింపి విసిరేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ వ్యాఖ్యానించారు. దేశంలో ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు సాధారణ ఎన్నికలు కాదని, రెండు సిద్ధాంతాల మధ్య జరుగుతున్న పోరు అని ఆయన అన్నారు. మంగళవారం మధ్యప్రదేశ్‌లోని భింద్ జిల్లాలో రాహుల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాజ్యాంగ ప్రతిని పట్టుకుని ప్రసంగిస్తూ.. కేంద్రంలోని పాలక వర్గం రిజర్వేషన్లకు వ్యతిరేకం కాకపోతే పీఎస్‌యూలు, రైల్వేస్, ఇతర సంస్థలను ఎందుకు ప్రైవేటీకరిస్తున్నారని నిలదీశారు.

'చీల్చడం' చేటు చేస్తుందా?

- బీజేపీకి ప్రభుత్వాలను పడగొట్టిన అప్రదిష్ట!
- బిహార్, మహారాష్ట్రల్లోని కూటముల్లో జోక్యం
- ఈ రెండు చోట్ల ప్రత్యర్థుల పట్ల సానుభూతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమికి అధికారం దక్కడంలో కీలకమైన యూపీ, మహారాష్ట్ర, బిహార్‌లో ఈసారి ఓటర్ల తీర్పు ఎలా ఉండనుంది? మహారాష్ట్ర, బిహార్‌లోని విపక్ష కూటముల్లో వేలు పెట్టి, ప్రభుత్వాలను మార్చేసిన అప్రదిష్ట చేటు చేస్తుందా? ప్రత్యర్థులపై సానుభూతి పెరిగి కమలానికి ఎదురుదెబ్బ తగలనుందా? యూపీలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌ను మరోసారి నిలువరించగలదా? ఇవీ ప్రస్తుత ఎన్నికల సమరంలో ఆసక్తికర ప్రశ్నలు. హిందుత్వవాదం బలంగా ఉండే యూపీ, మహారాష్ట్ర, బిహార్‌లో మొత్తం 168 సీట్లున్నాయి. 2014 ఎన్నికల్లో ఎన్డీఏకి యూపీలో 73, మహారాష్ట్రలో 41, బిహార్‌లో 33 (మొత్తం 147) సీట్లు దక్కాయి. అంటే 87.5 శాతం స్థానాలు నెగ్గింది. ఇక 2019లో సైతం యూపీలో 64, మహారాష్ట్రలో 41, బిహార్‌లో 39 (మొత్తం 144) సీట్లు వచ్చాయి. 85.7 శాతం సీట్లు గెలుచుకుంది. అయితే, ప్రస్తుతం ఎన్డీఏకు వాతావరణం ఏకపక్షంగా లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బిహార్‌లో ఆర్జేడీతో కలిసి ప్రభుత్వం నడుపుతున్న నీతీశ్ కుమార్‌ను తమవైపు తిప్పుకోవడం, మహారాష్ట్రలో ఉద్ధవ్ సారథ్యంలోని కాంగ్రెస్-శివసేన- ఎన్సీపీ సర్కారును ఏక్‌నాథ్ శిందే ద్వారా కూల్చేయడం, ఆపై అజిత్ పవార్‌నూ ఆకర్షించి ఎన్సీపీని చీల్చడం బీజేపీ పట్ల వ్యతిరేకతను పెంచిందనే విశ్లేషణలు వస్తున్నాయి. ముఖ్యంగా గత రెండు ఎన్నికల్లో ఎన్డీఏ 48 సీట్లకు గాను 41 చొప్పున సాధించిన మహారాష్ట్రలో ఈసారి సీట్లకు భారీగా గండి పడే అవకాశాలున్నాయని అంటున్నారు. ఎన్సీపీ, శివసేనలను చీల్చడంలో బీజేపీ పాత్ర ఉందన్న ప్రచారంతో శరద్ పవార్, ఉద్ధవ్ థాక్రే పట్ల ప్రజల్లో సానుభూతి ఏర్పడిందని, అది ఓట్ల రూపంలో మారుతుందని పేర్కొంటున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు చీలిక వర్గాల్లోకి వెళ్లిపోయినా కార్యకర్తలు మాత్రం శరద్ పవార్, ఉద్ధవ్ వైపే ఉన్నారని, ఎన్సీపీ (శరద్‌పవార్), శివసేన (ఉద్ధవ్), కాంగ్రెస్‌తో కూడిన మహా వికాస్ అఘాడీతో గట్టిపోటీ ఖాయమని చెబుతున్నారు.

బిహార్‌లో తేజస్వీ ప్రతాపం..

బిహార్‌లో ప్రాంతీయంగా ప్రధాని మోదీని సవాలు చేయగల స్థాయికి ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ మరింత బలమైన నేతగా ఎదిగారని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. మైనారిటీ, యాదవులు, దళితుల దన్నుతో ఆర్జేడీ-కాంగ్రెస్ నుంచి గట్టి పోటీ ఖాయమని అంటున్నారు. నీతీశ్ తరచూ కూటములను మార్చడం బిహార్ ప్రజలకు ఏవగింపు కలిగించిందని, అలాంటి నాయకుడితో జట్టు కట్టడం బీజేపీకీ ఇబ్బందిగా మారనుందని పేర్కొంటున్నారు. ఇక, కేంద్రంలో అధికార పీఠానికి దగ్గరి దారి యూపీ. 80 స్థానాలకు గాను 2014, 2019లో ఎన్డీఏ 73, 64 సీట్ల చొప్పున సాధించింది. ఈసారి అఖిలేశ్ యాదవ్ సారథ్యంలోని సమాజ్‌వాదీ పార్టీ ఇండియా కూటమిలో భాగమై కాంగ్రెస్‌కు గౌరవ సంఖ్యలో సీట్లిచ్చింది. పంటల మద్దతు ధర కోసం ఉద్యమం, 111 మంది ఎమ్మెల్యేలు, మైనారిటీలు, యాదవ వర్గాలలో గట్టి పట్టున్న సమాజ్‌వాదీ పార్టీ.. ఎన్డీఏ సీట్లను గణనీయంగా తగ్గిస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా, అయోధ్య రామ మందిరంతో పాటు మోదీ పట్ల ప్రజలకు ఉన్న విశ్వాసమే తమకు సీట్లు సాధించిపెడుతుందని బీజేపీ నమ్ముతోంది. రైతు నేత చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించడంతో లాభిస్తుందని భావిస్తోంది.

మహా రసవత్తరం

మహారాష్ట్ర బరిలో రెండు శివసేనలు, రెండు ఎన్సీపీలు

- దశాబ్దాలుగా పోట్లాడుకున్న వర్గాలు ఒకే శిబిరంలో..!
- పవార్‌లు, శిందే, ఉద్ధవ్‌ల రాజకీయ జీవితానికి పరీక్ష



మహారాష్ట్ర అంటే మహామహుల రాజకీయ క్షేత్రం. వర్గ పోరుకు, వారసత్వ రాజకీయాలకు పెట్టింది పేరు. దేశంలో ఉత్తరప్రదేశ్ తర్వాత అత్యధిక లోక్ సభ సీట్లున్న రాష్ట్రం ఇదే. ఐదేళ్లలో ఇక్కడ పరిణామాలు ఎంతలా మారాయో అందరూ చూశారు. ఎవరూ హించని రీతిలో రెండు ప్రాంతీయ పార్టీలు నాలుగు అయ్యాయి. తమతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసి సీఎం కుర్చీ దగ్గర పంచాయితీతో.. కాంగ్రెస్, ఎన్సీపీ పంచన చేరిన శివసేనను ఏక్‌నాథ్ శిందే ద్వారా చీల్చేసింది బీజేపీ. తద్వారా ఉద్ధవ్ థాక్రేకు ఝలక్ ఇచ్చింది. అనంతరం అజిత్ పవార్‌నూ ఆకర్షించి ఎన్సీపీనీ విడగొట్టి.. శరద్ పవార్‌కు షాకిచ్చింది. ఇప్పుడు బీజేపీ ఆధ్వర్యంలోని మహాయుతి కూటమిలో శివసేన (శిందే), ఎన్సీపీ (అజిత్), కాంగ్రెస్ సారథ్యంలోని మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)లో ఎన్సీపీ (శరద్ పవార్), శివసేన (ఉద్ధవ్) ఎన్నికల సమరంలో తలపడుతున్నాయి. మహారాష్ట్రలో తొలి దశలో 5, మలి విడతలో 8 సీట్లకు పోలింగ్ ముగిసింది. మూడో దశలో 11 స్థానాలకు మే 7న ఓటింగ్ జరగనుంది. నాలుగో దశలో మే 13న మరో 11 సీట్లకు, మే 20న 13 స్థానాలకు పోలింగ్ ఉంది.

దశాబ్దాల విభేదాలు.. ఓట్లు మళ్లుతాయా?

రెండు పార్టీలు నాలుగుగా మారి, మరో రెండు పార్టీలతో కలిసి వస్తుండడంతో మహారాష్ట్ర ప్రజల నాడి ఏమిటో రాజకీయ పరిశీలకులకు అంతుబట్టడం లేదు. రెండున్నర దశాబ్దాలు బీజేపీ-శివసేన కేడర్‌తో కాంగ్రెస్-ఎన్సీపీ శ్రేణులు ఢీ అంటే ఢీ అన్నట్లు తలపడ్డాయి. 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్-ఎన్సీపీతో కలిసి శివసేన ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2022లో శిందే తిరుగుబాటు చేసి బీజేపీతో కలిశారు. ఇక ఎన్సీపీని చీల్చిన అజిత్ పవార్ బీజేపీ-శిందే సేన సర్కారులో చేరారు. శిందే, అజిత్‌కు వర్గాలకు పార్టీ ఎన్నికల గుర్తులు దక్కాయి. మెజారిటీ ఎమ్మెల్యేలు, ఎంపీలు వీరి వెంటే ఉన్నా.. ఎన్సీపీ, శివసేన సంప్రదాయ అభిమానులు, మద్దతుదారులు ఓటు వేస్తారా? అంటే కష్టమేనని పరిశీలకులు చెబుతున్నారు. కాగా, 2014, 2019లో బీజేపీ-అవిభాజ్య శివసేన కూటమి 51.34 శాతం ఓట్లతో 41 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్-అవిభాజ్య ఎన్సీపీలు 35 శాతంపైగా ఓట్లతో వరుసగా 5, 6 సీట్లతో సరిపెట్టుకున్నాయి. నిరుడు మార్చిలో కస్బాపేఠ్ ఉప ఎన్నికలో 3 దశాబ్దాల తర్వాత బీజేపీని కాంగ్రెస్ ఓడించింది. చించ్వాడ్‌ను బీజేపీ నిలబెట్టుకుంది.

బరిలో మాజీ సీఎంలు.. మాజీ సీఎంల కుమార్తెలు

మహారాష్ట్ర మాజీ సీఎం నారాయణ్ రాణె బీజేపీ తరఫున రత్నగిరి-సింధుదుర్గ్ నుంచి బరిలో దిగారు. ఈయనకు రెండుసార్లు ఎంపీగా గెలిచిన వినాయక్ రౌత్ గట్టి పోటీ ఇస్తున్నారు. అయితే, మరో మాజీ సీఎం అశోక్ చవాన్ బీజేపీలో చేరి నాందేడ్ నుంచి పోటీ చేశారు. మాజీ సీఎంలు శరద్ పవార్ కుమార్తె సుప్రియా బారామతిలో, సుశీల్‌కుమార్ శిందే కుమార్తె ప్రణీతి సోలాపూర్‌లో పోటీకి నిలిచారు.

ఇరు సేనల పోరు..

రెండు శివసేనలు, రెండు ఎన్సీపీలు బరిలో ఉన్న ఎన్నికలు మహా రసవత్తరంగా సాగుతున్నాయి. విదర్భ ప్రాంతం యావత్మాల్-వాశిం వంటి సీట్లలో శిందే, ఉద్ధవ్ సేనల అభ్యర్థులు నేరుగా తలపడ్డారు. ఇక్కడ బలమైన వర్గాలు మరాఠాలు, దేశ్‌ముఖ్‌లు, కుంబీలు, బంజారాలు 2019లో బీజేపీ-అవిభాజ్య శివసేన కూటమికి మద్దతిచ్చాయి. బంజారాలు ఉద్ధవ్ పార్టీ వైపు నిలిచారు. మిగతావారు ఎవరి పక్షం వహిస్తే వారిదే విజయం. బుల్దాణాలోనూ శివసేనల అభ్యర్థులే పరస్పరం ఢీకొన్నారు.

కంచుకోటలో వదినా మరదళ్ల ఢీ

మహారాష్ట్రలోనే కాదు దేశవ్యాప్తంగానూ ఆసక్తి రేకెత్తిస్తున్న పోటీ బారామతిలో జరుగుతోంది. సిటింగ్ ఎంపీ సుప్రియా తన వదిన సునేత్రను ఢీకొంటున్నారు. మే 7న ఇక్కడ పోలింగ్ ఉంది. సుప్రియా ఇప్పటికే వరుసగా మూడుసార్లు ఇక్కడినుంచి గెలిచారు. ఆమె తండ్రి శరద్ పవార్ అయితే డబుల్ హ్యాట్రిక్ కొట్టారు. తమ కుటుంబానికి కంచుకోట అయిన బారామతిలో సుప్రియా ఓడితే అది శరద్‌కు పెద్ద ఇబ్బందే. బారామతి చేజారితే.. యావత్ పార్టీ చేజారినట్టే.


ఛత్రపతి శివాజీ వారసుడికి ఎంఐఎం మద్దతు

మరాఠాలకే కాదు హిందువులందరికీ ఆరాధ్యమైన ఛత్రపతి శివాజీ వారసులు వేర్వేరు పార్టీల తరఫున బరిలో దిగారు. సతారాలో శ్రీమంత్ ఛత్రపతి ఉదయన్‌రాజె భోస్లే బీజేపీ తరఫున పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఈయన రాజ్యసభ సభ్యుడు. కొల్హాపూర్‌లో శివాజీ వంశస్థుడైన శ్రీమంత్ శాహూ ఛత్రపతి మహారాజ్ కాంగ్రెస్ అభ్యర్థిగా నిలిచారు. ఈయనకు అసదుద్దీన్ ఒవైసీ సారథ్యంలోని ఎంఐఎం పార్టీ మద్దతు పలకడం గమనార్హం.

నలుగురు నేతలకూ సవాల్

మహారాష్ట్ర అసెంబ్లీకి అక్టోబరులో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ పార్టీల నాయకుల పరిస్థితి ఎలా ఉన్నా.. సీఎం ఏక్‌నాథ్ శిందే, ఉద్ధవ్ థాక్రే, డిప్యూటీ సీఎం అజిత్ పవార్, శరద్ పవార్‌లకు ఈ ఎన్నికలు చాలా కీలకం. తాను స్థాపించిన పార్టీని.. అన్న కుమారుడు అజిత్ చీల్చడంతో హతాశుడైన మరాఠా యోధుడు శరద్‌పవార్ (83) ఈ ఎన్నికల్లో తాడోపేడో తేల్చుకుంటున్నారు. పార్టీ కేడర్ తనను వీడి వెళ్లకుండా ఉండాలన్నా, అసెంబ్లీ ఎన్నికల నాటికి బలీయంగా కనిపించాలన్నా.. పెద్ద పవార్ ప్రస్తుత ఎన్నికల్లో మెరుగైన సీట్లు సాధించడం ముఖ్యం. ఇక ఎన్సీపీ గుర్తు గడియారం సహా మెజారిటీ కేడర్ అజిత్ పవార్ వెంటనే ఉంది. అయితే, వీరంతా ఇకముందు కూడా చెక్కుచెదరకుండా ఉండాలంటే లోక్ సభ ఎన్నికల్లో సత్తా చాటాల్సి ఉంది. కాగా, తాను ప్రజాబలం ఉన్న నేతను అని నిరూపించుకునేందుకు సీఎం శిందేకు, తమ ఉనికి ఇంకా ఉందని చాటేందుకు ఉద్ధవ్ థాక్రేకు ఈ ఎన్నికలు కీలకం. - సెంట్రల్ డెస్క్

ప్రతిపక్షాల ప్రేమ దుకాణంలో నకిలీ వీడియోల అమ్మకం



ధారాశివ్, లాతూర్(మహారాష్ట్ర), ఏప్రిల్ 30: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని ఎదుర్కోవడం చేతగాని ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో నకిలీ వీడియోలను సర్క్యులేట్ చేస్తున్నాయని ప్రధాని మోదీ విమర్శించారు. "ఏఐతో నకిలీ వీడియోలు తయారు చేసి వారి ప్రేమ దుకాణంలో అమ్ముతున్నారు." అని ఎద్దేవా చేశారు. ఆ అబద్ధాల దుకాణాన్ని ఇక మూతవేయాలి... అని పిలుపునిచ్చారు. మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ ప్రధాని ఈమేరకు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జరుగుతున్న లోక్ సభ ఎన్నికలు దేశ ఆత్మగౌరవానికి సంబంధించినవని చెప్పారు. "బలహీన, ఎప్పుడంటే అప్పుడు కూలిపోయే ప్రభుత్వాలు బలమైన దేశాన్ని నిర్మించగలవా" అని ప్రశ్నించారు. ప్రతిపక్ష ఇండియా కూటమిలోని పార్టీలు అధికారంలోకి వస్తే ఏడాదికి ఒకరు ప్రధాని పదవి చేపట్టాలని నిర్ణయానికి వచ్చారని తెలిపారు. ఆ విధానంతో దేశానికి మంచి జరగదన్నారు. కాంగ్రెస్, సమస్యలు కవల పిల్లల్లాంటివని ఎద్దేవా చేశారు. పేదరికం తప్ప... ఆ పార్టీ దేశానికి ఇచ్చిందేమీ లేదన్నారు. సమాజంలో అణగారిన వర్గాల కోసమే విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించి రాజ్యాంగంలో చేర్చారని, వాటిని ఎవరు తొలగించలేరన్నారు. అయితే, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను తొలగించి వాటిని తమ ఓటుబ్యాంకుకు (ముస్లింలకు) ఇవ్వాలనేది కాంగ్రెస్ దాని మిత్రపక్షాల ఉద్దేశమని ప్రధాని మోదీ ఆరోపించారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ వ్యతిరేకం అయినప్పటికీ, ఇండియా కూటమి విచ్ఛిన్నకరమైన, విద్వేషపూరితమైన అజెండాను కలిగి ఉన్నదని పేర్కొన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కలిగించాలని పిలుపునిస్తూ ఎన్డీఏ కూటమి ఎంపీ అభ్యర్థులకు మోదీ వ్యక్తిగత లేఖలు రాశారు. తన పదేళ్ల హయాంలో దేశంలో అన్ని రంగాలు మెరుగయ్యాయని, అయినప్పటికీ ఇంకా చెయ్యాల్సింది చాలా ఉందని మోదీ పేర్కొన్నారు. అందుకే ఈ ఎన్నికలు కీలకమన్నారు.

పోలింగ్ వివరాల వెల్లడికి జాప్యమేంటి?

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: పార్లమెంటు ఎన్నికల మొదటి రెండు దశల పోలింగ్ తుది వివరాలు ఇంకా వెల్లడి కాకపోవడంపై ఎన్నికల సంఘాన్ని మంగళవారం ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. నియోజకవర్గాల వారీగా ఎంత పోలింగ్ జరిగిందో తుది లెక్కలను ఖరారు చేయకపోవడం ఏమిటని అడిగాయి. మొదటి దశ ఎన్నికలు జరిగి 11 రోజులయినా మొత్తం పోలయిన ఓట్లు ఎన్ని? ఎంత శాతం పోలింగ్ జరిగిందన్న లెక్కలను ప్రకటించలేదని గుర్తు చేశాయి. గతంలో పోలింగ్ ముగిసిన 24 గంటల్లోగానే మొత్తం సమాచారం వచ్చేదని, ఇప్పుడు మాత్రం తాత్కాలిక గణాంకాలతోనే సరిపెడుతున్నారని ప్రశ్నించాయి.

'డర్టీ' పిక్చర్ గుట్టు రట్టయింది.. ప్రజ్వల్ డ్రైవర్ ద్వారానే!



కార్తీక్

బెంగళూరు/బళ్లారి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): "నీకన్నా వయసులో పెద్దదాన్ని.. నన్నేం చేయకు. మీ నాన్నకు, తాతకు నాచేత్తో అన్నం వడ్డించాను. అమ్మలాంటిదాన్ని.. వీడియోలు తీయకు" అని వేడుకుంటున్నా వినకుండా.. భయంతో ముడుచుకుపోయి కూర్చున్న ఓ వయసు పైబడిన మహిళను ప్రజ్వల్ ఈడ్చుకెళ్లి, లైంగిక దాడికి పాల్పడ్డమే కాక, వీడియో తీశాడంటూ మంగళవారం 'ఎక్స్'లో పలువురు చేసిన ట్వీట్లు వైరల్ అవుతున్నాయి. ఇంతకీ.. కర్ణాటక రాజకీయాలను కుదిపేస్తున్న ఈ 'డర్టీ పిక్చర్' గుట్టు ఎలా రట్టు అయింది? ప్రజ్వల్ తన ఫోన్‌లో తీసుకున్న వీడియోలు ఎలా బయటపడ్డాయి? అనే ప్రశ్నలకు సమాధానం దొరికింది. ప్రజ్వల్ కుటుంబానికి పదిహేనేళ్లపాటు డ్రైవర్‌గా ఉన్న కార్తీక్ ద్వారా ఈ వీడియోలు బీజేపీ నేత దేవరాజెగౌడ వద్దకు చేరాయి. ఈ విషయాన్ని ఇద్దరూ ఒప్పుకొంటున్నారు. కానీ.. ఆ తర్వాత ఈ వీడియోలు కాంగ్రెస్ నేతకు, మీడియాకు, సోషల్ మీడియాకు ఎలా చేరాయనే విషయంలో మాత్రం ఇద్దరూ పరస్పరం నిందించుకుంటున్నారు. తాను దేవరాజెగౌడకు తప్ప ఎవరికీ ఈ వీడియోలు ఇవ్వలేదని కార్తీక్ చెబుతుంటే.. అతడే కాంగ్రెస్ నేతలకు ఇచ్చాడని దేవరాజెగౌడ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కార్తీక్ మంగళవారం ఒక వీడియో విడుదల చేశారు. "నేను ప్రజ్వల్ రేవణ్ణ కుటుంబం వద్ద పదిహేనేళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నా. అయితే.. నాపేరిట ఉన్న కొద్దిపాటి భూమిని రేవణ్ణ కుటుంబం లాక్కుని.. నన్ను మానసికంగా, నా భార్యను శారీరకంగా వేధించారు. దీంతో ఏడాది క్రితమే వారి వద్ద పని మానేశా. ఆ తర్వాత వారి మీద కేసు పెట్టడానికి ఎంతగానో ప్రయత్నించాను. ఆ సమయంలోనే నేను బీజేపీ నేత దేవరాజె గౌడను కలిశాను. నాకు సాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. నా వద్ద ఉన్న వీడియోలు తీసుకున్నారు. ఆయనకు తప్ప నేను మరెవ్వరికీ ఆ వీడియోలు ఇవ్వలేదు. కాంగ్రెస్ నేతలకు ఎవరిచ్చారో నాకు తెలియదు. ఈ విషయంలో ఆయన తనను తాను కాపాడుకోవడానికి నన్ను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు." అని చెబుతూ సోషల్ మీడియాలో ఒక వీడియో కూడా విడుదల చేశారు. దేవరాజెగౌడను నమ్మితే ఆయన తనను మోసం చేశారని వాపోతున్నారు. మరోవైపు దేవరాజెగౌడ్ ఏమో.. ఈ వీడియోలు బయటపడితే తమ కూటమికి దెబ్బ కాబట్టి, ఆ పని తానెందుకు చేస్తానని ప్రశ్నిస్తున్నారు. డ్రైవర్ కార్తీక్ నుంచి తీసుకుని కాంగ్రెస్ నేత శ్రేయస్ పటేల్ ఈ వీడియోలను బయటపెట్టారని ఆయన ఆరోపిస్తున్నారు. అయితే.. దేవరాజెగౌడ హసన్ లోక్‌సభ సీటును ఆశించారని.. ఆ సీటు తనకు రాకపోవడంతో ప్రజ్వల్‌ను దెబ్బతీయడానికి ఈ వీడియోలను బయటపెట్టారన్న వాదనా వినిపిస్తోంది.

ప్రజ్వల్‌పై వేటు పడింది..

ప్రజ్వల్ వ్యవహారం ఎన్నికల్లో తమను దెబ్బతీసే ప్రమాదం ఉండడంతో.. జేడీఎస్ పార్టీ ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ప్రజ్వల్‌ను సస్పెండ్ చేస్తూ పార్టీ కోర్ కమిటీ తీర్మానించింది. మరోవైపు.. జేడీఎస్‌తో పొత్తు నేపథ్యంలో ప్రజ్వల్ రాసలీలల వ్యవహారంపై బీజేపీ వైఖరి స్పష్టం చేయాలని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, పలువురు కర్ణాటక నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా గువాహటిలో మాట్లాడుతూ ప్రజ్వల్ విషయమే కాదు, మహిళల గౌరవానికి భంగం కలిగించే అంశం ఏదైనా క్షమించేది లేదని తేల్చిచెప్పారు. ప్రజ్వల్ తప్పుచేసి ఉంటే చట్ట ప్రకారం శిక్ష తప్పదని స్పష్టం చేశారు. కాగా, ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల వ్యవహారంపై విచారణను వేగవంతమైంది. ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణతో పాటు ఆయన తండ్రి, ఎమ్మెల్యే రేవణ్ణకు సిట్ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. 24 గంటల్లోగా నేరుగా సిట్ ముందుకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. హాజరు కాని పక్షంలో తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని నోటీసుల్లో స్పష్టం చేసినట్టు సమాచారం. ఇదిలా ఉండగా, ప్రజ్వల్ రాసలీలలకు సంబంధించి సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర డీజీపీని జాతీయ మహిళా కమిషన్ ఆదేశించింది.

కాంగ్రెస్ ఫేక్ ప్రచారం

- మత ప్రాతిపదికన ఇచ్చే రిజర్వేషన్లకే మేం వ్యతిరేకం: అమిత్ షా



గువాహటి, ఏప్రిల్ 30: బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్చేస్తుందని, రిజర్వేషన్లు తీసేస్తారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. రిజర్వేషన్లపై తమకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఒక ఫేక్ వీడియోను ప్రచారంలోకి తెచ్చిందని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా రిజర్వేషన్లపై తాను మాట్లాడిన అసలు వీడియో... కాంగ్రెస్ ప్రచారంలో పెట్టిందని చెబుతున్న ఫేక్ వీడియోను షా విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. ఉమ్మడి ఏపీలో ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన 4%రిజర్వేషన్లతో ఓబీసీలు నష్టపోయారని, ఓ సర్వే కూడా చేపట్టకుండానే కర్ణాటకలో ముస్లిందరినీ ఓబీసీ కేటగిరిలోకి చేర్చారని కాంగ్రెస్ పై షా ధ్వజమెత్తారు. ఇలా మత ప్రాతిపదికన ఇచ్చిన రిజర్వేషన్లను ఆయా రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చాక తొలగిస్తుందని ఆయన తెలిపారు. 400 సీట్లతో బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తీసివేస్తుందంటూ చేస్తున్న ప్రచారం పూర్తిగా ఆధారరహితమని షా స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పగ్గాలు రాహుల్ గాంధీ చేపట్టిన తర్వాత రాజకీయాలను మరింతగా దిగజార్చారని షా విమర్శించారు. 2014, 2019లలో ప్రజలు తమకు అప్పగించిన అధికారాన్ని తాము దుర్వినియోగం చేయలేదని వారిలా ప్రజాస్వామ్యాన్ని కూల్చి అత్యవసర పరిస్థితిని విధించలేదని షా వ్యాఖ్యానించారు. కర్ణాటకలో జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించిన సెక్స్ స్కాంపై ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. షా విమర్శలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తిప్పికొట్టారు. ఫేక్ వీడియోలు చేయడంలో, సోషల్ మీడియా ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించడంలో బీజేపీకి ఎంతో అనుభవం ఉందని కాంగ్రెస్ చీఫ్ అన్నారు. దేశం ఎప్పుడూ ఒక్కటిగా ఉండాలని తాము కోరుకుంటామని, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయబోమని ఖర్గే తెలిపారు.

అబూజ్‌మడ్‌లో పేలిన తూటా

10 మంది మావోయిస్టుల మృతి

చర్ల, ఏప్రిల్ 30: మావోయిస్టుల కంచుకోట అభూజ్‌మడ్ మరోమారు ఎరుపెక్కింది. మంగళవారం భద్రతాబలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజ్ కథనం ప్రకారం.. అభూజ్‌మడ్‌లో నక్సల్స్ కదలికలపై సమాచారం అందుకున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్టీఎఫ్), డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్(డీఆర్జీ) బలగాలు 'ఆపరేషన్ కగార్'లో భాగంగా సోమవారం రాత్రి నారాయణ్‌పూర్-కాంకేర్ జిల్లాల సరిహద్దుల్లోని టేక్మెట-కాకుర్ గ్రామాల మధ్య అభూజ్‌మడ్ అడవుల్లో కూంబింగ్ ప్రారంభించారు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో అభూజ్‌మడ్ అడవుల్లోకి(కాల్పెర్ గ్రామానికి 30 కిలోమీటర్ల దూరంలో) బలగాలు వెళ్లగానే.. మావోయిస్టుల నుంచి కాల్పులు ప్రారంభమయ్యాయి. దాంతో.. భద్రతాబలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. ఉదయం 9 గంటల వరకు.. సుమారు మూడు గంటల పాటు ఇరువర్గాల మధ్య భీకర కాల్పులు కొనసాగాయి. మావోయిస్టుల నుంచి కాల్పులు ఆగిపోవడంతో.. బలగాలు ముందుకు చొచ్చుకువెళ్లాయి. ఈ క్రమంలో 10 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమైనట్లు సుందర్‌రాజ్ తెలిపారు. వీరిలో ముగ్గురు మహిళలున్నట్లు వివరించారు. మృతులను గుర్తించాల్సి ఉందని, వీరిలో కీలక నేతలు ఉన్నట్లు భావిస్తున్నామన్నారు. భద్రతాబలగాల వైపు ఎలాంటి నష్టం జరగలేదని, అభూజ్‌మడ్ అడవుల్లో కూంబింగ్ కొనసాగుతోందని చెప్పారు. ఎన్‌కౌంటర్ స్థలం నుంచి ఒక ఏకే-47 తుపాకీ, ఒక ఇన్సాస్ రైఫిల్, ఒక రివాల్వర్‌తోపాటు.. భారీగా మందుగుండు సామగ్రి, మావోయిస్టు సాహిత్యం, కిట్‌బ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాలను నారాయణ్‌పూర్ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు వివరించారు.

నాలుగు నెలల్లో 91 మంది మృతి

మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌తో కలిపి.. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో భద్రతాబలగాల కాల్పుల్లో 91 మంది మావోయిస్టులు మృతిచెందారు. గడిచిన 50 రోజుల్లో జరిగిన ఏడు భారీ ఎన్‌కౌంటర్లు మావోయిస్టు శిబిరానికి భారీ నష్టాన్ని మిగిల్చాయి. ఈ నెల 16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఛత్తీస్‌గఢ్‌తోపాటు పరిసర రాష్ట్రాల చరిత్రలోనే అత్యధికంగా 29 మంది మృతిచెందారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం సరిహద్దుల్లోని తెర్లాం/పూవర్తి మొదలుకుని, అభూజ్‌మడ్ వరకు 80 వేల మంది భద్రతా బలగాలతో 5 వేలకు పైగా క్యాంపులను ఏర్పాటు చేయడంతో.. మావోయిస్టులు సేఫ్ జోన్లను వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది.

పెరిగిన అరెస్టులు.. లొంగుబాట్లు

గడిచిన నాలుగు నెలల్లో దంతేవాడ, సుకుమా, బీజాపూర్ జిల్లాల్లో 250 మంది నక్సల్స్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. తాజాగా సోమవారం 23 మంది, మంగళవారం 16 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారు. మంగళవారం లొంగిపోయిన 16 మంది మావోయిస్టు కీలక నేత హిడ్మా నేతృత్వంలోని పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్‌కు చెందిన వారు కావడం గమనార్హం.! ఇదిలా ఉండగా, ఛత్తీస్‌గఢ్ సర్కారు చర్చలకు సిద్ధమంటూ డిప్యూటీ సీఎం విజయ్ శర్మ మావోయిస్టులకు సంకేతాలిచ్చారు. "మావోయిస్టులు చిన్న గ్రూపులుగా వచ్చినా.. పెద్ద గ్రూపులుగా ఉన్నా.. చర్చలు జరపొచ్చు. మీ వెసులుబాటును బట్టి వీడియోకాల్ ద్వారా చర్చలు జరపొచ్చు. లేదంటే.. మీ తరఫున ఓ మధ్యవర్తిని పంపండి" అని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎన్నికల ముందే ఎందుకు?

కేజ్రీవాల్ అరెస్టుపై ఈడీకి సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టుపై సుప్రీం కోర్టు ఈడీకి కీలక ప్రశ్నలు సంధించింది. ఈ ప్రశ్నలకు శుక్రవారం తదుపరి విచారణలో సమాధానం చెప్పాలని ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజును ఆదేశించింది. సార్వత్రిక ఎన్నికలు ప్రారంభం కావడానికి కొద్ది రోజుల ముందు కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడంలో ఆంతర్యం ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. విచారణ ప్రారంభానికీ అరెస్టుకూ మధ్య ఎందుకంత సమయం పట్టిందని ప్రశ్నిస్తూ మనీ లాండరింగ్ నిరోధక చట్టం సెక్షన్ 8 ప్రకారం ఈ రెండింటి మధ్య అంతరం ఏడాది కంటే ఎక్కువ ఉండకూడదు కదా అని గుర్తు చేసింది. ఈ కేసులో న్యాయపరమైన చర్యలు తీసుకోకుండా క్రిమినల్ చర్యలను ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించింది. ఈ కేసులో ఇంతవరకు కేజ్రీవాల్ నుంచి డబ్బు కానీ ఆస్తులు కానీ అటాచ్ చేయలేదని, అలాంటప్పుడు కుంభకోణంలో కేజ్రీవాల్ పాత్ర ఏమిటో వివరించాలని ఆదేశించింది. అంతకుముందు కేజ్రీవాల్ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదిస్తూ ఢిల్లీ ఎక్సైజ్ విధానం రూపకల్పనలో కేజ్రీవాల్ ప్రత్యక్ష పాత్ర ఏమీ లేదని పేర్కొన్నారు. ఈడీ ఎలాంటి డబ్బు స్వాధీనం చేసుకోలేదన్నారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి ప్రకటనల ఆధారంగా కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. తన కుమారుడు రాఘవ రెడ్డి అరెస్టయిన అయిదు నెలల తర్వాత శ్రీనివాసులు రెడ్డి ప్రకటన చేశారన్నారు. గత ఏడాది సెప్టెంబరు 16 వరకు కేజ్రీవాల్‌పై ఎలాంటి ఆరోపణలూ లేని, తనకు కేజ్రీవాల్ తెలియదని రాఘవ రెడ్డి చెప్పారని సింఘ్వీ గుర్తు చేశారు.

మేము ఎలా పని చేయాలో మీరు చెప్తారా?

- ఐఎంఏ అధ్యక్షుడి వ్యాఖ్యలపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: 'పతంజలి' వాణిజ్య ప్రకటనల కేసు విచారణలో భాగంగా ఐఎంఏ తీరుపై సుప్రీంకోర్టు మంగళవారం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఐఎంఏ అధ్యక్షుడు ఆర్వీ అశోకన్ సుప్రీంకోర్టును తప్పుబడుతూ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. "మేము ఎలా పని చేయాలో మీరు చెబుతారా" అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే కేసులో ఏప్రిల్ 23న విచారణ సందర్భంగా ప్రైవేటు వైద్యులు రోగులకు ఖరీదైన మందులు సిఫారసు చేయడంపై ఐఎంఏను ప్రస్తావిస్తూ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. దీనిపై అశోకన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సుప్రీం వ్యాఖ్యలు దురదృష్టకరమన్నారు. పతంజలి తరఫు న్యాయవాది ముకుల్ రోహిత్గీ మంగళవారం నాటి విచారణలో భాగంగా అశోకన్ వ్యాఖ్యలను ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. "విచారణ ప్రక్రియలో మేమెలా వ్యవహరించాలో అసలు మీరు ఎలా చెబుతారు" అని ప్రశ్నించింది. అశోకన్ ఇంటర్వ్యూ వీడియోలను సమర్పించాలని రోహిత్గీని ఆదేశించింది.

భారత్ సూపర్‌గా ఎదుగుతుంటే పాక్ అడుక్కుంటోంది!

- ఆ దేశ పార్లమెంటులో విపక్ష నేత వ్యాఖ్య

ఇస్లామాబాద్, ఏప్రిల్ 30: సూపర్ పవర్‌గా ఎదగాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంటే పాకిస్థాన్ నిధుల కోసం అడుక్కుంటోందని విపక్ష నేత మౌలానా ఫజులుర్ రహ్మాన్ వ్యాఖ్యానించారు. జమాత్ ఉలేమా ఎ ఇస్లాం (ఫజల్) పార్టీ నాయకుడైన ఆయన మంగళవారం పార్లమెంటు ప్రారంభ సమావేశంలో ప్రసంగించారు. దేశ పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేస్తూ "1947లో భారత్, పాకిస్థాన్‌లకు ఒకేసారి స్వాతంత్ర్యం వచ్చింది. ఇవాళ భారత దేశం ప్రపంచంలోనే సూపర్ పవర్‌గా ఎదగాలని ప్రయత్నాలు చేస్తోంది. మనం మాత్రం దివాళా పరిస్థితి నుంచి బయటపడేందుకు పోరాటం చేస్తున్నాం. ఇంతగా అంతరం ఉండడానికి కారకులు ఎవరు?" అని ఆయన ప్రశ్నించారు. ఇటీవల జరిగిన ఎన్నికల తీరుపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ఇవేమి ఎన్నికలు? ఓడిన వారు అసంతృప్తిలో ఉండడం..గెలిచిన వారిలోనూ సంతోషం కనిపించకపోవడం..ఇదేమి పరిస్థితి?" అని అన్నారు.

లోకం తీరు



వివేకా కేసు ఏ దేవుడికి తెలుసు?

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విషయం మాట్లాడ్డానికి మీరు(జగన్, భారతి) వణుకుతున్నారు. నోరు తెరిచి ఒక్కసారి అయినా మాట్లాడండి కేసు విషయానికి వస్తే దేవుడికి తెలుసు.. దేవుడికి తెలుసు అంటున్నారు. ఏ దేవునికి తెలుసో అర్థం కావడం లేదు. (గజ్జల ఉమాశంకర్‌రెడ్డి ఎంపీ అవినాశ్‌రెడ్డి, సీఎం జగన్‌లను కలిసిన ఫొటోలను చూపుతూ..). నిందితులతో తమకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నారు.. ఈ ఫొటోలు చూస్తే ఎవరికీ తెలియదని అనుకుంటారా? వివేకా దారుణ హత్యకుగురైతే ఎందుకు సమాధానాలు దొరకలేదు. సీబీఐ చెప్పిన దాని ప్రకారం విచారణ జరగాలి. కానీ ఎందుకు జరగలేదు. వివేకానందరెడ్డి మీ చిన్నమామ. ఆయన గురించి ఎవరైనా అడిగితే ప్రజలలో తిరుగుతున్న మీరు(వైఎస్ భారతి) సమాధానం చెప్పాలి.

- పులివెందులలో మీడియాతో డాక్టర్ సునీత

సంక్షేమం + అభివృద్ధి!

సమ్మిళితంగా కూటమి ఉమ్మడి మేనిఫెస్టో

» అన్ని వర్గాలను ఆకట్టుకునేలా హామీల వర్షం

» మేనిఫెస్టో విడుదల చేసిన చంద్రబాబు, పవన్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అన్ని వర్గాలు, వృత్తులు, ఉద్యోగులు, యువత, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు.. ఒక్కమాటలో చెప్పాలంటే సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా వరాల వర్షం కురిసింది. 'సూపర్ సిక్స్'కు.. సూపర్ సిక్స్ 2.0 తోడైంది. 'బటన్ నొక్కుడు' కాదు.. పేదల ఆదాయం పెంచి, బతుకులు మార్చే దిశగా ఈ మేనిఫెస్టో తయారైంది. టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను మంగళవారం ఇరు పార్టీల సారథులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ విడుదల చేశారు. దీనికి బీజేపీ పూర్తిస్థాయి మద్దతు, సమ్మతి తెలియచేసింది. సామాజిక పింఛను రూ.4వేలకు పెంపు, ప్రతి రైతుకు ఏటా రూ.20వేల పెట్టుబడి సహాయం, 19 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 వంటి అనేక సంక్షేమ హామీలు.. యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, మెగా డీఎస్సీ, కులవృత్తులకు అండగా ఉండేలా జీవితాలను మార్చే హామీలు... అమరావతి పునర్నిర్మాణం, ఆర్థిక రాజధానిగా విశాఖ, కర్నూలులో తక్షణం హైకోర్టు ధర్మాసనం వంటి కీలక హామీలు.. రాష్ట్ర ఆదాయాన్ని పెంచి, యువతకు ఉపాధి కల్పించేలా భారీ పరిశ్రమల ఏర్పాటు... ఇలా సంపూర్ణ సమాహారంగా మేనిఫెస్టోను రూపొందించడం విశేషం. దేశంలోనే మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ రూ.25 లక్షల ఆరోగ్య బీమా ఇస్తామని ప్రకటించారు. సహజంగా మరణించిన వారికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల చొప్పున బీమా చెల్లిస్తామన్నారు. గృహ నిర్మాణానికి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇస్తామని... ఆ తర్వాత పక్కా ఇళ్లనూ నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకే సామాజిక పింఛను మంజూరు చేస్తామన్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిల్ చట్టం, చెత్త పన్ను రద్దు చేస్తామని.. ఆస్తిపన్నుపై సమీక్షిస్తామని.. విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తామని తెలిపారు. మళ్లీ ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. విషపూరితమైన మద్యం బ్రాండ్లను రద్దు చేస్తామన్నారు. 'భోగాపురం' విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెడతామని, అమరావతిలో ఐదు ఎకరాల్లో అల్లూరి స్మారక వనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి... పోలవరం సహా ఇతర పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని తెలిపారు. హిందూ దేవాలయాలు, సత్రాల ఆస్తుల పరిరక్షణకు హిందూ ఎండోమెంట్ బోర్డు ఏర్పాటు చేస్తామని... వైదిక, ఆగమ శాస్త్ర సంబంధ విషయాల్లో ఆలయాలకు పూర్తి స్వయంప్రతిపత్తి కల్పిస్తామని ప్రకటించారు. 'ఐదేళ్లలో ధ్వంసమైన వ్యవస్థలను పునరుద్ధరిస్తాం' అని ఉద్ఘాటించారు.

ఇంట్లో వాళ్ల చేతిలో రిమోట్ జగన్: షర్మిల

రావులపాలెం/అంబాజీపేట, ఏప్రిల్ 30: సీఎం జగన్ తన ఇంట్లో ఉన్నవాళ్ల చేతిలో రిమోట్ కంట్రోల్‌గా మారిపోయారని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'కాంగ్రెస్ పార్టీ చంద్రబాబు చేతిలో రిమోట్ అని జగన్ ఆరోపించారు. కానీ రిమోట్ కంట్రోళ్ల గురించి జగన్‌కు బాగానే అవగాహన ఉంది. ఎందుకంటే గత ఐదేళ్లుగా కేంద్రంలో మోదీ చేతిలోనూ, రాష్ట్రంలో తన ఇంట్లో ఉన్నవాళ్ల చేతుల్లోనూ జగన్ రిమోట్ కంట్రోల్‌గా ఉన్నారు. ఇద్దరి పేర్లూ 'బి'తోనే మొదలవుతాయి. బీజేపీ అయినా.. ఇంట్లో ఉన్న వాళ్లు అయినా..' అని షర్మిల ఎద్దేవా చేశారు. జగన్ తనపైన ఉన్న కేసుల నుంచి తప్పించుకోవడానికే పొన్నవోలు సుధాకరరెడ్డితో సుప్రీంకోర్టులో పిటిషన్ వేయించి వైఎస్సార్ పేరును చార్జిషీట్‌లో చేర్పించి దుర్మార్గానికి పాల్పడ్డారని ఆరోపించారు.

వైఎస్ జగన్ అక్రమాస్తులు: కేసులు మళ్లీ మొదటికి!

సీబీఐ కోర్టు జడ్జి బదిలీ.. ఆది నుంచి వినాల్సిన పరిస్థితి

ఏప్రిల్ 30లోగా 130 డిశ్చార్జి పిటిషన్లు తేల్చాలని హైకోర్టు గడువు

అనారోగ్య కారణంగా తీర్పులు సిద్ధం కాలేదన్న సీబీఐ కోర్టు జడ్జి

విచారణ మే 15కు వాయిదా.. ఎమ్మార్ కేసులో పిటిషన్‌లపై తీర్పు వెల్లడి



హైదరాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం జగన్ అక్రమాస్తుల వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. తండ్రి వైఎస్ అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్ క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారని పేర్కొంటూ హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ, ఈడీలు మొత్తం 20 చార్జిషీట్‌లు దాఖలు చేశాయి. ఈ కేసులపై సీబీఐ కోర్టులో 12 ఏళ్లుగా విచారణ కొనసాగుతూనే ఉంది. వీటితో తమకు ఎలాంటి సంబంధం లేదని.. అయా చార్జిషీట్ల నుంచి తమను తప్పించాలని కోరుతూ జగన్, విజయసాయిరెడ్డి సహా ఇతర నిందితులు దాఖలు చేసిన దాదాపు 130 డిశ్చార్జి పిటిషన్‌లపై మంగళవారం తీర్పు వెలువడాల్సి ఉంది. వీటి పరిష్కారానికి హైకోర్టు ఇప్పటికే ఒకసారి గడువు పొడిగించింది. ఈ గడువు సైతం ఏప్రిల్ 30తో ముగిసింది. మంగళవారం ఈ డిశ్చార్జి పిటిషన్‌లలో తీర్పు వెలువడుతుందని అంతా భావించారు. అయితే, అనారోగ్యం కారణంగా తీర్పులు సిద్ధం కాలేదని సీబీఐ కోర్టు జడ్జి రమేశ్‌బాబు పేర్కొన్నారు. ఇటీవల బదిలీల్లో రమేశ్‌బాబు సైతం వేరే కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ కారణంగా మళ్లీ మొదటి నుంచి కేసులు వినేందుకు మే 15కు వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో 12 ఏళ్లుగా కొనసాగుతున్న విచారణ మళ్లీ మొదటికి వచ్చినట్లయింది. 2013 నుంచి సీబీఐ కోర్టులో ఏడుగురు జడ్జిలు బదిలీ అయ్యారు. తాజాగా రమేశ్‌బాబు సైతం బదిలీకావడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవలి బదిలీల్లో తమ వద్ద రిజర్వు అయి ఉన్న కేసుల్లో తీర్పులు ఇచ్చి బదిలీ అయిన చోట రిపోర్ట్ చేయాలని హైకోర్టు బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే అనారోగ్య కారణంగా తీర్పులు సిద్ధం కాలేదని జడ్జి రమేశ్‌బాబు పేర్కొన్నారు. 2022, మే 4 నుంచి ఆయన జగన్ అక్రమాస్తులకు సంబంధించిన డిశ్చార్జి పిటిషన్లపై సుదీర్ఘంగా వాదనలు విన్నారు. తీర్పు ఇవ్వాల్సిన సమయంలో బదిలీ కావడంతో ఆయన కేసులను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొత్తగా వచ్చే జడ్జి మళ్లీ ఈ కేసులను మొదటి నుంచి వినాల్సిన అవసరం ఏర్పడింది. మరో ట్విస్ట్ ఏమిటంటే కొత్తగా వచ్చే జడ్జికి సైతం రిటైర్‌మెంట్ వయసు దగ్గర పడిందని.. ఆయనకు కూడా ఎక్కువ కాలం పదవిలో ఉండరని చర్చ జరుగుతోంది. కేవలం డిశ్చారి పిటిషన్‌లకే దశాబ్దకాలం పడితే.. ప్రధానకేసులు ఎప్పుడు విచారణకు వస్తాయి? ఎప్పుడు శిక్షలు పడతాయి? అన్న అంశాలు ప్రశ్నార్థకంగా మారాయి.

హైకోర్టు, సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తున్నా..

ప్రజాప్రతినిధుల కేసుల్లో విచారణ వేగంగా పూర్తి చేసి.. తీర్పులు ఇవ్వాలని అశ్వినీ ఉపాధ్యాయ కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ కేసులను హైకోర్టులు ప్రత్యక్షంగా పరిశీలించాలని.. దిగువ కోర్టులకు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేయాలని పేర్కొంది. ఈ ఆదేశాలతో తెలంగాణ హైకోర్టు సుమోటోగా ఈ అంశాన్ని స్వీకరించింది. హైదరాబాద్ సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న డిశ్చార్జి పిటిషన్లను ఫిబ్రవరి 29లోగా పరిష్కరించాలని గతేడాది డిసెంబరులో పేర్కొంది. అయితే, భారీగా ఉన్న రికార్డులను పరిశీలించడంతోపాటు సాక్షుల వాంగ్మూలాలు రికార్డు చేయాల్సి ఉందని.. 13 వేల పేజీల డిక్టేషన్ సిద్ధం చేస్తున్నందున మరింత గడువు కావాలని సీబీఐ కోర్టు కోరడంతో గడువును రెండు నెలలు(అంటే ఏప్రిల్ 30వరకు) పొడిగించింది. ఈ క్రమంలో తనకు అనారోగ్యం వల్ల తీర్పు వెల్లడించలేకపోతున్నానని జడ్జి ప్రకటించడం సంచలనంగా మారింది. తీర్పు వెలువడాల్సిన దశలో జడ్జి బదిలీ కావడం గమనార్హం.

ఎమ్మార్ కేసులో ఎదురుదెబ్బ

అనారోగ్య కారణంగా జగన్ అక్రమాస్తుల కేసుల్లో తీర్పు ఇవ్వలేకపోతున్నట్లు తెలిపిన సీబీఐ కోర్టు జడ్జి సీహెచ్ రమేశ్‌బాబు.. ఎమ్మార్ కేసులో నిందితులు దాఖలు చేసిన 9 డిశ్చార్జి పిటిషన్‌లపై మంగళవారం తీర్పు వెలువరించారు. 11 ఏళ్ల సుదీర్ఘ విచారణ తర్వాత ఈ కేసుకు సంబంధించిన డిశ్చార్జి పిటిషన్‌లలో తీర్పు వెలువడింది. సీఎం జగన్ సన్నిహితుడు ఎన్. సునీల్‌రెడ్డి దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను సీబీఐ కోర్టు కొట్టేసింది. అలాగే, కోనేరు ప్రదీప్, విజయరాఘవ, శ్రీకాంత్ జోషి, ఎమ్మార్ ఎంజీఎఫ్, ఎమ్మార్ ప్రాపర్టీస్, ఎమ్మార్ హిల్స్ బౌల్డర్ హిల్స్ డిశ్చార్జి పిటిషన్‌లను కొట్టేసింది. మరో నిందితుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్యపై 120బీ, 409 సెక్షన్లను తొలగించిన సీబీఐ కోర్టు.. అవినీతి నిరోధక చట్టం కింద అభియోగాలు ఎదుర్కోవాల్సిందేనని పేర్కొంది. ఇతర నిందితులను కేసు నుంచి తప్పించడానికి సీబీఐ కోర్టు నిరాకరించింది. నిందితులు విచారణను ఎదుర్కోవాల్సిందేనని ప్రకటించింది. ఈ తీర్పుపై నిందితులు హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది.

దాల్మియా భారత్‌కు చుక్కెదురు

జగన్ అక్రమాస్తుల కేసులో దాల్మియా సిమెంట్స్ చార్జిషీట్‌లో నిందితులుగా ఉన్న దాల్మియా సిమెంట్స్ భారత్, ఆ కంపెనీ ఎండీ పునీత్ దాల్మియాకు హైకోర్టులో చుక్కెదురైంది. మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 50 చట్టబద్ధతను ప్రశ్నిస్తూ 2016లో వారు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. లైమ్‌స్టోన్ గనుల కేటాయింపునకు క్విడ్ ప్రోకోగా జగన్ కంపెనీల్లో దాల్మియా సిమెంట్స్ పెట్టుబడులు పెట్టిందని సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసు ఆధారంగా ఈడీ సైతం దర్యాప్తు ప్రారంభించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. కేంద్రం తరఫున ఏఎస్‌జీ వి. నర్సింహాశర్మ వాదనలు వినిపిస్తూ 'విజయ్ మదన్‌లాల్ చౌదరి' కేసులో సుప్రీంకోర్టు సెక్షన్ 50 అధికారాలను సమర్థించిందని.. ఈ నేపథ్యంలో ఈ పిటిషన్‌లో తదుపరి విచారణ అవసరం లేదని పేర్కొన్నారు. ఈ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం.. దాల్మియాసిమెంట్స్ భారత్, పునీత్ దాల్మియా పిటిషన్‌పై విచారణ ముగించింది.



రైతులకు రుణమాఫీ చేయాలని జగన్‌కు చెప్పాలని భారతిని కోరుతున్న తువ్వపల్లె, వేంపల్లె వైసీపీ నేతలు

సొంత ఇలాకాలో షాకులు!

పులివెందులలో భారతికి ప్రశ్నలు

» రైతులకు వైఎస్ మేలు చేశారు

» రుణమాఫీపై జగన్‌కు చెప్పండి

» పదేపదే వైసీపీ నేతల డిమాండ్

కడప, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సొంత ఇలాకా.. అందులోనూ సొంత పార్టీ నేతలు! చెప్పింది విని, జేజేలు కొట్టడం తప్ప.. ఎదురు మాట్లాడిందీ, డిమాండ్లు చేసిందీ లేనేలేదు. మొట్టమొదటిసారిగా ఈ సీన్ రివర్స్ అవుతోంది. ఏపీలోని పులివెందుల నియోజకవర్గంలో వరుసగా రెండో రోజున జగన్ సతీమణి భారతికి వైసీపీ నేతలనుంచి 'డిమాండ్లు' వినిపించాయి. భారతి మంగళవారం పులివెందులలో ప్రచారం చేశారు. పిరమిడ్‌నగర్‌లో తువ్వపల్లెకి చెందిన వైసీపీ నేతలు వెంకటనారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ భర్త ధనుంజయ రెడ్డి, వేంపల్లె వైసీపీ నేతలు రెడ్డెయ్య తదితరులు రైతుల అసంతృప్తిని భారతికి తెలిపారు. 'రైతులకు వైఎస్ఆర్ మేలు చేశారు. రుణమాఫీ చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ఈ విషయం జగన్‌కు చెప్పండి" అని భారతిని కోరారు. రుణమాఫీ సాధ్యమయ్యేదైతే జగనే చెప్పేవారని, సాధ్యం కాదు కాబట్టే చెప్పలేదని ఆమె బదులిచ్చారు.

మా పాస్‌బుక్‌పై 'జగన్' ఎందుకు?

రైతుల పట్టాదారు పాసుబుక్కులపై జగన్ ఫొటో వద్దంటూ వైసీపీ నేత, కమ్మరాంపల్లె మాజీ సర్పంచ్ భర్త భాస్కర్‌రెడ్డి వైఎస్ భారతికి ముఖాన్నే చెప్పారు. ఆమె వేంపల్లెలోని జీఎం కాంప్లెక్స్ వద్ద ప్రచారం నిర్వహిస్తుండగా.. భాస్కర్‌రెడ్డి ఆమెతో మాట్లాడారు. "మా తాతల కాలం నుంచి పట్టాదారు పాసుబుక్కులపై రైతుల ఫొటోలే ఉన్నాయి. ఇప్పుడు జగన్ ఫొటోలు పెట్టడం పద్ధతి కాదు.. తీసేయమని జగన్‌కు చెప్పండి. జగన్ ఎప్పుడైనా 'నా రైతు' అని మాట్లాడారా?"అని భాస్కర్ రెడ్డి ప్రశ్నించారు.




నవ్య | చిత్రజ్యోతి

నవీన్‌చంద్రకు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం



టాలీవుడ్ హీరో నవీన్‌చంద్రకు అరుదైన గౌరవం దక్కింది. మంగళవారం జరిగిన ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో నవీన్‌చంద్ర ఉత్తమ నటుడి పురస్కారం అందుకున్నారు. గత ఏడాది విడుదలైన కాన్సెప్ట్ ఓరియంటెడ్ చిత్రం 'మంత్ ఆఫ్ మధు' చిత్రంలో అద్భుతమైన నటనకు గాను ఈ పురస్కారం ఆయనకు దక్కింది. ప్రస్తుతం నవీన్‌చంద్ర రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' సహా పలు చిత్రాల్లో నటిస్తున్నారు.

యాక్షన్ ఎంటర్టైనర్



'బేబి'తో సూపర్ హిట్ కొట్టిన తర్వాత ఆనంద్ దేవరకొండ నటిస్తున్న చిత్రం 'గం గం గణేశా'. ఈ యాక్షన్ ఎంటర్టైనర్‌కు ఉదయ్ శెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. కేదార్ శెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. మే 31న ఈ సినిమా విడుదల కానుంది. సరికొత్త కంటెంట్‌తో ఈ చిత్రం రాబోతోందని పోస్టర్‌ను చూస్తుంటే తెలుస్తోంది. ఈ చిత్రంలో ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా, వెన్నెల కిశోర్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

తప్పకుండా ఆదరించాలి



'సగిలేటి కథ' మూవీ ఫేమ్ రవితేజ మహాదాస్యం ఓ కొత్త చిత్రంలో నటిస్తున్నారు. మద్దుల మదన్‌కుమార్ దర్శకత్వం వహించగా, సౌజన్య కావూరి నిర్మిస్తున్నారు. ఈ సినిమాని ఇటీవలే ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి హీరో రవితేజ మహాదాస్యంపై విరాజ్ అశ్విన్ క్లాప్ కొట్టారు. పురాణపండ శ్రీనివాస్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా పురాణపండ శ్రీనివాస్ మాట్లాడుతూ "సినీ రంగంలోకి ఎంతో మంది ప్రతిభావంతులు వస్తున్నారు. వారిని తప్పకుండా ఆదరించాలి" అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: అఖిల్ దేశ్‌పాండే, కెమెరామెన్ నితిన్ రెడ్డి చిమ్ముల, సహ నిర్మాతలు: దియా, సంజీవ్ కోనేరు, వెంకట్ రమణారెడ్డి.





లారీ చక్రాల కింద నలిగిన నవదంపతులు

» భర్త మృతి, ప్రాణాపాయ స్థితిలో భార్య

» పెళ్లయిన మూడు రోజులకే ఘోరం


వెంకటేష్(ఫైల్)

మాసాయిపేట/చిన్నశంకరంపేట, ఏప్రిల్ 30: మెదక్ జిల్లా మాసాయిపేట మండలంలోని రామంతాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కాళ్ల పారాణి కూడా ఆరకముందే ఓ నవదంపతులు లారీ చక్రాల కింద నలిగిపోయారు. ఆ దంపతుల్లోని భర్త అక్కడికక్కడే మరణించగా.. భార్య ఆస్పత్రిలో ప్రాణాల కోసం పోరాడుతోంది. మాసాయిపేట మండలం పోతన్‌పల్లికి చెందిన శ్రీలత(18)కు, చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల వెంకటేష్(23)తో ఈనెల 26న వివాహమైంది. నూతన దంపతులు మంగళవారం జంగరాయి నుంచి పోతన్‌పల్లికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. అయితే, అతివేగంగా దూసుకొచ్చిన ఓ లారీ రామంతాపూర్ వెంచర్ సమీపంలో వారి ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటేష్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, శ్రీలతకు తీవ్ర గాయాలయ్యాయి. నూతన దంపతులను అనుసరిస్తున్న బంధువులు శ్రీలతను వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శ్రీలత ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఉంది.

రాధాకిషన్ బెయిల్ పిటిషన్ రేపటికి వాయిదా

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్ రావు బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి కోర్టు గురువారాని(మే 2)కి వాయిదా వేసింది. పోలీస్ కస్టడీ ముగిసిందని, జుడీషియల్ రిమాండ్ గడువు పూర్తి అయినందున బెయిల్ మంజూరు చేయాలని రాధాకిషన్ రావు తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. బెయిల్ పిటిషన్‌పై మంగళవారం ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును గురువారానికి (మే 2న) వాయిదా వేశారు.

ఆర్టీసీ ఉద్యోగి ఆత్మహత్య

» అధికారుల వేధింపులే కారణం: కుటుంబసభ్యులు

» ఖండించిన ఆర్టీసీ ఎండీ వీసీ. సజ్జనార్

యాలాల, వికారాబాద్/తాండూరు ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా తాండూరు డిపోలో శ్రామిక్‌గా పనిచేస్తున్న టి.రాజప్ప అనే ఆర్టీసీ ఉద్యోగి సోమవారం రాత్రి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆర్టీసీ అధికారుల వేధింపుల వల్లే రాజప్ప ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. దౌలాపూర్‌నకు చెందిన రాజప్ప 2013లో ఆర్టీసీలో డ్రైవర్‌గా చేరాడు. ఆరోగ్య సమస్యల కారణంగా అన్‌ఫిట్ అయ్యాడు. 2018 నుంచి శ్రామిక్‌గా తాండూర్ డిపోలో విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే రెండు మూడు నెలల నుంచి రాజప్పను ఆర్టీసీ అధికారులు వేధిస్తున్నారని దీంతో మనస్తాపానికి గురై గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, అధికారుల వేధింపుల వల్లే రాజప్ప ఆత్మహత్య చేసుకున్నాడనడంలో నిజం లేదని, ఈ ఆరోపణలను టీఎస్ఆర్టీసీ ఖండిస్తోందని ఎండీ వీసీ.సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్‌లో అధికారులకు సమాచారం ఇవ్వకుండానే రాజప్ప 12రోజులు విధులకు రాలేదని తెలిపారు. మూడు రోజుల నుంచీ రాజప్ప విధులకు హాజరు కాలేదన్నారు. కుటుంబ సమస్యల వల్ల ఆత్మహత్య చేసుకుంటే దానికి సంస్థ అధికారులను బాధ్యులుగా చేయడం సరైంది కాదని సజ్జనార్ పేర్కొన్నారు.

జల విద్యుత్తు కేంద్రాలపై రాతపూర్వకంగా అభ్యంతరాలు తెలపండి

» కేఆర్ఎంబీ కేసులో తెలుగు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న జల విద్యుత్ కేంద్రాలను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) పరిధిలోకి తీసుకురావాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. దీనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు రాతపూర్వకంగా అభ్యంతరాలు తెలపాలని ఆదేశించింది. తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి అనుమతులు లేకుండా విద్యుత్ కేంద్రాల నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేస్తోందంటూ 2021లో ఆంధ్రప్రదేశ్ కేంద్రానికి ఫిర్యాదు చేసింది. అదే ఏడాది జూలైలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్, ఏపీ తరఫు సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం జూలై 9కి విచారణను వాయిదా వేసింది. ఆ లోపు తమ వాదనలను లిఖితపూర్వకంగా సమర్పించాలని ఆదేశించింది.

ఇద్దరు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులైన జస్టిస్ జగన్నగారి శ్రీనివాసరావు, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ప్రమాణస్వీకారం చేశారు. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ రాష్ట్రపతి ఉత్తర్వులను చదివి వినిపించిన తర్వాత చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో అందరు హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో ప్రత్యేక ధర్మాసనాలు ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): హైకోర్టుకు మే 6 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు ప్రకటిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే ఆదేశాల మేరకు వేసవి సెలవుల్లో అత్యవసర కేసులను విచారించేందుకు ప్రత్యేకంగా డివిజన్ బెంచ్‌లు, ఏకసభ్య ధర్మాసనాలను ఏర్పాటు చేశారు. జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ జే శ్రీనివాసరావు డివిజన్ బెంచ్, జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ లక్ష్మీనారాయణ డివిజన్ బెంచ్, జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి, జస్టిస్ అనిల్ కుమార్ సింగిల్ బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

నామినేషన్‌ల తిరస్కరణపై జోక్యం చేసుకోలేం

నామినేషన్‌ల తిరస్కరణకు సంబంధించిన వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని, ఎలక్షన్ కమిషన్ నిర్ణయమే అంతిమమని పేర్కొంటూ పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌లను హైకోర్టు మంగళవారం కొట్టేసింది. తమ నామినేషన్‌లను రిటర్నింగ్ అధికారులు తిరస్కరించారని పేర్కొంటూ నల్గొండ లోక్‌సభ నియోజకవర్గం నుంచి వీరబ్రహ్మ రవి, మెదక్ నుంచి కల్లు నర్సింహులు, మల్కాజ్‌గిరి నుంచి షేక్ తౌఫీక్‌లు పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఒక్కసారి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన తర్వాత కోర్టులు ఈసీ విధుల్లో జోక్యం చేసుకోలేవని తెలిపింది.

థర్మల్ ప్లాంట్లు, విద్యుత్తు కొనుగోళ్లపై 28 మందికి నోటీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణం; ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు నిర్ణయాల్లో భాగస్వాములైన మొత్తం 28 మంది ప్రస్తుత, మాజీ అధికారులకు న్యాయ విచారణ జరుపుతున్న జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ నోటీసులు జారీ చేసింది. దీంట్లో వారి పాత్ర ఏమిటనేదానిపై వివరణ ఇస్తూ 15 రోజుల్లోగా సమాధానం పంపాలని కోరింది. ఇంధన శాఖ మాజీ ముఖ్యకార్యదర్శులు సురేష్ చందా, ఎస్కే జోషీ, అరవింద్‌కుమార్, అజయ్ మిశ్రా, ట్రాన్స్‌కో, జెన్‌కో మాజీ సీఎండీ డి.ప్రభాకర్‌రావు, టీఎస్ఎస్పీడీసీఎల్ మాజీ సీఎండీ జి.రఘుమారెడ్డి, టీఎస్ఎన్పీడీసీఎల్ మాజీ సీఎండీలు కె.వెంకటనారాయణ, ఎ.గోపాల్‌రావు, విద్యుత్ సంస్థల మాజీ, ప్రస్తుత డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు, ఇతర అధికారులకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. నోటీసులు అందుకున్న వారిలో కొందరు ఇప్పటికే తమ వివరణలను రాతపూర్వకంగా పంపించారు. అధికారులందరి నుంచి సమాధానాలు అందిన తర్వాత వాటిని క్రోడీకరించి విశ్లేషించనుంది. ఈ సమాచారం ఆధారంగా విద్యుత్ నిర్ణయాల్లో కీలక పాత్రపోషించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని కీలక ప్రజాప్రతినిధులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేసే అవకాశముంది. థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం, విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై న్యాయ విచారణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ కోసం బహిరంగ ప్రకటన జారీ చేయడానికి అనుమతించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరింది.

తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. మంగళవారం మెదక్ జిల్లాలోని జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలో ఉన్న అల్లాదుర్గంలో బీజేపీ నిర్వహించిన బహిరంగసభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. తెలంగాణను తొలుత బీఆర్ఎస్ ఎలా దోచుకుందో, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే విధంగా డబుల్ ఆర్ ట్యాక్సు పేరుతో దోచుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రంలోని 17 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే ఈ డబుల్ ఆర్ ట్యాక్సు వసూళ్లను అడ్డుకుంటామని చెప్పారు. అధికారంలోకి వస్తే కాళేశ్వరం అవినీతిపై విచారణ జరిపిస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. ఇప్పుడు అధికారంలో ఉన్నా, ఆ ప్రాజెక్టు అవినీతి ఫైళ్లను తొక్కిపెడుతోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని, ఢిల్లీ లిక్కర్ స్కాంలో కూడా ఇది కనిపిస్తుందని తెలిపారు.

ముస్లింలకు రిజర్వేషన్లు దక్కనివ్వను

తన ప్రాణం ఉన్నంతవరకూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను మతపరంగా ముస్లింలకు దక్కనివ్వనని మోదీ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీకి తొత్తులుగా ఉన్న వారికి ఇదే సవాల్ అని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ నేతలారా! కాంగ్రెస్‌కు మద్దతిస్తున్న పార్టీల నేతలారా! చెవులు రిక్కించి వినండి. మోదీ జీవించి ఉన్నంత వరకు రాజ్యాంగాన్ని మార్చే శక్తి ఎవరికీ ఉండదు. దళితులు, ఆదివాసీలు, ఓబీసీల హక్కులను మతపరంగా ముస్లింలకు దక్కనివ్వబోను' అని పేర్కొన్నారు. రిజర్వేషన్‌లపై నాడు రాజ్యాంగసభలో సుదీర్ఘ చర్చల అనంతరం, మతపరమైన రిజర్వేషన్‌లు ఉండరాదని తీర్మానం చేశారని చెప్పారు. రాజ్యాంగాన్ని పవిత్ర గ్రంథంగా బీజేపీ భావిస్తుందని స్పష్టం చేశారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయనివిధంగా తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు.. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగాన్ని ఏనుగుపై ఉంచి భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించినట్లు గుర్తుచేశారు. తొలిసారి ప్రధాని అయిన తర్వాత 2014లో పార్లమెంటుకు సాష్టాంగ నమస్కారం చేసిన తర్వాతే అందులో అడుగుపెట్టానని, రెండోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాజ్యాంగాన్ని పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ఏర్పాటు చేశామని వివరించారు. ఓటుబ్యాంకు కోసం ఎన్నికల సంఘాన్ని, ఈవీఎంలను ప్రశ్నిస్తున్న కాంగ్రెస్.. రాజ్యాంగాన్ని సైతం బద్‌నాం చేస్తోందని మోదీ ధ్వజమెత్తారు. ప్రపంచం ఆర్థిక ప్రగతితో దూసుకుపోతుంటే భారత్‌ను కాంగ్రెస్ అవినీతి ఊబిలోకి నెట్టివేసిందని, అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం కష్టపడి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిందన్నారు. ఇప్పుడు మళ్లీ పాత రోజులను తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే, అక్కడ పంచ సూత్రాల పాలన సాగుతుందని.. అబద్ధాలు- మోసపూరిత వాగ్దానాలు, ఓటుబ్యాంకు రాజకీయాలు, మాఫియాను పెంచి పోషించడం, కుటుంబ పాలన, అవినీతి - ఇవే ఆ పంచ సూత్రాలని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి ప్రతిపక్ష హోదా కూడా దక్కబోదన్నారు.


జహీరాబాద్ సభలో ఎంపీ అభ్యర్థులతో కలిసి అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

ఎన్నికలను అపహాస్యం చేస్తూ ఫేక్ వీడియో

దేశంలో ఉద్రిక్త పరిస్థితులు సృష్టించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఓ ఫేక్ వీడియోను సృష్టించిందని, ఈ వ్యవహారంలో డబుల్ ఆర్‌లో ఒక పేరు (రేవంత్‌రెడ్డి) బయటకు వచ్చిందని మోదీ తెలిపారు. వారసత్వంగా లభించే ఆస్తిపై 55 శాతం పన్ను విధించాలని కాంగ్రెస్ ఆలోచిస్తోందని ఆరోపించారు. 'కాంగ్రెస్ పొరపాటున అధికారంలోకి వస్తే, మీరు కష్టపడి సంపాదించుకున్న ఆస్తిపై ట్యాక్సు తీసుకువస్తుంది. 55 శాతం వసూలు చేయడం ఖాయం. ఆ పార్టీ పట్ల అప్రమత్తంగా ఉండాలి' అని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో రైతులను మోసం చేసిందని, వంద రోజుల్లో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. తమ పాలనలో బాలికల కోసం బేటీ బచావో, బేటీ పడావో పథకాన్ని ప్రవేశపెట్టామని.. ఇందులో భాగంగా బాలికల కోసం పాఠశాలల్లో ప్రత్యేకంగా మరుగుదొడ్లు నిర్మించామని మోదీ చెప్పారు. పేదలకు ఇచ్చే ఇళ్లు కూడా మహిళల పేరిటే ఇస్తున్నామని, వారి భద్రతకు కఠిన చట్టాలు తీసుకువచ్చామన్నారు.

మా దేశభక్తికి రామమందిరం ఓ ఉదాహరణ

కేంద్రంలో దేశభక్తి కలిగిన, బలమైన ప్రభుత్వం ఉంటే చరిత్రాత్మక నిర్ణయాలు అమలవుతాయని, అయోధ్యలో రామమందిరం నిర్మాణం ఇందుకు ఒక ఉదాహరణ అని మోదీ తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందే నిర్మించాల్సిన ఈ ఆలయం, తమ హయాంలో సాకారమైందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన.. 'రామమందిరం ఎవరు నిర్మించారు?' అంటూ సభకు హాజరైన జనాన్ని పలుమార్లు ప్రశ్నించారు. వారు 'మోదీ.. మోదీ..' అంటూ పెద్దపెట్టున సమాధానం ఇచ్చారు. దీనికి మోదీ.. మీరు ఇచ్చిన ఓట్లతో, సంపూర్ణ అధికారంతోనే రామమందిరం నిర్మించామని తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకే ముఖ్యమని, హైదరాబాదులో శ్రీరామనవమి శోభాయాత్రపై ఆంక్షలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే అని ఆరోపించారు. ఉమ్మడి ఏపీలో 2004-2009లో తెలంగాణ నుంచి కాంగ్రెస్‌కు రికార్డు స్థాయిలో ఎంపీలను, ఎమ్మెల్యేలను ఇస్తే.. రాష్ట్రాన్ని మతపరమైన రిజర్వేషన్లకు ప్రయోగశాలగా మార్చి ఓబీసీలకున్న రిజర్వేషన్ తగ్గించి ముస్లింలకు ఇచ్చిందన్నారు. తెలంగాణలో ఉంటున్న లింగాయత్, మరాఠాల్లోని 26 జాతులను ఓబీసీలను చేర్చని కాంగ్రెస్, ముస్లింలను మాత్రం రాత్రికి రాత్రి ఓబీసీల్లో చేర్చిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ బంజారాలను, మాదిగలను మోసం చేశాయని పేర్కొంటూ, ఎస్సీ వర్గీకరణకు తాము కట్టుబడి ఉన్నామని మోదీ పేర్కొన్నారు. 'తొలుత రాజ్యాంగంలోని ప్రతీ పేజీలో రామాయణం, మహాభారత చిత్రాలు ఉండేవి. కానీ, యువరాజు ముత్తాత (నెహ్రూ) వాటిని తొలగించారు. ఆ తర్వాత, యువరాజు నానమ్మ (ఇందిర) రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి ఎమర్జెన్సీ విధించారు. యువరాజు తండ్రి (రాజీవ్‌గాంధీ) మీడియా స్వేచ్ఛను హరించే భయంకర చట్టాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. నాడు, బీజేపీ, ఇతర పక్షాలతో కలిసి ఉద్యమించడంతో ఆయన వెనక్కి తగ్గారు. ప్రధాని మన్మోహన్ అధ్యక్షతన క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం కాపీని యువరాజు బహిరంగంగా చింపివేసి రాజ్యాంగాన్ని అవహేళన చేశారు' అని మోదీ విమర్శించారు.

10న ఎల్బీ స్టేడియంలో మోదీ బహిరంగసభ!

హైదరాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో బీజేపీ తన ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 10న ఎల్బీ స్టేడియంలో బహిరంగసభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రధాని మోదీ, ఈ సభకు హాజరుకానున్నారు. 8న కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో మోదీ పర్యటించనున్నారు. వేములవాడలో నిర్వహించనున్న బహిరంగసభలో పాల్గొంటారు.

నేడు హైదరాబాద్‌లో అమిత్ షా రోడ్ షో

కేంద్ర హోంమంత్రి అమిత్ షా బుధవారం హైదరాబాద్ పార్లమెంటు పరిధిలో రోడ్ షోలో పాల్గొంటారు. లాల్‌దర్వాజలోని మహంకాళి అమ్మవారి ఆలయం నుంచి శాలిబండ సుధా టాకీస్ వరకు ఈ రోడ్ షో కొనసాగనుంది.


సికింద్రాబాద్ సివిల్ కోర్టులో న్యాయవాదులతో కిషన్‌రెడ్డి

17 సీట్లలో గెలుపు మాదే

» మోదీకి దేశంలోని అన్నివర్గాల మద్దతు: కిషన్‌రెడ్డి

సంగారెడ్డి/అడ్డగుట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 సీట్లలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం వద్ద బీజేపీ నిర్వహించిన విశాల్ జనసభలో ఆయన పాల్గొన్నారు. సికింద్రాబాద్ కోర్టులోని బార్ అసోసియేషన్ చాంబర్‌లో న్యాయవాదులను కలిశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మోదీ దేశ గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేస్తున్నారని, అందుకే అన్నివర్గాల ప్రజలు మోదీకి తమ మద్దతు తెలుపు తూ తీర్మానాలు చేస్తున్నారని పేర్కొన్నారు. కాగా, ఉమ్మడి మెదక్ జిల్లాలోని నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు హరీశ్‌రావు పంపించి ట్రయిల్ రన్ మొదలుపెట్టారని మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు ఆరోపించారు. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక.. ఆయన, హరీశ్‌రావు ఒకే విమానంలో ఢిల్లీకి వెళ్లారని, ఆ సమయంలో ఈ విషయాలన్నింటినీ చర్చించుకున్నారన్నారు. బీఆర్ఎస్ నుంచి 20 మంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి తీసుకొస్తానని హరీశ్.. రేవంత్‌రెడ్డికి హామీ ఇచ్చారని ఆయన ఆరోపించారు.

నా గుండుతో నీకేం పని రేవంతన్నా..

» నేను చేసిన అభివృద్ధి కనిపించట్లేదా?: బండి సంజయ్



సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 30: 'నేను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల సంగతి ఏమైందని అడిగితే.. గుండు, అరగుండు అంటూ హేళనగా మాట్లాడుతావా? నా గుండుతో నీకేం పని.. ఐదేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో నేను చేసిన అభివృద్ధి, పోరాటాలు నీ కళ్లకు కనిపించడం లేదా రేవంతన్నా' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. సిరిసిల్లలో విలేకరులతో ఆయన మాట్లాడారు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి వాడుతున్న భాషను చూసి జనం అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. జమ్మికుంటలో సీఎం బహిరంగ సభ జనం లేక అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరిస్తున్నారనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. జమ్మికుంట సభలో సీఎం చేసిన వ్యాఖ్యలు తనకు బాధ కలిగించాయన్నారు. గాడిదగుడ్డు.. అరగుండు, గుండుసున్నా అంటూ వ్యక్తిగతంగా హేళన చేస్తే రాష్ట్ర జనాభాలో తన లాగే గుండు, అరగుండు ఉన్నవాళ్లు 50% మంది ఉన్నారని, వాళ్లు మీ సంగతి, మీ పార్టీ సంగతి చూస్తారు జాగ్రత్త అని హెచ్చరించారు.

అమిత్‌షా ఫేక్ వీడియో కేసు.. ఢిల్లీకి వెళ్లొద్దని రేవంత్ నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అమిత్‌షా ఫేక్ వీడియో కేసులో ఢిల్లీ పోలీసులు జారీచేసిన నోటీసుల ప్రకారం విచారణకు హాజరు కావొద్దని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈ అంశాన్ని ఆయన న్యాయపరంగా ఎదుర్కొనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఢిల్లీ పోలీసులు జారీ చేసిన నోటీసుల ప్రకారం.. సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఢిల్లీ పోలీసుల విచారణకు హాజరవ్వాలి. అయితే.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రేవంత్ షెడ్యూల్ ప్రకారం బుధవారం ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు వరకు కోరుట్ల, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లిల్లో జరిగే ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు. మరో రెండ్రోజుల పాటు ఆయన ఎన్నికల షెడ్యూల్ బిజీగా ఉంది. ఇదే కేసులో నోటీసులు అందుకున్న కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ప్రతినిధులు మన్నె సతీశ్, నవీన్, శివకుమార్, అస్మాతస్లీమ్ కూడా రేవంత్ బాటలోనే విచారణకు హాజరుకావొద్దని నిర్ణయించారు. ఢిల్లీ పోలీసుల ఎఫ్ఐఆర్‌పై టీపీసీసీ లీగల్ టీమ్ పలు అనుమానాలను వ్యక్తం చేస్తోంది. ఎఫ్ఐఆర్‌ను అధ్యయనం చేయడానికి కొంత సమయం కావాలని కోరుతూ మంగళవారం ఢిల్లీ పోలీసులకు లేఖ రాసింది.

'రిజర్వేషన్ల' రచ్చ మొదలైంది తెలంగాణలోనే!

» ఏప్రిల్ 25న సిద్దిపేట బహిరంగసభలో అమిత్ షా ప్రసంగం ఎడిటింగ్

» సోషల్ మీడియాలో వైరల్.. వివాదాస్పదంగా మారిన వీడియో

హైదరాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బీజేపీ వరుసగా మూడో సారి అధికారం చేపడితే రిజర్వేషన్లు రద్దు చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చెప్పినట్లుగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఈ విషయంలో పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఈ వీడియో అంశంలో విచారణకు హాజరు కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఢిల్లీ పోలీసులు నోటీసులు కూడా జారీ చేశారు. ఇంత వివాదాస్పదంగా మారిన ఈ రిజర్వేషన్ల అంశాన్ని అమిత్ షా ప్రస్తావించింది తెలంగాణలోనే. ఏప్రిల్ 25న సిద్దిపేటలో జరిగిన బహిరంగ సభలో అమిత్‌షా రిజర్వేషన్లపై మాట్లాడారు. 'బీజేపీ మూడోసారి అధికారంలోకి రాగానే రాజ్యాంగ విరుద్ధంగా ఉన్న ముస్లిం రిజర్వేషన్లను తొలగించి తెలంగాణలోని ఎస్సీ , ఎస్టీ, ఓబీసీలకు ఇస్తాం' అని పేర్కొన్నారు. అయితే, ఈ వీడియోను ఎడిట్ చేసిన కొందరు ఆ ప్రసంగంలోని కొన్ని మాటలను మార్చారు. 'బీజేపీ మూడోసారి అధికారంలోకి రాగానే రాజ్యాంగ విరుద్ధంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను తొలగిస్తాం'అని నకిలీ వీడియో సృష్టించి సోషల్ మీడియాలో పెట్టారు సున్నితమైన రిజర్వేషన్ల అంశం కావడంతో ఈ వీడియో కలకలం రేపింది.

ఓయూ సెలవులపై.. బీఆర్ఎస్ ఫేక్ నోటీసు సృష్టి?

(మొదటిపేజీ తరువాయి)



మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతలు, నీటి కొరత ఉన్నాయనడానికి ఓయూకు సెలవులు ఇవ్వడమే నిదర్శనమని కేసీఆర్ పేర్కొనడం, అయితే ప్రతి ఏటా ఇలాగే సెలవులు ఇస్తామని, కరెంటు, నీటి సమస్యలను ప్రస్తావిస్తామని చీఫ్ వార్డెన్ వెల్లడించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో 2023లో ఓయూకు సెలవులు ఇస్తున్నట్లు పేర్కొంటూ వర్సిటీ అధికారులు జారీ చేసిన నోటీసుల కాపీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అప్పుడు కూడా కరెంటు, నీటి సమస్యలను ప్రస్తావించడం, ఆనాడు కేసీఆర్ ప్రభుత్వమే ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే ఓయూను మూసేస్తున్నామన్నట్లుగా కేసీఆర్ దివాళాకోరు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి నకిలీ నోటీసును పోస్ట్ చేశారంటూ బీఆర్ఎస్ పార్టీ కొత్త నోటీసును తెరపైకి తెచ్చింది. గత ఏడాది సెలవులకు సంబంధించి నోటీసులో కరెంటు, నీటి సమస్య ప్రస్తావనే లేదని పేర్కొంది. దీనిపై ఓయూ చీఫ్ వార్డెన్ స్పందించి.. బీఆర్ఎస్ పోస్ట్ చేసిందే నకిలీ నోటీసు అని తెలిపారు. ఫేక్ నోటీసును సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌పై కేసు నమోదు చేశారు.

కేసీఆర్ దివాళాకోరు ప్రచారం..

ఓయూకు సెలవులపై కేసీఆర్ విమర్శలపై సీఎం రేవంత్ 'ఎక్స్'లో స్పందిస్తూ.. కేసీఆర్‌ను చూస్తుంటే గోబెల్స్ మళ్లీ పుట్టాడనిపిస్తోందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ఉస్మానియా వర్సిటీని మూసేస్తున్నట్లుగా కేసీఆర్ దిక్కుమాలిన ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇది కేసీఆర్ దిగజారుడుతనానికి పరాకాష్ఠ అన్నారు. ఓయూ విషయంలో తప్పుడు ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గత మూడు రోజులుగా కేసీఆర్ తీవ్రంగా ప్రయతిస్తున్నారని ఆరోపించారు. వర్సిటీ చీఫ్ వార్డెన్ 2023 మే నెలలోనూ ఇలాంటి నోటీసునే జారీ చేశారని, వేసవి సెలవుల సందర్భంగా 2023 మే 12 నుంచి జూన్ 5 వరకు హాస్టళ్లు, మెస్ మూసివేయనున్నట్లు పేర్కొన్నారని తెలిపారు. ఆ నోటీసులో కూడా విద్యుత్తు, నీటి కొరతల గురించి ప్రస్తావించారన్నారు. అప్పుడు సీఎంగా ఉన్నది కేసీఆరేనని గుర్తు చేశారు. చీఫ్ వార్డెన్ జారీ చేసిన నోటీసు (నెం.752/సీడబ్ల్యూవో/హెచ్అండ్ఎం/ఓయూ/2023)నూ రేవంత్ పోస్ట్ చేశారు. అయితే ఈ నోటీసే ఫేక్ అంటూ బీఆర్ఎస్ ఆరోపించింది. చీఫ్ వార్డెన్ ఆనాడు జారీ చేసిన నోటీసులో నీటి, కరెంటు కొరత సమస్యలను ప్రస్తావించలేదంటూ మరో నోటీసును బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ 'ఎక్స్'లో షేర్ చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీ 'ఎక్స్' హ్యాండిల్‌లోనూ ఇదే ఒరిజినల్ అంటూ ఆ నోటీసును షేర్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పోస్ట్ చేసిన నోటీనూ షేర్ చేశారు.

సీఎం పోస్ట్ చేసిన నోటీసే నిజమైనది: చీఫ్ వార్డెన్

బీఆర్ఎస్ పోస్ట్ చేసిన కొత్త నోటీసు.. ఉస్మానియా యూనివర్సిటీ అధికారుల వద్దకు చేరింది. దీంతో ఓయూ చీఫ్ వార్డెన్ జి.శ్రీనివాస్‌ను విద్యార్థి సంఘాలు 'ఏది నిజం.. ఏది ఫేక్' అనే అంశంపై ఆరా తీశాయి. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో షేర్ చేసిన 2023 నోటీసు నిజమని, కేవలం సంతకం మినహా నోటీసు నెంబర్ కూడా పెన్నుతో రాయబోమని ఆయన స్పష్టం చేశారు. 2023 నాటి నోటీసు నెంబర్‌ను పెన్నుతో రాయడంతో పాటు నీటి, కరెంటు కొరత సమస్య ప్రస్తావించకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న నోటీసును కొందరు వ్యక్తులు సృష్టించినట్లుగా నిర్ధారించారు. ఫేక్ నోటీసును సృష్టించి ప్రచారం చేస్తూ ఉస్మానియా వర్సిటీ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఐపీసీ సెక్షన్ల 466, 468, 469, 505(1) కింద క్రిశాంక్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు ఓయూ విద్యార్థుల కోసం వేసవి సెలవుల్లో కూడా హాస్టళ్లు, మెస్ తెరిచే ఉంటాయని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ప్రకటించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వర్సిటీ అధికారుల నిర్ణయంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

కేసీఆర్ ఏనాడైనా ఓయూకు వెళ్లారా?: బల్మూరి

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఏనాడూ ఉస్మానియా వర్సిటీకి వెళ్లలేదని, విద్యార్థుల సమస్యలనూ పట్టించుకోలేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఓయూ సమస్యలపై తాము బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే వర్సిటీ బాధ్యతను తాను తీసుకుంటానని, బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మవద్దని ఓయూ విద్యార్థులకు సూచించారు. ఏ సమస్యలనైనా సీఎం, మంత్రులు వెంటనే పరిష్కరిస్తారని తెలిపారు. ఇదిలా ఉండగా.. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ ప్రతిష్ఠను దిగజార్చే విధంగా వైస్ చాన్సలర్ రవీందర్ వ్యవహరిస్తున్నారని ఓయూ జేఏసీ విద్యార్థి నాయకుడు కోట శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. వీసీని వెంటనే భర్తరఫ్ చేయాలని ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే పీఏ, ఆప్ నేత అరెస్టు

» ఫేక్ వీడియో కేసులో రేవంత్‌కు సమన్లా

» తెలంగాణ ప్రజలను అవమానించడమే

» ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫేక్ వీడియో కేసులో ఓ ఎమ్మెల్యే పీఏ, మరో ఆప్ నేత అరెస్టయ్యారు. ఇప్పటికే ఈ కేసులో గువాహటికి చెందిన అసోం కాంగ్రెస్ ఎన్నికల వార్‌రూమ్ సమన్వయకర్త సోమవారం రీతంసింగ్ అరెస్టవ్వగా.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సహా.. నలుగురు కాంగ్రెస్ నేతలకు ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. మంగళవారం మరో 12 మందికి నోటీసులు పంపారు. ఈ కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ పీఏ, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనుచరుడు సతీశ్‌వన్సోలాను, దావోద్ జిల్లా ఆప్ అధ్యక్షుడు ఆర్కే వారియాను అరెస్టు చేసినట్లు ఢిల్లీ సైబర్ సెల్ అధికారులు వెల్లడించారు. వీరిద్దరికీ వాట్సాప్ ద్వారా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా డీప్‌ఫేక్ వీడియో చేరిందని, వారు ఉద్దేశపూర్వకంగా ఆ వీడియను ఫేస్‌బుక్‌లో షేర్ చేశారని చెప్పారు. ఫేక్ వీడియోను ఎవరు ఎడిట్ చేశారనేదానిపై దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలో నిందితుడిని అరెస్టు చేస్తామని స్పష్టం చేశారు. తన పీఏ అరెస్టుపై ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ స్పందించారు. తన పీఏ పొరపాటున ఆ వీడియోలను షేర్ చేసి ఉంటారని అభిప్రాయపడ్డారు. ఆ వీడియో ఫేక్ అని అతనికి తెలిసి ఉండదన్నారు. బీజేపీనే చాలా కాలంగా ఫేక్ వీడియోలను వ్యాప్తి చేస్తోందని ఆరోపించారు. దానిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. ఫేక్ వీడియోను సృష్టించిన వారిని కాకుండా.. పొరపాటున షేర్ చేసిన వారిని అరెస్టు చేయడం సరికాదన్నారు.

రేవంత్ అంటే మోదీకి భయం: జైరాం రమేశ్

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అంటే ప్రధాని మోదీకి భయమని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. రేవంత్‌కు సమన్లు పంపడం అంటే.. తెలంగాణ ప్రజలను అవమానించడమేనని, ఇది నిష్పక్షపాతంగా జరగాల్సిన ఎన్నికలపై దాడేనని ఎక్స్‌లో ఆరోపించారు. "మాజీ ప్రధాని మన్మోహన్ ఫేక్ వీడియోలు బీజేపీ సృష్టించింది. ఆ వీడియోలను సర్క్యులేట్ చేస్తోంది. దీనిపై ఢిల్లీ పోలీసులు ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని ప్రశ్నించారు. మొదటి రెండు దశల ఎన్నికల్లో బీజేపీ పేలవమైన ప్రదర్శనతో నిరాశకు లోనై.. బీజేపీ అవకాశాలను దెబ్బతీస్తున్న రేవంత్‌ను ప్రధాని మోదీ భయపెడుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని తిరస్కరించే రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడం మోదీకి అలవాటేనని విమర్శించారు. .



5న ఎర్రవల్లికి రాహుల్

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. మే 5న జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ నేత రాహుల్, సీఎం రేవంత్ హాజరు కానున్నట్లు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ చెప్పారు. ఈ సభకు ప్రజలు పెద్ద ఎత్తున రావాలని ఆయన పిలుపునిచ్చారు. - ఎర్రవల్లి, ఆంధ్రజ్యోతి

సోయితప్పి మాట్లాడుతున్న కేసీఆర్: జి.నిరంజన్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బకు గురైన బాధితుని వలె కేసీఆర్ సోయితప్పి మాట్లాడుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ విమర్శించారు. విరిగిన తొంటి ఎముక ఇంకా సెట్ అయినట్టు లేదని, కూతురు కవితకు బెయిల్ దొరుకుతుందో లేదోననే ఆందోళనతో కేసీఆర్ మానసిక అనిశ్చితి స్థితిలో ఉన్నట్టుగా ఆయన మాటలు స్పష్టం చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో నిరంజన్ విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణను ఇచ్చింది కాంగ్రెస్ అని, కేసీఆర్ తేలేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలకు ముందుగా ఆయనపై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జ్ఞాన సుందర్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్లపై సీఎం రేవంత్ రెడ్డి మాటలకు మద్దతు ఇస్తున్నట్టు పేర్కొన్నారు.

సోషల్ మీడియాపై పోలీసుల నజర్

- ఎన్నికల వేళ వివాదాస్పద పోస్టులపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల వేళ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారంపై పోలీసు శాఖ దృష్టి సారించింది. రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు తమ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. సోషల్ మీడియా పోస్టుల వల్ల శాంతి భద్రతల సమస్యలు తలెత్తిన సందర్భాలు ఉండడమే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో ఇన్సిడెంట్ ఫ్రీ ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా పెట్టుకున్న పోలీసు శాఖ సోషల్ మీడియా పోస్టింగులపై నిఘా పెట్టేందుకు ప్రత్యేకంగా సోషల్ మీడియా మానిటరింగ్ సెల్స్ ఏర్పాటు చేస్తోంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టిన వారిని గుర్తించి, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, ఐటీ చట్టంలోని సెక్షన్ 67 కింద కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

7న ఖమ్మానికి హీరో వెంకటేశ్

- వియ్యంకుడు రఘురాంరెడ్డి తరపున ఎన్నికల ప్రచారం

ఖమ్మం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి మద్దతుగా సినీహీరో దగ్గుపాటి వెంకటేష్ మే 7 నుంచి ప్రచారంలో పాలుపంచుకోనున్నారు. రఘురాంరెడ్డికి వెంకటేశ్ స్వయాన వియ్యంకుడే. ఉమ్మడి రాష్ట్రంలో రామానాయుడు ఎంపీగా పోటీ చేసినప్పుడు తండ్రి కోసం వెంకటేష్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తాజాగా తన వియ్యంకుడికి కాంగ్రెస్ టికెట్ దక్కడంతో ఆయన విజయం కోసం వెంకటేష్ ఖమ్మంలో ప్రచారానికి రాబోతున్నట్లు రఘురాంరెడ్డి మరో వియ్యంకుడు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. షెడ్యూల్ ఇంకా ఖరారు కానప్పటికీ.. ఖమ్మం లోక్‌సభ పరిధిలో ప్రచారం చేస్తారని సమాచారం. రఘురాంరెడ్డికి ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు వినాయక్.. వెంకటేశ్ పెద్ద కుమార్తె ఆశ్రీతను, చిన్న కుమారుడు అర్జున్.. మంత్రి పొంగులేటి కుమార్తె సప్నిరెడ్డిని వివాహం చేసుకున్నారు.

మోదీ సర్కారుకు ఓటుతో బుద్ధి చెప్పాలి: పొన్నం

అక్కన్నపేట/హుస్నాబాద్ రూరల్/భీమదేవరపల్లి, ఏప్రిల్ 30: ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తామంటున్న ప్రధాని మోదీ ప్రభుత్వానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. మంగళవారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలో, హుస్నాబాద్ మండల పరిధిలో, హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగుల్లో ఆయన మాట్లాడారు. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. 400 ఎంపీ సీట్లు ఇవ్వాలని ప్రధాని మోదీ అడుగుతున్నారని, ఒకవేళ ఇస్తే రిజర్వేషన్లు రద్దు చేసి దేశ సంపద అంతా అదానీ, అంబానీలకు అప్పగిస్తారని ఆరోపించారు.

ముదనష్టంగా మోదీ పదేళ్ల పాలన: రాఘవులు

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పదేళ్ల పాలన ముదనష్టంగా ఉందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో 370 నుంచి 400 సీట్లు గెలుస్తామంటూ ఊదరగొట్టిన మోదీ ఇప్పుడు ఆ మాటలకు విరామం ఇచ్చి.. 'మంగళసూత్రాలు, ముస్లింలకు రిజర్వేషన్లు తీసేస్తారంటూ' రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో "బీజేపీ బందిఖానా నుంచి దేశాన్ని విముక్తి చేద్దాం" అనే పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పుస్తకావిష్కరణ అనంతరం ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్యను విద్యానగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి రాఘవులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

బీజేపీతో పొత్తు పెట్టుకోలేదనే కవిత అరెస్ట్: హరీశ్

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 30: బీజేపీతో పొత్తు పెట్టుకుంటే బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ కాకపోయేదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం రాత్రి సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో జరిగిన బీఆర్‌ఎస్ రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఒక్కటేనని, మాటలు తప్ప చేతలు లేవని విమర్శించారు. తెలంగాణ విభజన సమస్యలు ఇంకా మిగిలే ఉన్నాయని, పార్లమెంట్‌లో కొట్లాడాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారంతో తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.

బీజేపీ కక్ష సాధింపు చర్యలకు భయపడం: ఉత్తమ్

హైదరాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డికి ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేయడం బీజేపీ కక్ష సాధింపు చర్యేనని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఓటమి భయంలో ఉన్న బీజేపీ.. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ నేతలను పోలీసులు, ఈడీ, సీబీఐలతో బెదిరించాలని చూస్తోందని ఆరోపించారు. ఫేక్ వీడియోలు అంటూ నోటీసులు పంపుతున్నారని, సీఎం రేవంత్‌రెడ్డికి ఆ వీడియోలతో ఏం సంబంధమని ప్రశ్నించారు. బీజేపీ బెదిరింపులు, నోటీసులకు భయపడేది లేదన్నారు.

రేవంత్‌ను జైల్లో పెట్టాలనుకుంటున్నారు: నారాయణ

బీజేపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించిన ఢిల్లీ, ఝార్ఖండ్ సీఎంలను బీజేపీ ఇప్పటికే జైల్లో పెట్టిందని.. ఇప్పుడు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కూడా జైల్లో పెట్టాలని చూస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. అందుకే సీఎం రేవంత్‌కు ఢిల్లీ పోలీసులు నోటీసులిచ్చారన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌కు నోటీసులివ్వడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. రేవంత్‌ను అరెస్ట్ చేస్తే మోదీ పతనం మొదలైనట్టేనన్నారు.

విద్వేషంతోనే రేవంత్‌కు నోటీసులు: కూనంనేని

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 30: లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి భయంతో రాజకీయ విద్వేషంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డిపై ఢిల్లీ పోలీసులతో నోటీసులు ఇప్పించి, అరెస్టు చేసే కుట్ర చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం పెట్టిన పోస్టింగ్‌లకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, సీఎం ఎలా బాధ్యత వహిస్తారని ఖమ్మంలో ఆయన ప్రశ్నించారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ప్రధాని మోదీపై చర్యలు తీసుకోవాలి

- సీఈసీ రాజీవ్‌కుమార్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా అల్లాదుర్గంలో జరిగిన బహిరంగ సభలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన ప్రధాని నరేంద్రమోదీపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎన్నికల సమన్వయ కమిటీ ఛైర్మన్ జి.నిరంజన్ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు పంపిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రసంగంలో పండిట్ జవాహర్‌లాల్‌నెహ్రూ నుంచి రాహుల్ గాంధీ వరకు కాంగ్రెస్‌పై, పార్టీ నాయకులపై నిబంధనలు ఉల్లంఘించి వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో తెలిపారు. నిబంధనల మేరకు ఎన్నికల ప్రచారంలో కులాలను, మతాలను ప్రస్తావించకూడదని కాని మోదీ మాట్లాడుతూ తాను జీవించి ఉన్నంత వరకు ముస్లిం రిజర్వేషన్లను అనుమతించబోనన్నారని గుర్తుచేశారు. నెహ్రూ కుటుంబంపై ప్రధాని నిరాధారమైన ఆరోపణలు చేశారని నిరంజన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కేసీఆర్‌కు నో ఎంట్రీ

(మొదటిపేజీ తరువాయి)

మౌనంగా ఎందుకు ఉన్నారో చెప్పాలని ప్రశ్నించారు. అప్పట్లో.. 'పేదోళ్ల బిడ్డ అని, గుండో, అరగుండో అని బండికి ప్రజలు ఓటేశారని.. నిజామాబాద్ గుండుగానీ, కరీంనగర్ అరగుండు గానీ తెలంగాణకు తెచ్చింది ఏమీ లేదని విమర్శించారు. మోదీ జాతీయ ప్రాజెక్టు ఇవ్వలేదని, ఐటీఐఆర్, కారిడార్ ఇవ్వలేదని, రాష్ట్రానికి ఆయన ఇచ్చింది గాడిద గుడ్డు అని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన సభకు హాజరైన ప్రజలకు గాడిద గుడ్డు అన్ని రాసి ఉన్న ఓ వస్తువును చూపించారు. కర్ణాటకకు చెంబు, ఏపీకి మట్టి, చెంబెడు నీళ్లు ఇచ్చి తెలంగాణకు గాడిదగుడ్డు ఇచ్చారని ఎద్దేవా చేశారు. అయోధ్య రాముడి కల్యాణానికి 15 రోజుల ముందే ఊరూరా అక్షింతలు పంపిణీ చేశారని, కల్యాణం జరక్కముందే అక్షింతలు ఎక్కణ్నుంచి వచ్చాయని రేవంత్ ప్రశ్నించారు. హిందూ సంప్రదాయాలను దెబ్బతీసేలా ముందస్తుగా అక్షింతలను పంచి శ్రీరాముడిని అవమానించారని మండిపడ్డారు.దేవుడు గుడిలో, భక్తి గుండెల్లో ఉండాలని.. కానీ గుండు, అరగుండు బజార్లలో, బస్టాండ్లలో దేవుడి బొమ్మ పెట్టి చిల్లర పైసలు అడుక్కున్నట్లు ఓట్లను అడుక్కుంటున్నారని విమర్శించారు.

కాంగ్రెస్ ఇచ్చిన రిజర్వేషన్లను..

అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించిందని రేవంత్ గుర్తుచేశారు. బీజేపీ మళ్లీ గెలిస్తే దళితులు, గిరిజనులు, బీసీలపై సర్జికల్ స్ట్రైక్ చేసి రిజర్వేషన్లను రద్దు చేస్తుందని హెచ్చరించారు. రిజర్వేషన్లను ఎందుకు రద్దు చేయాలనుకుంటున్నారో ఈ గడ్డపైకి వస్తున్న మోదీ చెప్పాలని డిమాండ్ చేశారు. తన కోసం ఢిల్లీ పోలీసులు వస్తున్నారని.. పదేళ్లు కేసీఆర్ ఇదే విధంగా ఏసీబీ పోలీసులు, విజిలెన్స్‌తో తనను వేధించి కేసులు పెట్టి జైలుకు పంపిస్తే చివరి ఏమైందని.. నడుము విరిగి కేసీఆర్ మూలకుపడ్డారన్నారు. కేసీఆర్, కేటీఆర్ కారు ఖరాబైందని, షెడ్డుకు పోయిన ఆ కారు మళ్లీ రాదని, తూకం వేసి అమ్మాల్సిందేనని ఎద్దేవా చేశారు. మహబూబ్‌నగర్, చేవెళ్ల, మల్కాజిగిరి, భువనగిరి, జహీరాబాద్, కరీంనగర్, నిజామాబాద్ సీట్లలో బీజేపీని గెలిపించేలా.. ఖమ్మం, నల్లగొండ, మెదక్‌లో బీఆర్‌ఎస్‌ను గెలిపించేలా ఆ పార్టీల మధ్య చీకటి ఒప్పందం కుదిరిందని ఆరోపించారు. ఆగస్టు 15లోపు రైతులకు రుణమాఫీ చేస్తానని, వేములవాడ రాజన్న సాక్షిగా చెబుతున్నానన్నారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరారు.



ఎన్టీఆర్‌నగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో బాణం ఎక్కుపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి

అమిత్ షాకు కేసీఆర్ ఆవహించినట్టు..

వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతుగా భూపాలపల్లి జిల్లా రేగొండలో నిర్వహించిన జనజాతర సభలో పాల్గొన్న రేవంత్.. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉన్నా జయశంకర్ పుట్టిన గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా కూడా మార్చలేదని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి రాగానే దానిని నెరవేర్చామని గుర్తుచేశారు. రిజర్వేషన్ల రద్దుకు కేంద్రం చేస్తున్న కుట్ర గురించి ప్రశ్నిస్తే అమిత్‌షాకు కేసీఆర్ ఆవహించినట్టు ఉందని.. అందుకే కేసీఆర్ తరహాలో తనపై తప్పుడు కేసులు పెట్టి నిర్బంధించేందుకు, ఢిల్లీ పోలీసులను గాంధీభవన్‌కు పంపి అరెస్టు చేయించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గుజరాత్ పెత్తనమో, తెలంగాణ ప్రజల పౌరుషమో ఈ ఎన్నికలు తేల్చనున్నాయని అన్నారు. రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర ఈ గడ్డకుందని, ఢిల్లీ పోలీసులనే కాదు.. సరిహద్దుల్లో ఉన్న సైన్యాన్ని తెచ్చుకున్నా భయపడేదే లేదన్నారు. కడియం కావ్యను 2 లక్షల మెజారిటీతో గెలిపించాలని, వరంగల్‌ను అభివృద్ధి చేసే బాధ్యత తానే తీసుకుంటానని ప్రకటించారు. సీఎం సభ సందర్భంగా వేదికపై ఏర్పాటుచేసిన గాడిద గుడ్డు ఆకారం గురించి ప్రజలు విశేషంగా చర్చించుకున్నారు.

కేసీఆర్ తిట్లే మోదీ తిట్టారు..

చేవేళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి బాలాపూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్న రేవంత్.. రోజూ తనను కేసీఆర్ తిట్టే తిట్లనే మోదీ తిట్టారని, కేసీఆర్ స్పీచ్‌ను ఎత్తుకపోయి రఘునందన్‌రావు మోదీకిచ్చినట్లు తనకు అనుమానమున్నదని ఎద్దేవా చేశారు. బస్సుయాత్రలో కేసీఆర్ తాను చేసినది చెప్పుకోకుండా.. వంద రోజుల్లో రేవంత్ ఏమి చేయలేదని, అర్జెంట్‌గా తాను ముఖ్యమంత్రి కావాలంటున్నారని ధ్వజమెత్తారు. కానీ.. తాను వందలాది మంది పిల్లలను బలిచ్చి రాలేదని, ఉద్యమం ముసుగులో తెలంగాణను దోపిడీ చేసి రాలేదని మండిపడ్డారు. "అల్లాటప్పాగా రాలే బిడ్డా.. అనుకుంటే దిగడానికి.. ఏదో తమాషా అనుకుంటున్నావ్.. ఏడాది తిరిగే లోపు మళ్ల సీఎం అయితానని.. ఏడాది కాదు నీ జీవితంలో పదవనేదే లేదు. ఇక పదవిని కళ్లతో చూడలేవ"ని కేసీఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. డిసెంబరులో కేసీఆర్ ఓటమితో ఆట అయిపోలేదని.. ఫైనల్‌లో తెలంగాణ వర్సెస్ గుజరాత్ టీమ్ అని.. తెలంగాణ టీమ్‌కు రాహుల్, రేవంత్ కెప్టెన్ అయితే.. గుజరాత్ టీమ్‌కు మోదీ, అమిత్ షా కెప్టెన్‌లని సీఎం అన్నారు. ఈ ఆటలో గెలువలేనని మోదీకి తెలిసే.. రాష్ట్రానికి ఢిల్లీ పోలీసులను పంపారన్నారు. దాడులు చేసి, కేసులు పెట్టి వేధిస్తే కేసీఆర్‌కు పట్టిన గతే మోదీకి పడుతుందన్నారు. తెలంగాణోళ్లకు గాడిద గుడ్డు.. గుజరాత్‌కు బంగారు గుడ్డా? అని విమర్శించారు. "నన్ను తిట్టనీకి ఢిల్లీ నుంచి ఏడు విమానాల్లో రావాలా.? ఇక్కడ ఉన్న కేసీఆర్, మీ కిషన్‌రెడ్డి చేస్తున్నదదే కదా?" అని మోదీని ఉద్దేశించి రేవంత్ వ్యాఖ్యానించారు.

అనర్హత పిటిషన్ల నెపంతో రాజకీయం

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, వివేకానంద్ చేసింది ఇదే
- స్పీకర్‌కు పిటిషన్ సమర్పించి పది రోజులైనా కాలేదు
- ఇంతలోనే హైకోర్టును ఆశ్రయించడంతోనే వారి కుట్ర వెల్లడి
- దానం, తెల్లం, కడియంపై అనర్హతపై స్పీకర్‌కు ఆదేశాలివ్వాలన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్లపై ఏజీ వాదన

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్‌ను సమర్పించే నెపంతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ రాజకీయం చేసే ప్రయత్నం చేశారని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి హైకోర్టుకు తెలిపారు. మీడియా దృష్టిని ఆకర్షించడానికే వారు మద్దతుదారులను వెంటేసుకొని స్పీకర్ కార్యాలయానికి వెళ్లారని చెప్పారు. అందుకే స్పీకర్ వారిని కలవలేదని, కుట్రను తిప్పికొట్టారని పేర్కొన్నారు. స్పీకర్ వద్ద అనర్హత పిటిషన్లను సమర్పించి పది రోజులైనా గడవకముందే హైకోర్టును ఆశ్రయించారని, దీన్నిబట్టే కౌశిక్‌రెడ్డి, వివేకానంద్ కుట్ర అర్థం అవుతోందని వాదించారు. బీఆర్‌ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేలుగా గెలిచి పార్టీ మారిన దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిలపై అనర్హత వేటు వేయడంతో పాటు తమ పిటిషన్లను స్వీకరించేలా స్పీకర్‌కు, అసెంబ్లీ కార్యదర్శికి ఆదేశాలు జారీచేయాలన్న పిటిషన్లపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదిస్తూ.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వీలైనంత వేగంగా, 3 నెలలకు మించకుండా అనర్హత పిటిషన్లను పరిష్కరించేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ పిటిషనర్లు దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌లు స్పీకర్ కార్యాలయానికి చేరాయని, రశీదులు కూడా జారీ అయ్యాయని నివేదించారు. విచారణకు స్పీకర్‌కు తగిన సమయం ఇవ్వాలని, పిటిషన్లను కొట్టేయాలని ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. దానం తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరఘురాం వాదనలు వినిపించారు. అందరి వాదనలు విన్న ధర్మాసనం.. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు, ప్రభుత్వానికి, అసెంబ్లీ కార్యదర్శికి, ఈసీకి నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను జూన్ 5కు వాయిదా వేసింది.

రాహులే దేశానికి కాబోయే ప్రధాని

ఆయనంటే మోదీ, అమిత్‌షాలకు దడ..

- వారి ఆదేశాల మేరకే గాంధీ భవన్‌కు ఢిల్లీ పోలీసులు
- బీజేపీ జేబు సంస్థగా ఈసీ: జగ్గారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): దేశానికి కాబోయే ప్రధాని రాహుల్ గాంధీనేనని, ఆయన ప్రధాని అయితేనే దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జీవితాల్లోకి వెలుగులు వస్తాయని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. ఈ వర్గాలంతా రాహుల్‌గాంధీ వెంటే ఉన్నారన్న విషయం తెలిసి బీజేపీకి భయం మొదలైందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు తాము వ్యతిరేకం కాదంటూ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్.. మొదటిసారి చెప్పుకోవాల్సిన పరిస్థితి రాహుల్ గాంధీ వల్లనే వచ్చిందని చెప్పారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని ప్రజలు నిర్ణయించుకున్నారని, దీంతో మోదీ, అమిత్‌షాలో దడ మొదలైందని, అందుకే గాంధీ భవన్‌కు ఢిల్లీ పోలీసులను పంపారన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. అబద్ధాలను కూడా నిజం అనట్లుగా మాట్లాడి గోబెల్స్ ప్రచారానికి మోదీ పూనుకున్నారని, పదేళ్ల ప్రధానిగా ఉన్న ఆయన అబద్ధాలు ఆడటం భావ్యమా అని ప్రశ్నించారు. "తాళిబొట్లు తెంచి ముస్లింలకు ఇస్తారంటూ.. ప్రధాని హోదాలో ఉన్న మోదీ చెప్పడం దారుణం. ఆయన వ్యాఖ్యలకు ఆధారం ఏదైనా ఉందా? చూపిస్తే నేను ముక్కు నేలకు రాస్తా! లేదంటే మీరు ముక్కు నేలకు రాయాలి" అంటూ బీజేపీ నేతలకు సవాల్ విసిరారు. మోదీ అబద్ధాలు మాట్లాడుతుంటే ఎన్నికల కమిషన్ ఏం చేస్తుందని నిలదీశారు. ఈసీ ఒక డమ్మీగా, బీజేపీ జేబు సంస్థగా మారిందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డిని తిడితేనే టీవీల్లో చూపిస్తరని చెప్పి.. హరీశ్ రావు రేవంత్‌పైన ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నరని ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు. కేసీఆర్ మాటలకు విలువ లేకుండా పోయిందన్నారు. కాకతీయ, ఉస్మానియా వర్సిటీలను ఆయన ఏనాడైనా సందర్శించారా అని ప్రశ్నించారు. ఆ వర్సిటీను సందర్శించాక తమను ప్రశ్నలు అడగాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు పుట్టు శత్రువులంటూ మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాంగ్రెస్ రాజకీయం ముందు బీజేపీ బచ్చా అని ఆయన అన్నారు.





మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి; జగ్గారెడ్డి, చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న వనపర్తి బీఆర్‌ఎస్ నేత శాంతయ్య తదితరులు

ఈడీ, ఐటీని దించండి

'ఆర్‌ఆర్ ట్యాక్స్' నిజమైతే రేవంత్‌పై దర్యాప్తు చేయించండి

- మోదీ సర్కార్‌కు కేసీఆర్ డిమాండ్
- స్వతంత్ర వ్యవస్థలన్నీ కేంద్రం అధీనంలోకి అని ధ్వజం

కొత్తగూడెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతంలోని గోదావరి నదీ జలాలను తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కుట్రలు చేస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణలో 'ఆర్‌ఆర్ ట్యాక్స్'ను వసూలు చేస్తున్నారంటూ మోదీ అన్నారని.. అదే నిజమైతే ఈడీ, ఐటీ అధికారులతో సీఎం రేవంత్ రెడ్డిపై దర్యాప్తు జరిపిస్తారా? అని ప్రశ్నించారు. దేశంలో గత పదేళ్లుగా మోదీ దుర్మార్గమైన పాలన కొనసాగించారని ఆరోపించారు. స్వతంత్రంగా వ్యవహరించే వ్యవస్థలన్నింటినీ కేంద్ర సర్కారు తన అధీనంలోకి తెచ్చుకొని ఇష్టారీతిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలతో అరచేతిలో వైకుంఠం చూపి, ఓట్లు కొల్లగొట్టి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీల కథ ముగిసిపోయిందని.. లోక్‌సభ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు ఓట్లు వేస్తే.. గోదావరిలో వేసినట్లేనని చెప్పారు. ఎన్నికల్లో.. అటు కేంద్రంలో ఉన్న బడాభాయ్‌ని, రాష్ట్రంలో ఉన్న చోటాభాయ్‌ని ఓడించాలని పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి కొత్తగూడెంలో నిర్వహించిన రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ ప్రసంగించారు. పాలన సౌలభ్యం కోసం రాష్ట్రంలో జిల్లాలను తాము పెంచామని.. అయితే ఆ పెంచిన జిల్లాలను తీసేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా రేవంత్ ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రైతుబంధు వచ్చిందా? కల్యాణ లక్ష్మి వచ్చిందా? తులం బంగారం అన్నారు.. ఇచ్చారా? మహిళలకు రూ.2,500 వస్తున్నాయా? రూ.2లక్షల రుణం మాఫీ చేశారా?.. అని ప్రజలను ప్రశ్నించారు. రాష్ట్రంలో సాగు కోసం 24 గంటల విద్యుత్తు ఇవ్వడం లేదని, తమ హయాంలో రెప్పపాటు కూడా కరెంట్ పోలేదని పేర్కొన్నారు. రైతుల పొలాలు ఎండిపోతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ రావడం లేదని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటుచేసి, ఆటోవాలాల బతుకులను ఛిద్రం చేశారని, వారు ఆత్మహత్య చేసుకునే స్థాయికి పరిస్థితిని తీసుకొచ్చారని విమర్శించారు. సింగరేణి బొగ్గుబావులను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం కుట్ర పన్నిందని, దీన్ని తాము వ్యతిరేకించి పోరాటం జరపడం ద్వారా సింగరేణి సంస్థను కాపాడామని చెప్పారు. అన్ని రకాలుగా సింగరేణి కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేశామని పేర్కొన్నారు. స్థానిక రైతాంగం కోసం సీతారామప్రాజెక్టును అద్భుతంగా నిర్మించామని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను గెలిపిస్తే వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెడతారని హెచ్చరించారు. కాగా యాత్ర సందర్భంగా కొత్తగూడెంలో కేసీఆర్ బస్సు పై నుంచి కిందపడబోయారు. గుర్తించిన సిబ్బంది కేసీఆర్‌ను పట్టుకోవడంతో ప్రమాదం తప్పింది. కార్నర్ మీటింగ్ అనంతరం కొత్తగూడెంలోని ఇల్లెందు అతిథి గృహంలో రాత్రి బసచేశారు. బుధవారం ఉదయం కొత్తగూడెం నుంచి కేసీఆర్ మహబూబాబాద్ నియోజకవర్గానికి వెళ్లనున్నారు. కాగా సోమవారం రాత్రి ఖమ్మంలో బస చేసిన కేసీఆర్, సీపీఐ సీనియర్ నేత పువ్వాడ నాగేశ్వరరావు ఇంటికి వెళ్లారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను కేసీఆర్ పరామర్శించారు.



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

డబుల్ ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తుంటే మీరేం చేస్తున్నారు మోదీ జీ?

- చూసీచూడనట్లు వదిలేస్తే రేపొద్దున డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పాటుకు సహకరిస్తారనే ఛోటాభాయ్‌ను క్షమిస్తున్నారా?
- కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి, మోదీది ఒకేమాట : కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణలో ఛోటాభాయ్ (రేవంత్‌రెడ్డి) అక్రమంగా డబుల్‌ఆర్ టాక్స్ వసూలు చేస్తుంటే.. కేంద్రంలో అధికారంలో ఉన్న మీరేం చేస్తున్నారు? మోదీ జీ' అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మోదీ తన ప్రసంగంలో డబుల్ ఆర్ ట్యాక్స్ అని పేర్కొనడంపై మంగళవారం ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందించారు. 'మీ రాజకీయ ప్రత్యర్థులపై.. కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నారు.. మరి ఛోటాభాయ్ నిర్వాకాన్ని ఎందుకు క్షమిస్తున్నారు? ఇప్పుడు డబుల్ ఆర్ ట్యాక్స్ వసూళ్లను చూసీ చూడనట్టు వదిలేస్తే.. రేపు డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పాటుకు మీకు సహకరిస్తాడనేనా?' అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా.. బడే భాయ్ మోదీది, ఛోటాభాయ్ రేవంత్‌ది ఒకే మాట ఒకే బాట అంటూ ఎద్దేవా చేశారు. ఒకరు ప్రాజెక్టును బలిచేయాలని చూస్తుంటే. మరొకరు తమిళనాడు కోసం తాకట్టుపెట్టాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దెబ్బతీసే ఈ ఫెవికాల్ బంధంపై యుద్ధానికి తెలంగాణ సమాజం సిద్ధమైందని పేర్కొన్నారు. 'గోదావరి జలాలను తరలించుకుని పోవాలనే కాళేశ్వరంపై ఈ కక్ష., మీకు, మీ కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ రైతులపై ఎందుకీ వివక్ష. లోక్‌సభ ఎన్నికల వేళ తెలంగాణకు వచ్చారు.. అదే పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలకు పాతరేశారు' అని ఆరోపించారు. తెలంగాణకు విభజన చట్టం తాలూకు హక్కులను ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అత్యున్నత చట్టసభలో ఇచ్చిన హామీలకే దిక్కులేకపోతే.. సభల్లో బీజేపీ వాగ్దానాలను ప్రజలెలా విశ్వసిస్తారు? అని నిలదీశారు. అవినీతిపరులకు బీజేపీని కేరాఫ్‌గా మార్చారని, ప్రత్యర్థులపై కక్షగట్టి పెడుతున్న కేసులను.. ఎలాంటి ఆధారాలు లేకుండా చేస్తున్న అక్రమ అరెస్టులను.. యావత్ భారత సమాజం గమనిస్తోందని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో దేశం ఎమర్జెన్సీని చూసిందని, ఇప్పుడు బీజేపీ హయాంలో అనధికార ఎమర్జెన్సీని చవిచూస్తోందన్నారు.

కుబేరుల కదనం!

చేవెళ్లలో శ్రీమంతుల మధ్య త్రిముఖ పోరు

రంజిత్‌రెడ్డికి అసంతృప్త నేతల తలపోటు

గెలవాలనే 'సంకల్పం'తో విశ్వేశ్వర్‌రెడ్డి పట్టు

బీసీ కార్డుతో పావులు కదుపుతున్న కాసాని

మూడొంతులు పట్టణ ప్రాంతం.. సెటిలర్లు కీలకం

ఆ ముగ్గురూ శ్రీమంతులు! వందల కోట్లకు పడగలెత్తిన కుబేరులు! ఎన్నికల సందర్భంగా సమర్పించిన అఫిడవిట్ల ప్రకారం చూస్తే.. రాష్ట్రవ్యాప్తంగా బరిలో ఉన్న అభ్యర్థుల్లోనే సంపన్నులు! చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ బరిలో నువ్వా నేనా అన్నట్లు తలపడుతున్నారు! మరి, అత్యధిక ఓట్లు సాధించి అధ్యక్షా! అనేదెవరో!?

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

హైదరాబాద్‌ను ఆనుకుని ఉండే చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం కాస్త విభిన్నం! ఇక్కడ మూడింట రెండొంతులు పట్టణ ప్రాంతమైతే.. మిగిలినది గ్రామీణం! ఓటర్లలోనూ అత్యధికులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడినవారు! వారిలో ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఉత్తరాది నుంచి వచ్చిన వారు ఉన్నారు! ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్‌కు దాదాపు లక్ష ఓట్లు అధికంగా రాగా.. బీజేపీ గణనీయంగా మూడు లక్షలకుపైగా ఓట్లు సాధించింది! అందుకే, ఇక్కడ లోక్‌సభ ఎన్నికల్లో ముక్కోణ పోరు సాగుతోంది! హ్యాట్రిక్ కొట్టాలని బీఆర్ఎస్.. పూర్వ వైభవానికి కాంగ్రెస్.. ఖాతా తెరవాలని బీజేపీ పోటీ పడుతున్నాయి. సంక్షేమ, అభివృద్ధి మంత్రాన్ని కాంగ్రెస్.. మోదీ గ్యారెంటీలను బీజేపీ.. బీసీ కార్డును బీఆర్ఎస్ నమ్ముకున్నాయి. ఇక్కడ పాగా వేసేందుకు ప్రధాన పార్టీలు అపర కుబేరులను రంగంలోకి దింపాయి. పౌల్ట్రీ వ్యాపారవేత్త, సిటింగ్ ఎంపీ రంజిత్ రెడ్డిని కాంగ్రెస్.. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని బీజేపీ.. మాజీ జడ్పీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్‌ను బీఆర్ఎస్ బరిలోకి దింపాయి.

కాంగ్రెస్‌లో కంగాళీ

కాంగ్రెస్‌ను చేవెళ్లలో అసంతృప్తుల బెడద వెంటాడుతోంది. అభ్యర్థి ఎంపిక విషయంలో చివరి వరకూ తర్జనభర్జనలు పడిన కాంగ్రెస్ చివరకు బీఆర్ఎస్ సిటింగ్ ఎంపీ రంజిత్ రెడ్డిని తీసుకొచ్చి టికెట్ ఇచ్చింది. నిజానికి, ఆయన కంటే ముందే పార్టీలో చేరిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, ఆయన భార్య, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి చేవెళ్ల టికెట్ ఇస్తామని హామీ ఇచ్చింది. దీంతో ఆమె ప్రచారం కూడా మొదలుపెట్టారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ తదితరులు కూడా ఈ సీటు ఆశించారు. కానీ, అనూహ్యంగా రంజిత్‌రెడ్డికి టికెట్ ఇచ్చి సునీతకు మల్కాజిగిరి కేటాయించారు. అయితే, రంజిత్ రెడ్డికి టికెట్ ఇవ్వడాన్ని కాంగ్రెస్ సీనియర్లు కొందరు ఇంకా జీర్ణించుకోవడం లేదు. అసంతృప్త నేతలను దారికి తెచ్చుకునే విషయంలో కాంగ్రెస్ నాయకత్వంతో పాటు రంజిత్ రెడ్డి కూడా ఇంకా పూర్తిస్థాయిలో సఫలం కాలేదు. ప్రచారంలో కొందరు అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు. కొన్నిచోట్ల బహిరంగంగానే ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రశ్నించడం గమనార్హం. నిన్నమొన్నటి వరకు కాంగ్రెస్ కేడర్‌పై కేసులు పెట్టిన వారిని తీసుకొచ్చి ఇప్పుడు వారి తరపున ప్రచారం చేయమంటే ఎలా చేస్తామని ప్రశ్నిస్తున్నారు. అసంతృప్త నేతలను పార్టీ నేతలు బుజ్జగించే యత్నాలు చేస్తున్నారు. చేరికలూ గందరగోళంగా మారాయి. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమై వెనక్కి వెళ్లిపోయారు. పార్టీలో చేరాలనుకుంటున్న నాయకుల భవిష్యత్తుకు హామీ ఇచ్చేవారు.. పార్టీలోని సీనియర్లకు నచ్చచెప్పి భరోసా ఇచ్చేవారు లేకపోయారు.





ఉమ్మడి జిల్లాలో కొంత పట్టున్న మహేందర్ రెడ్డి పూర్తిస్థాయిలో మల్కాజిగిరిపైనే దృష్టి కేంద్రీకరించారు. ఈ నేపథ్యంలోనే, నిన్నమొన్నటి వరకు చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడ గెలుపును సవాల్‌గా తీసుకుని పని చేస్తున్నారు.

కమలం.. కదనం!

బీజేపీ తన అభ్యర్థిని ఎంతో ముందుగానే ప్రకటించింది! దాంతో, ఆ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అందరి కంటే ముందే ప్రచారం ప్రారంభించారు. తాజా రాజకీయ పరిస్థితులను తనకు అనుకూలంగా మలచుకుంటూ దూసుకుపోతున్నారు. నిజానికి, ఈ పార్లమెంటు పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో నాలుగు బీఆర్ఎస్, మూడు కాంగ్రెస్ గెలిచాయి. బీజేపీ ఒక్క సీటు కూడా గెలవలేదు. అప్పటి పరిస్థితులతో పోలిస్తే పూర్తి భిన్నమైన వాతావరణం ఇప్పుడు నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచిన కాషాయ పార్టీ ఇప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు సవాల్ విసురుతోంది. విశ్వేశ్వర్ రెడ్డి వ్యూహాత్మకంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. భారీ బహిరంగ సభలు కాకుండా క్షేత్రస్థాయికి వెళ్లి ఆయా వర్గాలతో వేర్వేరుగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గంలో ఏమేం చేస్తానో చెబుతూ 'చేవెళ్ల సంకల్ప పత్రాన్ని' విడుదల చేశారు. నియోజకవర్గవ్యాప్తంగా 3,700 కిలోమీటర్ల మేర తాను చేసిన ప్రజా ఆశీర్వాద యాత్రలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ఇందులో సంకల్పం చెప్పుకొన్నారు. ప్రధాని మోదీ పేరునే ప్రధాన ప్రచారాస్త్రంగా మలచుకుని ఓట్లు అడుగుతున్నారు. ఆయన గెలుపు కోసం బీజేపీ కేడర్‌తో పాటు ఆ పార్టీ అనుబంధ సంస్థలు చాప కింద నీరులా పనిచేస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో పార్టీకి సానుకూల పరిస్థితులు ఉండడంతో గ్రామీణ ప్రాంతాలపై బీజేపీ ఎక్కువ ఫోకస్ పెడుతోంది. ఇక, విశ్వేశ్వర్ రెడ్డి భార్య, అపోలో ఆస్పత్రుల జేఎండీ సంగీతారెడ్డి కాలనీ అసోసియేషన్లు, మహిళా సంఘాలతో ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. ప్రచారంలోకి జాతీయ నాయకులను కూడా రంగంలోకి దింపాలని బీజేపీ నిర్ణయించింది. త్వరలో ప్రధాని మోదీ కూడా నియోజకవర్గంలో పర్యటించనున్నారు.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికెన్ని ఓట్లు!?



పార్టీ	ఓట్లు
బీఆర్ఎస్ (కారు)	7,07,456
కాంగ్రెస్ (హస్తం)	6,09,522
బీజేపీ (కమలం)	3,35,504

సెటిలర్స్ ఓట్లే కీలకం

చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో మూడు సెగ్మెంట్లు హైదరాబాద్‌లో అంతర్భాగంగా ఉండగా మిగతా నాలుగు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. వీటిలో దాదాపు 65 శాతం పట్టణ ఓటర్లే. వీరిలో అత్యధికులు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడినవారే. గెలుపోటములను శాసించే స్థితిలో ఉండడంతో వీరి ఓట్లు కీలకంగా మారాయి.

పురుషులు	15,04,260
మహిళలు	14,33,830
ఇతరులు	280
మొత్తం ఓటర్లు	29,38,370

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సెగ్మెంట్ ఎవరికి!?

పార్టీ	సెగ్మెంట్లు
బీఆర్ఎస్	చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం
కాంగ్రెస్	తాండూరు, వికారాబాద్, పరిగి

2019 లోక్‌సభ ఎన్నికల్లో..



పార్టీ	అభ్యర్థి	ఓట్లు
బీఆర్ఎస్	జి.రంజిత్ రెడ్డి	5,28,148
కాంగ్రెస్	కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	5,13,831
బీజేపీ	బి.జనార్దన్ రెడ్డి	2,01,960

బీఆర్ఎస్ బీసీ కార్డు ఫలించేనా?

సిటింగ్ సీటును కాపాడుకునేందుకు బీఆర్ఎస్ తంటాలు పడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో 4 సెగ్మెంట్లలో గెలవడమే కాకుండా లక్షకుపైగా ఓట్లను అధికంగా సాధించిన ఈ పార్టీ.. పార్లమెంటు ఎన్నికల్లో తొలి నుంచీ గడ్డు పరిస్థితులనే ఎదుర్కొంటోంది. సిటింగ్ ఎంపీ రంజిత్ రెడ్డికే టికెట్ ఇచ్చిన తర్వాత ఆయన కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయారు. ఆయనతోపాటు కొంతమంది ముఖ్య నేతలు కూడా అదే బాట పట్టారు. బీసీల్లో కొంత పట్టున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను బీఆర్ఎస్ బరిలోకి దింపింది. తద్వారా ఇక్కడ బీసీ కార్డును ప్రయోగిస్తోంది. ఉమ్మడి జిల్లాలో మంచి పట్టు ఉండడంతో సబితారెడ్డికి బాధ్యతలను అప్పగించారు.

◆ ముంజ కొట్టగలవా..!?



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పందిళ్ల వద్ద తాటి వనంలో ముంజలు తీసి.. ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావుకు ఇస్తున్న మంత్రి పొన్నం

34 మంది ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో నేర చరితులు

16 మంది డిగ్రీ కంటే తక్కువ విద్యార్హతలున్నవారే

10 కోట్ల కంటే ఎక్కువ ఆస్తులున్నవారు 34 మంది: ఎఫ్‌జీజీ

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు పోటీ చేస్తున్న నాలుగు ప్రధాన పార్టీల నుంచి మొత్తం 53 మంది బరిలో ఉంటే.. వారిలో 34 మంది నేరచరితులేనని 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ)' తెలిపింది. కాంగ్రెస్ అభ్యర్థుల్లో 12 మంది, బీజేపీలో 12, బీఆర్ఎస్ 9, మజ్లి‌స్‌కు చెందిన ఒక అభ్యర్థిపై కేసులు ఉన్నాయి. వీరికి సంబంధించిన పలు వివరాలను ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, మజ్లిస్ పార్టీలకు చెందిన 53 మంది అభ్యర్థుల అఫిడవిట్లను పరిశీలించి, వారి నేర చరిత్ర, ఆస్తులు, విద్యార్హతలను తెలుసుకున్నామని తెలిపారు. 17 స్థానాలకు మొత్తం 525 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. సికింద్రాబాద్ నుంచి అత్యధికంగా 45 మంది పోటీ పడుతుండగా.. ఒక్కో నియోజకవర్గానికి సగటున 30 మంది పోటీలో ఉన్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు 24 మంది, గ్రాడ్యుయేట్లు 12 మంది ఉండగా.. గ్రాడ్యుయేషన్ కంటే తక్కువ విద్యార్హతలున్నవారు 16 మంది ఉన్నారు. రూ.10 కోట్ల కంటే ఎక్కువ ఆస్తి కలిగినవారు కాంగ్రెస్ నుంచి 11 మంది, బీజేపీ నుంచి 12 మంది, బీఆర్ఎస్ నుంచి 10 మంది, మజ్లిస్ నుంచి ఒకరు ఉన్నారు. కాంగ్రెస్ ముగ్గురు మహిళలకు టికెట్లు ఇవ్వగా.. బీజేపీ ఇద్దరు, బీఆర్ఎస్ ఇద్దరికి ఇచ్చాయి.

◆ ఇటు.. ఇటు..



కేపీహెచ్‌బీలో మెట్రో రైలులో ప్రచారం చేసిన తర్వాత బైక్ ర్యాలీలో భాగంగా బుల్లెట్ ఎక్కిన మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ దానిపై నుంచునే ప్రయాణిస్తున్న దృశ్యం.

ఓట్లలో సగం!

13 నియోజకవర్గాల్లో పైచేయి.. వారి ప్రసన్నానికి అభ్యర్థుల కసరత్తు



హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకం కాబోతున్నారు. ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటములను నిర్ణయించేదీ వారే. మొత్తం ఓటర్లలో సగానికి సగం మహిళలే. కొన్ని నియోజక వర్గాల్లో అయితే పురుషుల కంటే మహిళలే ఎక్కువ కూడా. రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. ఏకంగా 13 నియోజకవర్గాల్లో అతివల ఓట్లే అధికంగా ఉన్నాయి. దాంతో, తమ గెలుపు ఖాయం కావాలంటే మహిళల ఓట్లు పడాల్సిందేనని అన్ని పార్టీల అభ్యర్థులూ భావిస్తున్నారు. వారిని ప్రసన్నం చేసుకునేందుకు పార్టీలు, అభ్యర్థులు పావులు కదుపుతున్నారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తున్నారు. కుటుంబ సభ్యులను రంగంలోకి దింపి మరీ అతివల ఓట్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వారు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్నారు. మహిళలకు బొట్టు పెట్టి మరీ తమకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

రాష్ట్రంలో మహిళా ఓటర్లు 50.27%



మహిళలు	1,66,51,235
పురుషులు	1,64,67,293
ట్రాన్స్‌జెండర్స్	2,751
మొత్తం	3,31,21,279

ఆ 13 స్థానాలూ ఇవే..!

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఎక్కువ
నిజామాబాద్	8,04,455	8,96,774	92,319
ఖమ్మం	7,85,123	8,41,174	56,051
కరీంనగర్	8,74,513	9,16,238	41,725
ఆదిలాబాద్	8,03,736	8,43,859	40,123
జహీరాబాద్	8,00,841	8,38,333	37,492
మహబూబాబాద్	7,46,982	7,83,280	36,298
నల్లగొండ	8,43,726	8,79,087	35,361
వరంగల్	8,93,912	9,26,767	32,855
మెదక్	9,00,446	9,24,027	23,581
పెద్దపల్లి	7,86,390	8,07,015	20,625
మహబూబ్‌నగర్	8,31,089	8,48,815	17,726
భువనగిరి	8,97,219	9,08,632	11,413
నాగర్ కర్నూలు	8,63,775	8,72,004	8,229

ఇక్కడ పురుష ఓటర్లదే పైచేయి: మల్కాజ్‌గిరి, హైదరాబాద్, సికింద్రాబాద్, చేవెళ్ల

మూడో వంతులోనూ మూడో వంతే!



లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు టికెట్లు ఆరే.. కాంగ్రెస్-3, బీజేపీ-2, బీఆర్ఎస్ ఒక్కటే

» 2014లో ఒక్కరు.. 2019లో ఐదుగురికి చాన్స్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మహిళ అధినేతగా ఉన్న పార్టీ ఒకటి! మహిళలకు పార్లమెంటులో 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చట్టం చేసిన పార్టీ మరొకటి! మహిళా రిజర్వేషన్ల కోసం పోరాటం చేసిన పార్టీ ఇంకొకటి! అన్ని పార్టీలూ మహిళలకు రిజర్వేషన్‌పై పలవరించినవే! పార్లమెంటు ఎన్నికలు వచ్చేసరికి వాటి అసలు రంగు బయటపడిపోయింది! మహిళలకు 33 శాతం కాదు కదా.. అందులో మూడో వంతు కూడా ఇవ్వలేదు! అన్ని పార్టీలూ కలిపి వారి కోటాలో మూడో వంతు ఇచ్చాయంతే! రాష్ట్రంలో 17 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. ఒక్కో పార్టీ ఆరుగురి చొప్పున మహిళలకు అవకాశం ఇవ్వాలి. మూడు ప్రధాన పార్టీల నుంచి మొత్తం 18 మంది పోటీలో ఉండాలి. కానీ, మూడు పార్టీలూ కలిపి ఎంత మందికి అవకాశం ఇచ్చాయో తెలుసా! కేవలం ఆరుగురికి! వీరిలోనూ.. కాంగ్రెస్ పార్టీ ముగ్గురికి టికెట్ ఇవ్వగా.. బీజేపీ ఇద్దరిని బరిలోకి దించింది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేననే డిమాండ్‌ను భుజానికెత్తుకున్న బీఆర్ఎస్ కేవలం ఒక్కరికి మాత్రమే టికెట్ ఇచ్చింది. కాంగ్రెస్ నుంచి ఆదిలాబాద్‌లో ఆత్రం సుగుణ, మల్కాజ్‌గిరిలో పట్నం సునీతా మహేందర్ రెడ్డి, వరంగల్‌లో కడియం కావ్యకు అవకాశం ఇవ్వగా, మహబూబాబాద్ స్థానం నుంచి సిటింగ్ ఎంపీ మాలోత్ కవితకే బీఆర్ఎస్ మరోసారి టికెట్ ఇచ్చింది. హైదరాబాద్ స్థానం నుంచి కొంపెల్లి మాధవీలత, మహబూబ్‌నగర్ నుంచి మరోసారి డీకే అరుణకు బీజేపీ టికెట్లు ఇచ్చింది. కాకపోతే.. 2014 నుంచి సంఖ్యాపరంగా పరిశీలిస్తే మాత్రం మొత్తంగా మహిళలు పోటీ చేసే స్థానాలు పెరిగాయి. 2014లో ఒకే ఒక్కరికి బీఆర్ఎస్ అవకాశం ఇవ్వగా.. 2019లో ఐదుగురికి మూడు పార్టీలూ కలిపి టికెట్లు ఇచ్చాయి.

జాతీయ స్థాయిలోనూ తీసికట్టు!

> తొలి 2 దశల్లో 8 శాతమే
>
> 33% టికెట్లిస్తున్న ఏకైక పార్టీ బీజేడీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: మహిళా సాధికారత గురించి రాజకీయ పార్టీలు చేసే ప్రకటనలకు, ఇచ్చే టికెట్లకు పొంతన ఉండటం లేదు. ఎన్నికల్లో మహిళలకు అంతంత మాత్రంగానే ప్రాతినిధ్యం కల్పిస్తున్నాయి. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పటి వరకు జరిగిన రెండు దశల ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థుల్లో మహిళలు 8 శాతం మాత్రమే. తొలి దశలోని 135 మంది మహిళా అభ్యర్థుల్లో అత్యధికంగా తమిళనాడులోనే 76 మంది ఉండటం విశేషం. రెండో దశ ఎన్నికల్లో గరిష్ఠంగా కేరళలో 24 మంది మహిళా అభ్యర్థులున్నారు. రెండు దశల్లో కలిపి బీజేపీ 69, కాంగ్రెస్ 44 మంది మహిళా అభ్యర్థులకు టికెట్లు ఇచ్చాయి. బీజేపీ, కాంగ్రెస్ తమ ఎన్నికల మేనిఫెస్టోల్లో మహిళల కోసం ఎన్నో వాగ్దానాలు చేశాయి. మహిళా రిజర్వేషన్ చట్టం అమలు, సేవా రంగంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు భాగస్వామ్యం తదితర హామీలను బీజేపీ మేనిఫెస్టోలో పెట్టగా, మహిళల సాధికారతకు చట్టపరమైన సంస్కరణలు, సత్వరమే మహిళా రిజర్వేషన్ చట్టం తదితర హామీలను కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచింది. అయితే, ఈ నిబద్ధతను మహిళలకు టికెట్లు కేటాయించే విషయంలో చూపలేదు. ఒడిసాకు చెందిన బీజూ జనతా దళ్ (బీజేడీ) మాత్రమే తమ పార్టీ విధానంలో భాగంగా మహిళలకు ఎన్నికల్లో 33 శాతం టికెట్లు కేటాయిస్తోంది.

> ఈనెల 19న జరిగిన తొలి దశ ఎన్నికల్లో 1,625 మంది అభ్యర్థులు పోటీ చేయగా, వారిలో మహిళలు 135 మంది మాత్రమే. ఈనెల 26న జరిగిన రెండో దశ ఎన్నికల్లో 1,198 మంది పోటీ చేయగా, వారిలో మహిళలు వంద మంది మాత్రమే. రెండు దశల్లోనూ కలిపి 2,823 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, వారిలో మహిళలు 235 మంది మాత్రమే.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ నుంచి పార్లమెంటులో అడుగు పెట్టిన మహిళా ఎంపీలు కేవలం ఇద్దరే ఇద్దరు! 2014లో కల్వకుంట్ల కవిత! 2019లో మాలోతు కవిత! ఒక్కో ఎన్నికలో ఒక్కొక్కరు మాత్రమే గెలిచి లోక్‌సభకు వెళ్లారు! మరి, అంతకు ముందు పరిస్థితి ఏమిటి!? తెలంగాణలోని ఏ నియోజకవర్గాలు కనీసం ఒక్కసారైనా మహిళలను లోక్‌సభకు పంపాయి!? ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా మహిళలను గెలిపించని నియోజకవర్గాలు ఏవి!? ఈ ప్రశ్నలకు సమాధానం ఆసక్తికరం. ప్రస్తుతం ఉన్న వాటిలో ఏకంగా పది నియోజకవర్గాల నుంచి కనీసం ఒక్కరంటే ఒక్కరు కూడా మహిళలు పార్లమెంటుకు వెళ్లలేదు. కేవలం ఏడు నియోజకవర్గాల నుంచి ఒకరో ఇద్దరో గెలిచారు. అంటే.. కనీసం సగం నియోజకవర్గాల నుంచి కూడా మహిళా ప్రాతినిధ్యం లేదన్నమాట! ఇంకా చెప్పాలంటే.. కొన్ని నియోజకవర్గాల్లో ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి వరకూ మహిళలకు పోటీ చేయడానికి అవకాశం కూడా ఇవ్వలేదు! కరీంనగర్ పార్లమెంటులో 1952లో కాంగ్రెస్ పార్టీ టీఎన్ సదాలక్ష్మికి టికెట్ ఇచ్చింది. ఆమె పరాజయం పాలయ్యారు. కానీ, ఆనాటి నుంచి ఈనాటి వరకూ ఏ ప్రధాన పార్టీ మహిళలకు మళ్లీ అవకాశం కల్పించలేదు. లోక్‌సభలో అధ్యక్షా అనే అవకాశం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు ఒక్క మహిళా నేతకూ దక్కలేదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు పూర్వపు నల్లగొండ, మిర్యాలగూడ స్థానాల నుంచి గానీ, ప్రస్తుతం ఉన్న నల్లగొండ, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గాల నుంచి గానీ మహిళా నేతలకు లోక్‌సభకు వెళ్లే అవకాశం రాలేదు. సీపీఎం నుంచి 1996 ఎన్నికల్లో మిర్యాలగూడ స్థానం నుంచి తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు మల్లు స్వరాజ్యం పోటీ చేసి ద్వితీయ స్థానంలో నిలిచారే తప్ప విజయం సాధించలేకపోయారు. నల్లగొండ లోక్‌సభ నుంచి ప్రజారాజ్యం పార్టీ తరఫున 2009 ఎన్నికల్లో మల్లు స్వరాజ్యం తనయ పాదూరి కరుణ పోటీ చేసి, గణనీయమైన ఓట్లు సాధించారే తప్ప గెలుపుని అందుకోలేకపోయారు. గత ఎన్నికల్లో సీపీఎం నుంచి మల్లు స్వరాజ్యం కోడలు లక్ష్మి పోటీ చేసినా విజయం దక్కలేదు. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన నాగర్ కర్నూలులో 2019లో బంగారు శ్రుతికి అవకాశం వచ్చినా.. గెలవలేదు.

- నల్లగొండ, మహబూబ్‌నగర్, కరీంనగర్ - ఆంధ్రజ్యోతి

అతివకు చోటేదీ!?

» మహిళలకు దక్కని ఎంపీ చాన్స్

» రాష్ట్రంలోని పది నియోజకవర్గాల్లో ఇప్పటికీ నో

» కేవలం ఏడు నియోజకవర్గాల నుంచే పార్లమెంటుకు

లోక్‌సభకు మహిళలను పంపిన నియోజకవర్గాలివే!
వరంగల్
సికింద్రాబాద్
ఖమ్మం
నిజామాబాద్
మెదక్
పెద్దపల్లి
మహబూబాబాద్

ఇప్పటి వరకూ మహిళా ప్రాతినిధ్యం లేని నియోజకవర్గాలు		
ఆదిలాబాద్	మహబూబ్‌నగర్	భువనగిరి
కరీంనగర్	హైదరాబాద్	మల్కాజిగిరి
హన్మకొండ	నాగర్‌కర్నూలు	చేవెళ్ల, జహీరాబాద్

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.*



బిట్ మెస్రాలో అకడమిక్ ప్రోగ్రామ్‌లు

బీహెచ్ఎంసీటీ

ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా 18 వారాల ఇండస్ట్రియల్ ట్రెయినింగ్, సెమిస్టర్ బ్రేక్ సమయంలో ఒకేషనల్ ట్రెయినింగ్ ఉంటాయి. అకడమిక్ మెరిట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్ ఒక సబ్జెక్ట్‌గా ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థులు 1999 అక్టోబరు 1 తరవాత జన్మించి ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 10

ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల: జూన్ 18

ఎమ్మెస్సీ

ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'బయో ఇన్ఫర్మాటిక్స్ అండ్ కంప్యూటేషనల్ బయాలజీ'. ఈ కోర్సు వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లు పూర్తిచేశాక కోర్సు నుంచి వైదొలగే వీలుంది. వీరికి పీజీ డిప్లొమా ప్రదానం చేస్తారు. సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ ప్రోగ్రామ్ జైపూర్ క్యాంపస్‌లో ఉంది.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ లేదా మేథమెటికల్/ఫిజికల్/కెమికల్/బయలాజికల్ సైన్సెస్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. ఇంటర్ స్థాయి మేథమెటిక్స్‌లో పరిజ్ఞానం తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. వీరు 2024 జూన్ 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. (గేట్/జీప్యాట్) (2022/2023/2024) స్కోర్ లేదా జామ్/సీయూసెట్ 2024 స్కోర్ ఉన్న వారు ఆన్‌లైన్ టెస్ట్ రాయనవసరం లేదు. ఆన్‌లైన్ టెస్ట్‌లో జామ్/సీయూసెట్ సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 10

కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల: జూన్ 14

ఆన్‌లైన్ టెస్ట్/ఇంటర్వ్యూ/కౌన్సెలింగ్: జూన్ 19 నుంచి 20 వరకు

పీహెచ్‌డీ

మెస్రా క్యాంపస్‌లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. అకడమిక్ మెరిట్, రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

విభాగాలు: ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, బయో ఇంజనీరింగ్ అండ్ బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, క్వాంటిటేటివ్ ఎకనామిక్స్ అండ్ డేటా సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫిజిక్స్, ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, రిమోట్ సెన్సింగ్, స్పేస్ ఇంజనీరింగ్ అండ్ రాకెట్రీ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ ఇంజనీరింగ్/ఎంఆర్క్/ఎంఫార్మసీ/ఎంఎస్ ఫార్మసీ/ఎమ్మెస్సీ ఫార్మసీ/ఎంప్లాన్/ఎంసీఏ/ఎంబీఏ/ఎంఏ/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులు; కనీసం 80 శాతం మార్కులతో బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్/బీఫార్మసీ/బీఆర్క్/బీప్లాన్ ఉత్తీర్ణతతోపాటు గేట్/జీప్యాట్‌లో కనీసం 80 పర్సంటైల్ సాధించినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి ఏడాది పరీక్షలు రాసే వారు కూడా అర్హులే. వీరు 2024 ఆగస్టు 31 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. యూజీసీ/సీఎస్ఐఆర్/డీబీటీ/ఐసీఎంఆర్‌ల నుంచి జేఆర్ఎఫ్ అర్హత పొందినవారు, గేట్/నెట్ అర్హత పొందిన వారు రిటెన్ టెస్ట్ రాయనవసరం లేదు. రిటెన్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 12

రిటెన్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల: మే 17

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **వెబ్‌సైట్:** bitmesra.ac.in




లిటిల్స్



మీకు తెలుసా?

- తలమీద ఎర్రగా ఉండే ఈ నల్లని పిట్ట పేరు 'బ్లాక్ ఉడ్‌పెకర్'. తెలుగులో నల్లని వడ్రంగి పిట్ట అంటారు. ఇవి యూరోపియన్ దేశాల్లో ఎక్కువగా కనిపిస్తాయి.
- ఆసియాతో పాటు ఉత్తర, అమెరికా దక్షిణ అమెరికాల్లో కూడా ఉంటాయి. ఇవి ఎక్కడ ఉంటే అక్కడే ఉంటాయి. ఇతర ప్రదేశాలకు వెళ్లటానికి ఇష్టపడవు.
- 55 సెం.మీ. పొడవు ఉండే ఈ పక్షి వింగ్ స్పాన్ 84 సెం.మీ.
- ఈ పక్షి ముక్కు గట్టిగా ఉంటుంది. ఎండిపోయిన లేదా ఫంగస్‌తో, పురుగుల వల్ల ఎండిపోయిన చెట్లను ఇవి తొలుస్తాయి. వీటి మెడ కండరాలు స్ట్రాంగ్‌గా ఉండటం వల్ల సులువుగా చెట్లను తొలుస్తాయివి. ఒక్కోసారి ఆరోగ్యంగా ఉండే చెట్లనూ తొలుస్తాయి. గూడు చేసుకుంటాయి. ఈ పక్షులు మరో గూడు చేసుకున్నప్పుడు ఇతర పక్షులు ఆ గూళ్లలో ఆవాసాలను ఏర్పరచుకుంటాయి. అన్నట్లు 50 సెం.మీ. కంటే లోతు చెట్లను తొలుస్తాయి.
- వడ్రంగి పిట్టలు ప్రపంచ వ్యాప్తంగా 180 రకాలు ఉన్నాయి.
- పురుగులు, చెట్ల మీద ఉండే చీమలను తింటాయి.
- ఆరు గుడ్లను పెడతాయి. 20 రోజుల పాటు పొదుగుతాయి.

నిట్ ఢిల్లీలో ఎగ్జిక్యూటివ్ ఎంటెక్



ఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- ఎగ్జిక్యూటివ్ ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. వీటిలో నాలుగు సెమిస్టర్లు కోర్సు వర్క్, రెండు సెమిస్టర్లు డిజర్టేషన్ వర్క్ ఉంటాయి. వారాంతాల్లో ఆన్‌లైన్ ద్వారా థియరీ క్లాసెస్ నిర్వహిస్తారు. వీటికి 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఇన్‌స్టిట్యూట్‌లో అయిదు రోజులపాటు నిర్వహించే ల్యాబొరేటరీ తరగతులకు అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌ను రిజిస్టర్ చేసుకున్న నాటినుంచి గరిష్ఠంగా అయిదేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. అకడమిక్ మెరిట్, రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అడ్మిషన్ పొందినవారికి ఎటువంటి ఫైనాన్షియల్ అసిస్టెన్స్/స్కాలర్‌షిప్ లభించవు.

స్పెషలైజేషన్‌లు

- కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్/మాన్యుఫాక్చరింగ్ (క్యాడ్/క్యామ్)
- అడిటివ్ మాన్యుఫాక్చరింగ్(ఏఎం)
- సీట్లు: స్పెషలైజేషన్‌కు 25 చొప్పున మొత్తం 50 సీట్లు ఉన్నాయి

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో (బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్)(మెకానికల్ ఇంజనీరింగ్/ఆటోమేషన్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్/మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్/మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్/ఆటోమొబైల్ ఇంజనీరింగ్/ఏరోస్పేస్ ఇంజనీరింగ్/మైనింగ్ మెషినరీ ఇంజనీరింగ్) పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులకు 2024 జూన్ 30 నాటికి ఏడాది పోస్ట్ క్వాలిఫికేషన్ అనుభవం ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జూన్ 30
- **అకడమిక్ మెరిట్ ప్రకారం అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూలై 10
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 11
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 18
- **వెబ్‌సైట్:** https://nitdelhi.ac.in

నిట్ హమీర్‌పూర్‌లో ఎంబీఏ

హమీర్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్‌హెచ్)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాజెక్ట్ వర్క్‌లు, సమ్మర్ ఇంటర్న్‌షిప్ ఉంటాయి. రెండు స్పెషలైజేషన్‌లు ఎంచుకొనే వీలుంది. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. జాతీయ పరీక్ష స్కోర్, టెస్ట్ పర్సంటైల్, ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

స్పెషలైజేషన్‌లు: హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతూ 2024 సెప్టెంబరు 15 నాటికి సర్టిఫికెట్ సబ్మిట్ చేయగలిగే అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్/మ్యాట్/సీమ్యాట్/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

వెయిటేజీ: క్యాట్ స్కోర్‌కు 10 మార్కులు, సీమ్యాట్ స్కోర్‌కు 7 మార్కులు, మ్యాట్ స్కోర్‌కు 5 మార్కుల వెయిటేజీ ఇస్తారు.

- జాతీయ పరీక్ష స్కోర్‌కు 25 మార్కులు, ఇంటర్వ్యూ స్కోర్‌కు 15 మార్కులు, టెస్ట్ పర్సంటైల్‌కు 10 మార్కులు కేటాయించారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** మే 28, 29
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 6
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించాల్సిన తేదీ:** జూన్ 18
- **వెబ్‌సైట్:** www.nith.ac.in

జాబ్ కార్నర్

ఐకార్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోయాబీన్ రీసెర్చ్, ఇండోర్(మధ్యప్రదేశ్)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఐఐఎస్ఆర్‌లో జేఆర్ఎఫ్

1. జూనియర్ రీసెర్చ్ ఫెలో: **3 పోస్టులు**
2. రీసెర్చ్ అసోసియేట్: **1 పోస్టు**
3. యంగ్ ప్రొఫెషనల్-2: **2 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి.

ఇంటర్వ్యూ తేదీలు: 2024 మే 2, 3

ప్రదేశం: ఐకార్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోయాబీన్ రీసెర్చ్, ఖండ్వడ రోడ్, ఇండోర్(మధ్యప్రదేశ్).

వెబ్‌సైట్: iisrindore.icar.gov.in/

ఉత్తర రైల్వేలో స్పోర్ట్స్ కోటాలో గ్రూప్-డి ఖాళీలు

న్యూఢిల్లీలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్, నార్తర్న్ రైల్వే... స్పోర్ట్స్ కోటాలో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టులు: 38

క్రీడాంశాలు: ఫుట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, బాక్సింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, హాకీ, బ్యాడ్మింటన్, కబడ్డీ, రెజ్లింగ్, చెస్.

అర్హత: 10వ తరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత క్రీడాంశంలో వివిధ స్థాయుల్లో ప్రతిభ చూపి ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి 18-25 ఏళ్ల మధ్య ఉండాలి

దరఖాస్తు రుసుము: ఎస్సీ, ఎస్టీ, మహిళలు, మైనార్టీలు, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.400.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 16

ట్రయల్ తేదీ: జూన్ 10

వెబ్‌సైట్: https://www.rrcnr.org/

హెచ్ఏఎల్, బెంగళూరులో మెడికల్ ఆఫీసర్లు

బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్... తాత్కాలిక ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మెడికల్ ఆఫీసర్(జనరల్ డ్యూటీ): **2 పోస్టులు**

అర్హత: ఎంబీబీఎస్‌తోపాటు పని అనుభవం ఉండాలి

వయోపరిమితి: 35 సంవత్సరాలు

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను చీఫ్ మేనేజర్(హెచ్ఆర్), హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, ఇండస్ట్రియల్ హెల్త్ సెంటర్, సురంజందాస్ రోడ్, విమానపుర, బెంగళూరు చిరునామాకు పంపాలి.


ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 13

వెబ్‌సైట్: www.hal-india.co.in/home

జత ఉన్న బొమ్మ ఏది?



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



6 తేడాలు గుర్తించండి



'టైమ్స్' జాబితాలో యూఫెస్ లెర్నింగ్

మన దేశంలో పేరొందిన ఎడ్యుటెక్ సంస్థ 'యూఫెస్ లెర్నింగ్'కు అంతర్జాతీయ గౌరవం లభించింది. 'టైమ్స్' ప్రకటించిన 2024 టాప్ ఎడ్యుటెక్ రైజింగ్ స్టార్స్ జాబితాలో ఈ సంస్థకు చోటు దక్కింది. విద్యకు సంబంధించి యూఫెస్ లెర్నింగ్ అనుసరించిన సరికొత్త విధానాలతో గ్లోబల్ ఎడ్యు సెక్టర్‌లో అరుదైన ఈ స్థానాన్ని పొందింది. గడచిన మూడు సంవత్సరాల్లో ఆదాయపరంగా అధికంగా ఆర్జించిన పదిహేను కంపెనీల్లో ఒకటిగా నిలిచింది. తరగతిగదికి ఇంటికి చేరిన తరవాత అభ్యాసానికి మధ్య ఉన్న అంతరాన్ని సరిదిద్దడంలో పలు సొల్యూషన్లను కంపెనీ ప్రవేశపెట్టగలిగింది. 2017లో ఆరంభమైన యూఫెస్ లెర్నింగ్ మన దేశంలో రమారమి పది వేల వరకు ప్రీమియం పాఠశాలల విద్యార్థులకు తనదైన పద్ధతిలో సేవలు అందిస్తోంది. అంతర్జాతీయంగా గుర్తింపు పొందినందుకు కంపెనీ సహ వ్యవస్థాపకుడు అమిత్ కపూర్ ఆనందం వ్యక్తం చేశారు. 'క్లాస్‌రూమ్ ఫస్ట్, కరికులమ్ ఫోకస్డ్' అప్రోచ్‌తో ఇండియాలో కోటి మంది విద్యార్థులకు చేరువ కాగలిగామని ఈ సందర్భంలో ఆయన తెలిపారు.

SCHOLARSHIP ALERT

TOEFL India Championship

Description: An initiative of ETS India Private Limited to help undergraduate students and working professionals pursue their dream of studying abroad.

Eligibility: Participants must currently be enrolled in the 3rd or 4th year of undergraduate studies at an accredited Indian higher education institution (college or university). Additionally, applicants who have completed their undergraduate or graduate studies in India and are seeking higher education abroad, or those with up to two years of verifiable professional work experience, are also eligible to apply.

Prizes & Rewards: Total prize money of 15 lacs

Last Date to Apply: 15-05-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/TOIC1

Voluntary Internship Scheme for Law Students

Description: Voluntary Internship Scheme for Law Students 2023 is an initiative by the Institute of Legislative Drafting and Research (ILDR) with the purpose to motivate students to create interest in legislative drafting as a profession.

Eligibility: Open for candidates pursuing 4th and 5th year integrated bachelor's degree in law (5 years) or pursuing the final year of 3 years bachelor's degree in law from recognised law colleges in the country.

Prizes & Rewards: A certificate by ILDR

Last Date to Apply: Round The Year

Application mode: Via email or post to - Branch Officer, ILDR, 416 'D' Wing, Legislative Department, Ministry of Law and Justice, Shastri Bhawan, New Delhi-110 001

Short Url: www.b4s.in/aj/VSL8



University of Bath GREAT Scholarship, India 2024

Description: University of Bath GREAT Scholarship, India 2024 is an opportunity offered by the University of Bath in collaboration with the British Council's Study UK campaign. Under this programme, students from 15 countries including India will receive financial support to pursue postgraduate study in the UK.

Eligibility: Open to Indian citizens with a valid passport who hold an offer for a full-time, postgraduate taught master's course at the University of Bath. Candidates must be classified as international students for tuition fee purposes and demonstrate an outstanding academic background.

Prizes & Rewards: A partial tuition fee of £10,000 for one year of study

Last Date to Apply: 20-05-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/UBG01

buddy4study.com

డైలీ సుడోకు - 295

	7			2		1		
	2				1		3	4
6								
				1	3		5	7
		2	9		5	8		
4	5		8	6				
								8
8	9		5				6	
		3		7			4	

సుడోకు - 294 సమాధానం

9	1	8	7	5	6	2	4	3
6	2	3	8	4	1	7	9	5
7	4	5	9	2	3	8	6	1
3	8	1	2	9	7	4	5	6
2	5	9	3	6	4	1	8	7
4	7	6	1	8	5	9	3	2
8	9	7	6	3	2	5	1	4
1	6	4	5	7	9	3	2	8
5	3	2	4	1	8	6	7	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.